నాగార్జునుడు



కె. సచ్చిదానంద మూర్తి

అనువాదం

పుల్లెల శ్రీరామచంద్రుడు

నాగార్జునుడు

జాతీయ జీవిత చరిత్ర

నాగార్జునుడు

కె.సచ్చిదానంద మూర్తి

అనువాదం

పుల్లెల శ్రీరామచంద్రుడు

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ముఖచిత్రం, నలంద వస్తు ప్రదర్శన శాలలోని నాగార్జునుని శిల్పం.

ISBN 978-81-237-5812-1

మొదటి ముద్రణ 2010 (*శక 1931*)

రూ. 45.00

Nagarjuna *(Telugu)*

సంచాలకులు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

నెహ్రూ భవన్, 5, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, ఫేస్-II

వసంత్‌కుంజ్, కొత్త ఢిల్లీ - 110 070 ద్వారా ప్రచురించబడింది.

విషయ సూచిక

మొదటి భాగం

I

ఉపోద్ఘాతం

ఈ ప్రపంచంలో నేటి వరకు ఆవిర్భవించిన అత్యుత్తమ తత్త్వచింతనా పరుల్లో నాగార్జునుడొకరు. అతి గంభీరమైన తాత్త్విక చింతన, తర్క బద్ధమైన ఆలోచనా విధానం, నిగూఢమైన ఆధ్యాత్మిక దృష్టి వీటిలో నాగార్జునునితో పోల్చదగిన భారతీయ తత్త్వవేత్త శంకరాచార్యులు తప్ప మరెవ్వరూ లేరని చెప్పవచ్చును. ప్రాచ్య దేశాలన్నింటినీ ఇంత గొప్పగా, చిరస్థాయిగా ప్రభావితం చేయడంలో నాగార్జునుణ్ణి మించగలిగిన వాడు బుద్ధుడు ఒక్కడే.* మరో పర్యాయం ధర్మచక్రం నడిపించడం కోసం బుద్ధుడే మళ్ళీ నాగార్జునుడుగా అవతరించాడని చైనా, జపాన్, టిబెట్ దేశాలలోని బౌద్ధుల విశ్వాసం. క్రీ.పూ.100 మొదలు క్రీ.శ.100 వరకూ గల కాలంలో బౌద్ధమతంలో పునర్వికాసం ప్రారంభమయింది. కొన్ని ప్రాచీన మూల సూత్రాలు మళ్ళీ ధ్రువీకరించబడ్డాయి. కొన్ని సిద్ధాంతాలకు కొత్త వ్యాఖ్యానాలు చేయడంతోపాటు, నూతనాంశాలు చేర్చడం ద్వారా వాటిని స్పష్టీకరించడం కూడా జరిగింది. కొన్ని వినూత్న సిద్ధాంతాలు రూపొందింప బడ్డాయి. వీటికన్నింటికీ అనుగుణంగా కొన్ని యోగాభ్యాస పద్ధతులూ, పూజా విధానాలూ, జీవన రీతులూ నెలకొల్పబడ్డాయి. ఇవన్నీ కాలక్రమంలో, విశాల భారతావనిలోనే కాక అతి దూరమైన మధ్య ఆసియా ప్రాంతంలోనూ, చైనా, కొరియా, జపాన్, టిబెట్ మొదలైన దేశాలలోనూ కూడా వ్యాపించి అక్కడ

---

* పాశ్చాత్య దేశాలపై క్రీస్తు, సేంట్‌పాల్‌ల ప్రభావాన్నీ, పశ్చిమ ఏషియా దేశాలపై మహమ్మద్ ప్రభావాన్నీ, ప్రాచ్య దేశాలపై ప్రసరించిన నాగార్జునుని ప్రభావంతో పోల్చవచ్చు.

నివసించే ప్రజల జీవిత విధానంలో అంగంగా ఏర్పడిపోయాయి. ఈ మత విశ్వాసాలనూ, ఆచారాలనూ అనుసరించే వారు దీనికి "మహాయానం" (గొప్ప మార్గం, గొప్ప వాహిక)గా పేరు పెట్టారు. బుద్ధుని ఉపదేశాలు మళ్ళీ క్రోడీకరించి వాటికన్నింటికీ ఏర్పరచిన ఒక విధమైన సమన్వయం మహాయానంలో కనబడుతుంది. మహాయానంలో ఒక విధమైన సమన్వయ దృష్టిని ప్రవర్తింప చేసి దీనికొక తాత్త్విక రూపాన్ని ఇవ్వడంలో ప్రధాన పాత్ర వహించినవాడు నాగార్జునుడు. అందువల్లనే "లంకావతారం" వంటి ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో "అన్ని మార్గాలకంటె అత్యుత్తమమైన మహాయానాన్ని ప్రవర్తింపచేసిన మహా మహిమాన్వితుడూ, విశ్వ విఖ్యాతుడూ అయిన బౌద్ధ భిక్షువు"[1] గా నాగార్జునుడు ప్రశంసింప బడ్డాడు. ఇతను "మహాయాన పితామహుడు".[2] భవిష్యత్తులో బుద్ధుడు (బోధిసత్త్వుడు) కాబోయే ఈ నాగార్జునుడు, ప్రతి ఒక్కరూ నిర్వాణం పొందాలనే ఉద్దేశ్యంతో బౌద్ధ సంఘంలో రహస్యంగా ఉన్న ఈ మార్గాన్ని బయటికి తీసికొని వచ్చాడని బౌద్ధుల విశ్వాసం.[3] "నాగార్జునుడే మహాయాన ప్రవర్తకుడు అని చెప్పవచ్చును" అని వ్రాయడానికి కూడా హనయమ షిన్షో అనే ఒక ఆధునిక పండితుడు వెనకాడలేదు.[4] "ఒక నూతన తాత్త్విక సిద్ధాంతాన్ని ఆవిష్కరించడమే కాకుండా, ప్రారంభ దశలో దీని ప్రచారానికి కూడా ఎంతగానో ప్రయత్నించిన వ్యక్తి నాగార్జునుడు. ఈ విధంగా (ఆవిష్కర్త గానూ, ప్రచారకుడు గానూ) రెండు స్వరూపాలు కలిసిన వ్యక్తి నాగార్జునుడు"[5] అని అంటాడు హెచ్. కెర్న్ అనే పండితుడు. "నాగార్జునుని వ్యక్తిత్వంలో ఒక సిద్ధాంతమూ, తత్ప్రచారము ఈ రెండూ ఇమిడి ఉన్నాయి"[6] అంటూ సర్ చార్లెస్ ఇలియట్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే అభివ్యక్తం చేశాడు.

నాగార్జునుడు రచించినవిగా నిస్సంశయంగా చెప్పదగిన గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించినట్లయితే మనం ఆయన సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవచ్చు. అవేకాక ఇంకా ఎన్నో గ్రంథాలు ఆయన రచించినట్లుగా చెబుతున్నారు. అయితే భాషా శాస్త్ర దృష్టితోనూ, ఐతిహాసిక దృష్టితోనూ వాటిని పరిశీలించగా అవి ఆయన రచనలు కావని తేలినది. నాగార్జునుని చుట్టూ ఎన్నో కథలు అల్లబడి ఉన్నాయి. వీటిలో చాలా వరకు అతనితో ఏ మాత్రమూ సంబంధం లేనివే. ఆతనికి సంబంధించని కల్పిత గాథలనూ, తరువాతి కాలంలో చేర్చిన కథాంశాలనూ తీసివేస్తే ఇంక మిగిలేది చాలా తక్కువగానే ఉంటుంది. అందుచేత

నాగార్జునుని వ్యక్తిత్వాన్ని గూర్చి నిర్దిష్టంగా తెలుసుకోవడం కూడా చాలా కష్టమైన విషయమే. ఆతని కాలాన్ని గూర్చిగాని, జీవితాన్ని గూర్చిగాని నిస్సంశయంగా తెలిపే విశ్వసనీయమైన చారిత్రకాధారాలు కూడా ఏవీ లేవు. సాంప్రదాయికంగా వస్తున్న కథలన్నీ పరస్పర విరుద్ధంగా ఉండడం చేత వాటి నుంచి కూడా మనకేమీ సరియైన విషయాలు లభించవు. అందుచేతనే అసలు నాగార్జునుడనే ఒక వ్యక్తి ఉండే వాడా అని కూడా కొందరు సందేహించ డానికి అవకాశం ఏర్పడింది. "నాగార్జునుడు" అనేది 'ఇతను నిజంగా ఉండేవాడు' అని కూడా మనం నిశ్చితంగా చెప్పడానికి వీలులేని ఒక వ్యక్తి యొక్క నామధేయం. ఆతనివని చెప్పే గ్రంథాలన్నీ అతడే రచించాడు అని నిశ్చితంగా చెప్పడం ఇంకా కష్టమైన విషయము" అని అంటాడు యమ్.వాల్లెసర్.[7] అయితే నాగార్జునుడనే వ్యక్తియే ఎన్నడూ పుట్టి ఉండలేదు అని చెప్పడం మాత్రం పూర్తిగా ప్రమాణ విరుద్ధము. ఎందుచేత ననగా, ఆతని గ్రంథాలు ఎన్నో లభిస్తున్నాయి. ప్రాచ్య దేశాలలో బౌద్ధ మత ప్రచారంలోనూ, దాని సైద్ధాంతిక వికాసంలోనూ ఆతని అత్యద్భుతమైన ప్రభావం ప్రసరించింది. తరతరాలుగా ఆసియా ఖండవాసుల హృదయాలలో ఆతని స్వరూప స్వభావాలను గూర్చిన అంశాలు స్థిరపడి ఉండడమే కాకుండా ఎందరో మహా మేధావులు ఈ అంశాలన్నింటినీ గ్రంథస్థం కూడా చేసి ఉన్నారు. ఇవన్నీ నాగార్జునుడు ఐతిహాసిక వ్యక్తి అనే విషయాన్ని నిరూపిస్తున్నాయి.

నాగార్జునుని వ్యక్తిత్వాన్ని గూర్చి నిశ్చితంగా తెలుసుకోవాలంటే, ముందుగా సాంప్రదాయికంగా వస్తున్న పరస్పర విరుద్ధాలైన కథలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించాలి. వాటిలో ఉండే భ్రాంతులన్నింటినీ తొలగించాలి. భిన్న దేశ కాలాలకు సంబంధించిన నాగార్జున నామధేయులతో ఈ నాగార్జునుణ్ణి ముడిపెట్టే కొందరి వాదనలు నిరాకరించాలి. నాగార్జునునికి సంబంధించిన, చాలా వరకూ విశ్వసనీయమైన కథలలో కూడా ఎన్నో కాల్పనికాంశాలు ఉన్నాయి. వాటినన్నింటినీ తొలగించాలి. ఇక రెండవ విషయం, ఈ పద్ధతులలో మనం విషయాలు సేకరించడానికి ప్రయత్నించినట్లయితే, ఆర్యదేవుడు, కుమారాజీవుడు, చిత్సాంగు, చంద్రకీర్తి, బురీస్టోన్, త్సాంగాపా వంటి వారు నాగార్జునుణ్ణి గూర్చి, ఆతని వ్యక్తిత్వాన్ని గూర్చి ఎలాంటి మానసిక చిత్రం ఏర్పరచుకోగలిగారో అలాంటి చిత్రాన్ని మనం కూడా ఏర్పరచుకోవచ్చును. ఇతనిని గూర్చి సంప్రదాయ సిద్ధంగా వినవస్తున్న విషయాలన్నింటినీ వివేచనా

దృష్టితో పరిశీలించినట్లయితే ఇతని విషయంలో సమగ్రమైన ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. అపుడు ఇతను ప్రజలను అంతగా ఎలా ప్రభావితుల్ని చేయగలిగాడో అర్థం అవుతుంది. ఈ విధంగా ఐతిహాసికంగా నాగార్జునునికి సంబంధించిన వైయుక్తిక సత్యాలను తెలుసుకోవడం ద్వారా మనకి అతనితో ఒక విధమైన సమకాలీనత్వాన్ని కల్పించుకొన్న పక్షంలో మనం అతని సిద్ధాంతాల ప్రకృతోపయోగిత్వాన్నీ, సార్థకత్వాన్నీ గ్రహించ గలుగుతాము. ఇక మూడవ విషయం, మానవుని అస్తిత్వానికీ, మానవుని ప్రధాన లక్ష్యాలకీ, మానవుని ప్రయత్నాలకీ సంబంధించిన ఎన్నో మౌలిక ప్రశ్నల సమాధానాలకై నాగార్జునుడు అన్వేషించాడు. సుదీర్ఘ మననం చేసి, బుద్ధుడు ఉపదేశించిన పవిత్ర జీవిత విధానాన్ని అనుసరించడంచేతా, ధ్యానయోగ సాధన చేతా లభించిన దివ్యదృష్టి ద్వారా ప్రశ్నలన్నింటికీ సమాధానాలు కనుక్కోవడమే కాకుండా వాటిని ఆచరణలో పెట్టి చూపించాడు. వేరు వేరు సంస్కృతులకు చెందిన, వేరు వేరు దేశాలలో ఉన్న ఎందరో మేధావంతులు తరతరాలుగా, ఇతని సిద్ధాంతాలూ, అనుభవాలూ కూడా సంతృప్తికరాలుగా ఉన్నట్లు భావించి వాటిని స్వీకరించారు. మనం కూడా ఈ సిద్ధాంతాలను అర్థం చేసుకున్నట్లయితే ఈ మౌలిక ప్రశ్నలకు సరియైన సమాధానాలు పొందవచ్చు. ఈ మూడు విధాలైన మార్గాలను అనుసరించడం ద్వారా మనం ఈ మౌలిక విషయాలను గూర్చి గంభీర మననం చేసిన ఏ తత్త్వ చింతకుని నుంచి అయినా, అనగా ప్లేటో లేదా పాస్కల్, అగస్టిన్ లేదా అక్వినస్, శంకరాచార్యులు లేదా రామానుజాచార్యులు, ఇలాంటి ఏ మహాపురుషుని నుంచి అయినా ఒక దారి కనుగొని మనకు ఉపయోగించే సమాధానాలు పొందవచ్చు.

II

నాగార్జునుడు - శంకరాచార్యుల లోని సామ్యాలు, వైధానిక నియమాలు

మనం ఇద్దరు తత్త్వవేత్తలకు సంబంధించిన ఐతిహాసిక గవేషణ విషయంలో అవలంబించదగిన విధానాలకు సంబంధించినంత వరకు ఒకే విధమైనటువంటి పరిస్థితులు ఉండడం గమనించదగినది. టిబెట్‌లో ప్రచారంలో ఉన్న కొన్ని కథల ప్రకారం నాగార్జునుడు క్రీ.పూ.482లో జన్మించాడు. చైనాలోని కొన్ని కథల ప్రకారం క్రీ.పూ. 212లో జన్మించాడు. ఒక మహాయాన గ్రంథం ప్రకారం, బుద్ధుడు నిర్యాణం చెందిన 1200 సంవత్సరాల తరువాత ఇతను జన్మించాడు. ఈ విషయంలో కాలక్రమేణా దాదాపు ఇరవై సంప్రదాయాలు, ఇరవై జన్మదినాల్ని సూచిస్తున్నాయి. ఒక సంప్రదాయం ప్రకారం నాగార్జునుడు అరవై సంవత్సరాలు జీవించగా, మరొక సంప్రదాయం ప్రకారం ఆరువందల సంవత్సరాలు జీవించాడు. నాగార్జునుడు ఇంకా జీవించే ఉన్నాడని మరొక సంప్రదాయం. ఈ విధంగా అతి దూరాలైన సంప్రదాయాల మధ్య ఇతని జీవిత ప్రమాణాన్ని గూర్చి ఎన్నో మత భేదాలు ఉన్నాయి. అనిశ్చిత కాలమైన ఒకే ఒక శిలాశాసనం నాగార్జునుణ్ణి పేర్కొనడం జరిగింది. ఇక, మన రెండవ తత్త్వవేత్త అయిన శంకరాచార్యుని విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. ద్వారక, పూరి, కాంచీ మఠాల ప్రకారం శంకరాచార్యుల కాలం క్రీ.పూ.509–477 అయితే, ఇతర సంప్రదాయాల ప్రకారం క్రీ.పూ.44 లేదా క్రీస్తు శకం 400 అని వుంది. ఒక సంప్రదాయం ప్రకారం లభించిన ఆధారాలను ప్రకారం, తొమ్మిదవ శతాబ్దానికి చెందిన కంబోడియాలోని శిలాశాసనం ప్రకారం ఈయన కాలం క్రీ.శ. 788–820 అని తెలుస్తుంది. అయితే ఈయన కాలం క్రీ.శ. 684–716 లేదా 688–720

అని మరొక సంప్రదాయం. ఈయన ఆయుఃప్రమాణాన్ని గూర్చి కూడా 32 సంవత్సరాలు, 38 సంవత్సరాలు, 85 సంవత్సరాలు అన్న అభిప్రాయభేదాలు ఉన్నాయి. 38 లేదా 85 సంవత్సరాలు అని అంగీకరించే పక్షంలో పైన చెప్పిన సంవత్సరాలు (684–716; 688–720 అనేవి) మారుతాయి. శంకరాచార్యులు, నాగార్జునుల జన్మస్థానాలని గూర్చిగాని, శంకరుడు దేహవిముక్తి చెందిన స్థానం గురించి గాని మనకు వినవచ్చే కథలలో కూడా ఏకీభావం లేదు. తమిళనాడు, విదర్భ ప్రాంతం, విదేహ దేశం, పశ్చిమ భారతం ఇంకా మరికొన్ని గుర్తింప శక్యం కాని ప్రదేశాలూ నాగార్జునుని జన్మ స్థానాలుగా పేర్కొనబడుతున్నాయి. అదే విధంగా శంకరాచార్యుల జన్మస్థానం విషయంలో కూడా కాలడి, శాసల, చిదంబరం మొదలైనవి పేర్కొనబడుతున్నాయి. నాగార్జునుడు నిర్యాణం చెందిన ప్రదేశాన్ని గూర్చి అభిప్రాయ భేదం లేదు కానీ శంకరాచార్యుల విషయంలో మాత్రం కాంచీపురం, కైలాసం, కేరళ దేశం మొదలైనవి పేర్కొనబడ్డాయి. కొన్ని మహాయాన గ్రంథాలలోనూ, కావ్యాలలోనూ, చరిత్రములని చెప్పబడే గ్రంథాల్లోనూ నాగార్జునుని చరిత్ర వర్ణించబడింది. అదేవిధంగా శంకరాచార్యుల జీవిత చరిత్ర కొన్ని పురాణాలలోనూ, "శివరహస్యం" అనే గ్రంథంలోనూ, శంకర విజయం లేదా శంకర దిగ్విజయం పేరుతో వ్రాసిన అనేక చరిత్ర గ్రంథాలలోనూ, గురుపరంపరా గ్రంథాలలోను వర్ణించబడి వుంది. అయితే ఈ తత్త్వవేత్తలిద్దరికీ సంబంధించిన ఇన్ని చరిత్ర గ్రంథాలలో ఏ రెండు గ్రంథాలకీ ఐకమత్యం లేకపోవడమే కాకుండా వైరుధ్యం కూడా కనబడుతుంది.

చైనా దేశీయుల సంప్రదాయం ప్రకారం నాగార్జునుడు ఇరవై నాలుగు గ్రంథాలు రచించాడు. ఇతను రచించిన ప్రధాన గ్రంథాలు ఆరు అని టిబెట్ దేశీయ సంప్రదాయము. నాగార్జునుడు తంత్ర శాస్త్రానికి సంబంధించిన ఎన్నో గ్రంథాలు రచించాడని కొందరూ, ఇంద్ర జాలము, వైద్యము, కామ శాస్త్రము, ధాతు వాదము, రసాయన శాస్త్రము, ఖనిజ శాస్త్రమూ మొదలైన ఎన్నో విషయాల మీద అనేక గ్రంథాలు రచించి ఉన్నాడని మరికొందరు చెబుతున్నారు. ఇదేవిధంగా శంకరాచార్యులు కూడా 250 గ్రంథాలు రచించినట్లుగా కొందరి అభిప్రాయం. వీటిలో అనేక స్తోత్రాలూ, స్వతంత్ర గ్రంథాలూ, తంత్ర శాస్త్ర గ్రంథాలపై వ్యాఖ్యలూ, స్వతంత్రంగా వ్రాసిన తంత్ర శాస్త్ర గ్రంథాలూ (సౌందర్యలహరి, ప్రపంచ సారము, లలితా త్రిశతీ భాష్యము, నృసింహతాపనీయ భాష్యము మొదలైనవి).

నాగార్జునుడు మహామాయూరీ విద్యోపాసన చేయగా, శంకరాచార్యుల వారు శ్రీ విద్యోపాసన చేసేవాడు. ఇద్దరూ కూడా లోకోత్తరమైన అద్భుత శక్తులుగల యోగీంద్రులే. ఇద్దరూ జీర్ణ దేవాలయోద్ధరణాలు చేయించారు. కురుకుళ్ల, ఏకజట మొదలైన శక్తుల ఆరాధనను నాగార్జునుడు ప్రచారంలోకి తేగా, శంకరులు పంచాయతన పూజను ప్రచారంలోకి తీసుకొని వచ్చి వైష్ణవ, కాపాలిక మొదలగు సిద్ధాంతాలకి కూడా ప్రోత్సాహం ఇచ్చాడు.[8] ఇద్దరూ కూడా నిర్గుణ పరతత్త్వానికి రూపకల్పన చేసి ఆరాధించినవారే. నాగార్జునుడు ఎనభై అయిదుగురు సిద్ధులలో ఒకడైతే శంకరాచార్యులు శ్రీ విద్యాచార్యులలో డెబ్బై ఒకటవ వాడు. ఈయనకు పధ్నాలుగురు శిష్యులు ఉండేవారు.[9] శంకరాచార్యుల గురువైన గోవింద భగవత్పాదాచార్యులు కూడా ఒక సిద్ధ పురుషుడనీ, ధాతు వాద ప్రక్రియలో అయన నిపుణుడనీ ప్రసిద్ధి.[10] మాధవ రచితమైన "శంకర విజయం" వంటి సుందర కావ్యాల్లో కూడా శంకరాచార్యులు, బాణుడూ (7వ శతాబ్దం), దండి (క్రీ.శ.700 ప్రాంతం), ఉదయనుడు (10 వ శతాబ్దం), అభినవ గుప్తుడూ (క్రీ.శ. 950-1000 ప్రాంతం), శ్రీ హర్షుడూ (12వ శతాబ్దం ఉత్తరార్థం) మొదలైన విద్వాంసులకు సమకాలికుడనీ, వీరందరినీ వాదంలో ఓడించాడనీ వర్ణించ బడింది.[11] అదేవిధంగా నాగార్జునుని గురించిన చరిత్ర గ్రంథాలలో కూడా వివిధ అంశాలు ఉన్నాయి. అమరావతి స్తూపానికి చుట్టూ ఒక లోహావరణాన్ని కట్టించడానికి (మూడవ శతాబ్దికి పూర్వం) నాగార్జునుని ప్రేరణమే కారణమట. నాగార్జునుడు నలందా విశ్వ విద్యాలయంలో విద్యాభ్యాసం చేసి కాలాంతరంలో ఆ విశ్వ విద్యాలయంలోని బౌద్ధ పరివ్రాజక సంఘానికి సంబంధించిన ఒక అధికార పదాన్ని నిర్వహించాడట. ఈ విశ్వ విద్యాలయం క్రీ.శ.425 ప్రాంతంలో నిశ్చితంగా 415-416 సంవత్సరం తరువాతనే స్థాపించ బడింది. ఇతను పాల వంశీయుడైన ధర్మపాలుడు (క్రీ.శ. 770-810) స్థాపించిన విక్రమశిలా విశ్వ విద్యాలయానికి చెందిన పండితులకు సమకాలికుడు కూడానట. ఇవన్నీ నిజమే అయిన పక్షంలో నాగార్జునుడు 600 సంవత్సరాలకి తక్కువ కాకుండా జీవించి ఉండాలి. ఈ విధంగా రెండు సంస్కృతులను స్థాపించిన ఈ ఇద్దరి ఆచార్యుల జీవిత చరిత్రలకి సంబంధించిన అంశాలలో ఉన్న సామ్యాన్ని మనం దృష్టిలో ఉంచుకొన్నట్లయితే విషయాన్ని సరిగా అర్థం చేసుకొని, దానిని ప్రతిపాదించడానికి వీలవుతుంది.

శంకరాచార్యుల గూర్చిన సందేహాలన్నింటినీ ఐతిహాసిక పరిశీలన ద్వారా, తద్గ్రంథ పరిశీలన ద్వారా తొలగించడానికి వీలు ఏర్పడింది. ఆతని కాలాదులను దాదాపు నిశ్చిత రూపంలో నిర్ణయించడం జరిగింది. అతని రచనలే అని నిశ్చితంగా చెప్పదగిన రచనలన్నింటినీ గుర్తించి రెండు సార్లు ప్రచురించడమూ, వాటిని పాశ్చాత్య భాషలలోకి, భారత భాషలలోకి అనువదించడం కూడా జరిగాయి. ఆయన ప్రతిపాదించిన తత్త్వాన్ని విశదీకరిస్తూ ఎన్నో ప్రకరణ గ్రంథాలు కూడా వ్రాయటం జరిగింది. అయిదారు జీవిత చరిత్రలు ప్రకటించబడ్డాయి. అయితే నాగార్జునునికీ, ఆయన గ్రంథాలకీ సంబంధించినంత వరకు, చెప్పుకోదగిన పని ఏమీ జరగలేదు. ఆయన గ్రంథాలన్నీ ఇంకా ప్రచురించబడలేదు. అందుచేత అవి అందరికీ అనాయాసంగా అందుబాటులోకి రాలేదు. ఆయన ప్రధాన గ్రంథాన్ని కూడా ఆంగ్లంలోకి పూర్తిగా రెండు సార్లు మాత్రమే అనువదించడం జరిగింది. అదైనా ఈ మధ్యనే. దీనికంతకీ ఒక కారణం ఏమిటంటే, నాగార్జునునికి సంబంధించిన విషయాలన్నీ చైనా, టిబెట్, సంస్కృత భాషలలో ఉన్నాయి. ఆతని మూలగ్రంథాలు కొన్ని నష్టమైపోయి వాటి చైనా, టిబెట్ భాషానువాదాలు మాత్రమే లభిస్తున్నాయి. అనువాద రూపంలో ఉన్న ఈ గ్రంథాలలో చాలా పాఠభేదాలు కనబడుతున్నాయి. రెండవ కారణం- బౌద్ధ గ్రంథ అధ్యయనం విషయంలో భారతీయులకు నిగూఢమైన ఆసక్తి కాని, శ్రద్ధకాని లేదు. అదేవిధంగా పాశ్చాత్య పండితుల్లో కూడా అద్వైత వేదాంత, ప్రాచీన బౌద్ధ మతాల విషయంలో ఉన్నంత శ్రద్ధ మహాయానం విషయంలో, ముఖ్యంగా మాధ్యమిక సిద్ధాంతం విషయంలో లేదు. అయినా కూడా నాగార్జునుని జీవితచరిత్ర విషయంలో ఉన్న నిక్షిప్త భావాలన్నీ తొలగించి, ఆతని సిద్ధాంతాలను ఒక నిర్దిష్ట రూపంలో ప్రతిపాదించడానికి అవకాశం లేకపోలేదు. అదే ఈ గ్రంథం లక్ష్యము.

ఈ కార్యాన్ని సాగించడానికి ఈ క్రింది అంశాలను మార్గదర్శక సూత్రాలుగా తీసుకోవచ్చును.

1. నాగార్జునుని సిద్ధాంతానికి కాని, ఆతని జీవితంలోని సంఘటనకు గాని సంబంధించి, భారత-చైనా-టిబెట్ దేశాలలో లభించే ఆధారాల్లో ఏకత ఉన్న పక్షంలో వాటిని యథార్థమైన వాటినిగాను, ఐతిహాసిక సత్యాలుగాను గ్రహించాలి.
2. ఆతని గ్రంథం ఏదైనా సంస్కృతంలో ఉండి, ఆసియా ఖండ భాషలలో ఏ

భాషలోనైనా దాని ప్రాచీన అనువాదం లభించినట్లయితే, దాని మీద ఏవైనా ప్రామాణిక వ్యాఖ్యానాలున్నట్లయితే, అది నిస్సంశయంగా అతని గ్రంథమే.

3. అతని మూల గ్రంథం ఇపుడు లభించకపోయినా, చైనా, టిబెట్టు భాషలలో లభించే దాని అనువాదాలలో విషయ భేదాలు లేకపోయినట్లయితే అది కూడా అతని గ్రంథమే.
4. అతని గ్రంథం సంపూర్ణంగాకాని, విశీర్ణ రూపంలో కాని సంస్కృతంలో మాత్రమే లభిస్తూ, అతని ఇతర గ్రంథాలకు వ్రాసిన ప్రామాణిక వ్యాఖ్యానాలలో ఈ గ్రంథం నుంచి ఉద్ధరణలు ఉదహరించబడినట్లయితే ఆ గ్రంథం కూడా అతనిదే అని కొంత వరకు నిశ్చితంగా చెప్పవచ్చును.
5. పై తెగలకి చెందిన గ్రంథాలకి విరుద్ధంగా వున్న విషయాలు చెప్పే ఏ గ్రంథమైనా అతనిది అవడానికి అవకాశం లేదు.
6. ఒక గ్రంథం పై మూడు భాషలలో ఏదో ఒక భాషలో మాత్రమే ఉండి, అతని సిద్ధాంతాలు ప్రతిపాదిస్తూ ఇతరులు వ్రాసిన ప్రామాణిక గ్రంథాలలో కాని, అతని గ్రంథాలకు వ్రాసిన వ్యాఖ్యానాలలోకాని, ఆ గ్రంథం నుంచి ఉదాహరణలు చూపడం జరగకపోతే ఆ గ్రంథం అతనిది అవడానికి ఏ మాత్రమూ అవకాశం లేదు.
7. అతను రచించినట్టుగా చెప్పబడే ఒక ప్రాచీన గ్రంథం భారత, చైనా, టిబెట్టు భాషలలో ఏదో ఒక భాషలో మాత్రమే ఉన్నా కూడా, పైన పేర్కొన్న తెగకి చెందిన గ్రంథాలకు విరుద్ధంగా లేని పక్షంలో అది అతని గ్రంథమే కావచ్చును.
8. ఒక గ్రంథం పైన చెప్పిన నియమాలన్నింటికీ లోబడి ఉండవచ్చును. ఇలా ఉండడం అసంభావ్యమే అయినా అలా ఉన్న పక్షంలో కూడా, ఆ గ్రంధంలో నాగార్జునుని తరువాతి కాలానికి సంబంధించిన సిద్ధాంతాలు, సంఘటనలు గాని వర్ణించబడి ఉన్నట్లయితే ఆ గ్రంథం అంతా అప్రామాణికమే అని చెప్పాలి. లేదా అతను చెప్పిన విషయాలకి కొన్ని అప్రామాణికమైన ఇతరాంశాలు చేర్చబడ్డాయని చెప్పాలి.
9. అతని జీవిత చరిత్రకు సంబంధించినంత వరకు, అతి ప్రాచీనమైన కథాంశాలనూ, అంతగా లోక కథా రూపంలో లేని వాటినీ, ప్రామాణికాలే అని అంగీకరించవచ్చును.

10. ఆ కథ ఎంత ప్రాచీనమైతే. ఎంత సంభావ్యమైతే, ఎంత విశ్వసనీయ సత్య ప్రతిపాదకమైతే అంతగా ప్రామాణికమని గ్రహించాలి.
11. ఇంచుమించుగా ఆతను ఏ కాలానికి చెందినట్లు నిర్ణయించబడిందో దానికి పూర్వకాలంతో గాని, ఉత్తరకాలంతో గాని సంబంధించిన వ్యక్తుల తోటి, సంఘటనలతోటి ఆతనికి సంబంధం కల్పిస్తూ చెప్పే కథలన్నీ కూడా కట్టు కథలే.
12. అద్భుత ప్రభావ ప్రదర్శకాలైన కథలన్నింటినీ కాల్పనిక కథలుగాను, పౌరాణిక గాథలుగాను కొట్టి వేయవచ్చు.అయితే వాటికి ప్రతీక రూపాల్లో ఏమైనా ప్రామాణ్యం ఉంటే ఉండవచ్చును.
13. ఆతని కాలానికి చెందిన వ్యక్తులలోను, సంఘటనలోను ఆతనికున్న సంబంధాన్ని వర్ణిస్తూ తరువాతి వారు వ్రాసిన రెండు లేదా అంతకంటే ఎక్కువైన కథలేవైనా ఉంటే అవి ప్రామాణిక కథాంశాలను మనకు అందచేస్తున్నట్లుగా గ్రహించ వచ్చును. అయితే వీటిలో కూడా కాల్పనిక అంశాలు ఏవైనా ఉంటే వాటిని పరిహరించవలసి ఉంటుంది.
14. రెండు లేదా అంతకంటే అధికమైన సాంస్కృతిక సంప్రదాయాలలో ఆతనిని గూర్చి ప్రచారంలో వున్న కథాంశాలను ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సమర్థించే శిలాశాసన, వాఙ్మయాధి రూపాలైన ఆధారాలేవైనా వుంటే ఆ కథాంశాలనే చాలా వరకు ప్రామాణికాలుగా అంగీకరించవచ్చును.

చివరకు ఒక విషయం గుర్తు ఉంచుకోవాలి. అతి ప్రాచీన, ప్రాచీన కాలానికి సంబంధించిన వ్యక్తుల విషయంలో, ముఖ్యంగా ప్రాచ్య దేశాలలో, ఐతిహాసిక పరిశోధనం ద్వారాగానీ, వాఙ్మయ పరిశీలన ద్వారా గాని పూర్తిగా సత్యమైన పరిస్థితులను తెలుసుకొంటామనేది అసంభవం. భారత దేశం విషయంలో ఇది ఇంకా ఎక్కువ. ఈ గ్రంథంలో చెప్పబోయే నాగార్జునుని జీవితానికి సంబంధించిన విషయాలన్నింటినీ నిర్ణయించడంలో పైన పేర్కొన్న పద్ధతులను ఆధారంగా తీసుకోవడం జరిగింది. అయితే ఇది ఈ విషయాలను ప్రతిపాదించే క్రమంలో అవలంబించిన నూతన ప్రక్రియయే. అయినా ఇది పండితులను మాత్రమే దృష్టిలో ఉంచుకొని వ్రాసిన శాస్త్రగ్రంథం కాకపోవడం చేత విస్తృతంగా ప్రమాణాలను ఉదాహరించలేదు. దస్తావేజులను గురించి ముచ్చటించ లేదు.

III

నాగార్జున యుగం

జెన్ర్యో సుకమోటో చెప్పినట్లు నాగార్జునుడు "మహాయాన సిద్ధాంతానికి చక్కని వ్యవస్థ ఏర్పరచిన మొదటి మహాపురుషుడు".[12] అయితే ఇతను మహాయాన సిద్ధాంత స్థాపకుడు మాత్రం కాదు. ఈ విషయంలోని మౌలికాధారాలన్నింటికీ ఏకాభిప్రాయం ఉంది.[13] మహాయాన గ్రంథాలు సంస్కృత భాషలో ఉన్నాయి. వాటిలో చాలా వరకు ప్రాకృత భాషలలోనూ, ఇతర మాండలిక భాషల్లోనూ ఉన్న గ్రంథాల సంస్కృతానువాదాలు. మెనాందరు, పతంజలులకు (క్రీ.పూ. 150) పూర్వం వ్రాసిన బౌద్ధమత గ్రంథాలేవీ లేవు.[14] ఇప్పుడు ప్రచారంలో ఉన్నవేవీ క్రీస్తు శకం ప్రథమ శతాబ్దానికి పూర్వం వ్రాసినవి కావు. కొన్ని "ప్రజ్ఞా పారమిత సూత్రాలు" అతి ప్రాచీనమైన మహాయన సిద్ధాంత గ్రంథాల కోవకు చెందాయి. ఈ తరగతి వాఙ్మయానికి సంబంధించిన మూల గ్రంథాలను క్రీ.పూ. 100 మొదలు క్రీ.శ. 100 వరకు ఉన్న కాలంలో విస్తృతం చేయడం జరిగిందని ఇ. కోన్జ్ అనే పండితుడు అతి సూక్ష్మంగా గ్రంథ విశ్లేషణ చేసిన తరువాత ఒక నిర్ణయానికి వచ్చాడు.[16] ఈ సూత్రాలన్నింటిలోకీ అతి ప్రాచీనమైనది "అష్ట సాహస్రిక", దాని రచన పూర్తి అయ్యేసరికి రెండు శతాబ్దాల కాలం పట్టింది.[16] ఈనాడు మనకు లభిస్తున్న ఆకారంలో ఈ గ్రంథం క్రీ.శ. 150 ప్రాంతం నాటికి సిద్ధమయింది.[17] దీనిని క్రీ.శ. 179-80 సంవత్సరంలో లోక క్షేముడనే ఒక ఇండో-సేథియన్ పండితుడు చైనా భాషలోకి అనువదించాడు. మరొక కోవకు చెందిన అతి ప్రాచీన మహాయాన గ్రంథాలలో "మహా సుఖవతీ వ్యూహం" ఒకటి. ఇది క్రీ.శ. 147-186 సంవత్సరాల మధ్య చైనా భాషలోకి అనువదించ బడింది. అమితాభ బుద్ధుని ఉపాసన చేయడంవల్ల మోక్షం లభిస్తుందని ఈ

గ్రంథం ఉపదేశిస్తున్నది. చైనా భాషలోకి అనువదించే నాటికి కనీసం రెండు మూడు దశాబ్దాలకు పూర్వమే ఈ గ్రంథం పూర్తి చేయబడి ఉండాలి. దీనిలోని విషయాలు అతి ప్రాచీనమైనవి కావు. నాగార్జునుని తత్త్వశాస్త్రం ప్రజ్ఞా పారమితా సిద్ధాంతానికి ఒక నిర్ణీత రూపాన్ని ఇచ్చిందని అతి ప్రాచీనులైన చైనా, భారత దేశీయ వ్యాఖ్యాతల అభిప్రాయం. నాగార్జునుడు అమితాభోపాసకుడనే విషయాన్ని విశ్వసనీయాలైన అతని జీవిత చరిత్రలూ, అమితాభ సంప్రదాయ గ్రంథాలూ, అతనే వ్రాసిన ఒక మతలేఖ ధ్రువ పరుస్తున్నాయి. అందుచేత నాగార్జునుడు, ప్రజ్ఞాపారమిత సిద్ధాంతమూ, అమితాభ సంప్రదాయమూ ప్రచారంలోకి వచ్చిన తరువాతనే, అనగా క్రీ.శ.100 తరువాతనే ఆవిర్భవించి ఉండాలి. అది కూడా, బహుశా, రెండవ శతాబ్దం ప్రారంభ దశాబ్దాలలో కాక తరువాతి దశాబ్దాల లోనే అయి ఉండాలి.

శాతవాహన వంశానికి చెందిన ఒక చక్రవర్తి నాగార్జునుని మిత్రుడనీ, నాగార్జునుడు అతనికే మతలేఖ వ్రాశాడనీ, వీరిద్దరూ కూడా ఒకే సమయంలో మరణించారనీ, భారత, చైనా, టిబెట్ దేశాలలో లభించే మౌలికాధారాలన్నీ ఏకగ్రీవంగా ప్రతిపాదిస్తున్నాయి. మనం పై అనుచ్ఛేదంలో చూసిన దానిని బట్టి క్రీ.శ.100 కి పూర్వం ఉన్న శాతవాహన రాజులతో నాగార్జునునికి సంబంధం ఉండడానికి అవకాశం లేదు. శాతవాహన వంశీయుల పాలన క్రీ.శ. 218తో[18] అంతమయింది. అందుచేత నాగార్జునుడు క్రీ.శ. 100–218 సంవత్సరాల మధ్య రాజ్యపాలన చేసిన శాతవాహన చక్రవర్తికి సమకాలికుడై ఉండాలి. నాగార్జునుడు అమరావతీ స్తూపం పునరుద్ధరించి, దానికి లోహ ప్రాకారం కట్టించి, దానిని అలంకరించాడని "మంజుశ్రీ మూలకల్పమూ",[19] టిబెట్‌లో లభించే కొన్ని మౌలికాధారాలూ నిశ్చితంగా చెపుతున్నాయి. ఈ స్తూపాన్ని క్రీ.శ.150–200 సంవత్సరాల మధ్య పూర్తిగా పునర్నిర్మాణం చేయడం[20] జరిగింది. ఈ కాలం అంతలోనూ కాని, కొంత భాగంలో కాని, నాగార్జునుడు మంచి పలుకుబడితో కార్యనిర్వహణ వ్యాపృతుడై ఉండి ఉండాలి. ఏపక్షం అంగీకరించినా, ఈ కాలానికి పూర్వం కాని, తరువాత కాని కొన్ని దశాబ్దాల పాటు, లేదా కొన్ని సంవత్సరాల పాటు అతను జీవించి ఉండాలి. మరొక విషయం ఏమనగా, శ్రీపర్వత మహా చైత్యానికి ఎదురుగా ఉన్న స్థలంలో, శాతవాహన రాజుల నాణాలు చాలా లభించాయి. దానిని బట్టీ, మరికొన్ని ఇతర ప్రమాణాలను బట్టీ, ఈ ప్రాంతం

శాతవాహనుల రాజ్యంలో అంతర్గత మైనదనీ, ఈ మహాచైత్యం శాతవాహనుల కాలంలోనే ఉండేదనీ చెప్పవచ్చును. 'పోలోమోలోహిలి' పర్వతం మీద నాగార్జునుని కోసం శాతవాహన రాజు కట్టించినట్లుగా హుయన్‌త్సాంగ్ చెప్పిన విహారం ఇదే అయి ఉండవచ్చును. (చూ.భాగం 2, విభాగం II). ఇక్ష్వాకు రాజైన సిరివీరపురి సదత రాజ్య కాలంలో (క్రీ.శ.235–255 లేదా 240–265) శ్రీ పర్వతం మీద ఒక మహాచైత్యాన్ని నెలకొల్పడం గాని, పునరుద్ధరించడం గాని జరిగిందని[21] ఒక శాసనాన్ని బట్టి తెలుస్తున్నది. పునరుద్ధరణమే అయిన పక్షంలో, అది హ్యూయన్‌త్సాంగ్ చెప్పిన శాతవాహన కాలీన చైత్యమే అయి ఉండవచ్చును. కనీసం యాభై అరవై సంవత్సరాలకు పూర్వం కట్టిన కట్టడమైతే తప్ప దానిని పునరుద్ధరించవలసిన పని ఉండదు. అందుచేత శ్రీపర్వతం మీద చైత్యం కట్టించిన రాజు యజ్ఞశ్రీ కాని, ఆతనికి పూర్వం ఉన్న మరొక శాతవాహన రాజు కాని అయి ఉంటాడని ఊహించడానికి అవకాశం వుంది. ఈ మహాచైత్యాన్ని కట్టించింది ఇక్ష్వాకు రాజులే అయిన పక్షంలో, శాతవాహనులు కట్టించింది మరొక చైత్యం అయి వుండాలి.

క్రీ.శ.150–200 సంవత్సరాల మధ్య, శివశ్రీ (150–157), చతరపన శాతకర్ణి (157–167), శివస్కందు (167–174), యజ్ఞశ్రీ (175–203)[22] అనే నలుగురు శాతవాహన రాజులు మారారు. ఈ నలుగురిలో ఒక రాజు లేదా శివశ్రీకి ముందు వాడయిన శాతకర్ణి (130–150), లేదా యజ్ఞశ్రీ తరువాత వచ్చిన చివరి ముగ్గురు రాజులలో ఒకరు, నాగార్జునుని మిత్రుడయి ఉంటాడు. నాగార్జునుడు మతలేఖను వ్రాసింది అతనికే అయి ఉంటుంది. విజయుడు (203–209) చంద్రశ్రీ, (209–211) మూడవ పులోమావి (211–218) అనే వారు శాతవాహన వంశీయుల్లో చివరి ముగ్గురు రాజులు. నాగార్జునుని మిత్రుడు సార్వభౌముడైన పక్షంలో అతను, రుద్రదాముని కుమార్తెను వివాహమాడినవాడు, దక్షిణా పథాధీశ్వరుడూ అయిన శాతకర్ణి అయినా కావాలి, లేదా శాతవాహన వంశీయులలో ప్రధానోత్తముడైన యజ్ఞశ్రీ కావాలి (చూ.భాగం 2, విభాగం II).

నాగార్జునునికి శాతవాహన రాజులతో వున్న సంబంధాన్నీ, నాగార్జునుడు చేయించిన అమరావతీ స్తూప పునరుద్ధరణాన్నీ ఆనాడు ఆ ప్రాంతంలో ప్రచారంలో ఉన్న అమితాభ సంప్రదాయాన్నీ ధ్రువీకరిస్తూ పురావస్తు శాస్త్రానికి సంబంధించిన ఆధారాలేవీ లభించకపోవడం ఆశ్చర్యకరంగా వుంది. అదేవిధంగా అమరావతీ,

శ్రీపర్వతాలలో లభించిన శిలాశాసనాల్లో కూడా ప్రజ్ఞా పారమితను గూర్చిగాని, మహాయానాన్ని గూర్చిగాని, నాగార్జున ప్రతిష్ఠాపితమైన మాధ్యమిక సిద్ధాంతాన్ని గూర్చిగాని నిర్దేశం లేదు. అయితే శిలాశాసనాది ప్రమాణాలు లభించనంత మాత్రం చేత, లభ్యమవుతున్న వాఙ్మయరూప ప్రమాణాన్ని కాని, సంబద్ధ విషయ పరిశీలనలో తేలిన నిర్ణయాలను కాని కాదనడానికి వీలులేదు. శంకరాచార్యులు నాలుగు ప్రసిద్ధ మఠాలను స్థాపించిన విషయం కాని, కాంచీ దేవాలయాన్ని పునరుద్ధరించినట్లుగాని సమకాలీన శిలాశాసనాది ప్రమాణాలు లేవు అనే విషయం తెలిసిన విషయమే కదా? కొన్ని శిలాశాసనాల ప్రకారం, అమరావతిలోని మహాచైత్యం ఛేతియ కిములకు చెందినదట. శ్రీపర్వతం మీద ఉన్నది అపర మహాదిన సేనియులకు చెందినదట. ఇవి బహుశా మహాయాన సంప్రదాయ సదృశాలైన సంప్రదాయాలై వుంటాయి, లేదా స్థవిర మహాయాన సంప్రదాయాలై ఉండాలి.

నాగార్జునుని పేరు ఉన్న ఏకైక శిలాశాసనాన్ని గూర్చి ఇక్కడ ముచ్చటించడం ఉచితము. అమరావతికి వాయవ్యంగా ముప్పై మైళ్ళ దూరంలో, గోదావరికి శాఖా నదియైన పాలేరు నది తీరాన, ఆ రెండు నదులూ కలిసిన స్థలానికి నాలుగు మైళ్ళు దూరంగా, జగ్గయ్యపేట (బేతవోలు) అనే గ్రామం వుంది. దానికి పూర్వం 'వెల్లగిరి' అనే పేరు ఉండేది. అక్కడ ఒక గొప్ప స్తూపం ఉండేది. అక్కడ జరిపిన త్రవ్వకాలలో సిరివీరపురి సదాత వ్రాయించిన ఎన్నో ప్రాకృత శిలా శాసనాలు లభించాయి. ఒక ఫలకం మీద అధికోల్బణ శిల్పరీతిలో నిలచి ఉన్నట్లు చెక్కిన బుద్ధ విగ్రహము యొక్క పాదాల క్రింద వ్రాసిన సంస్కృత (శిలా) శాసనం కూడా వుంది. భదంత నాగాచార్యుని శిష్యుడైన జయాప్రభాచార్యుని శిష్యుడు చంద్రప్రభుడు తనకు బుద్ధత్వం లభించడం కోసమై ఆ బుద్ధవిగ్రహాన్ని స్థాపించి నాడని ఆ శిలాలేఖలో వ్రాసి వుంది. ఈ శిలాలేఖ కనుగొన్న బర్జెస్ దీనిలో వాడిన లిపి దాదాపు క్రీ.శ.600 ప్రాంతానికి చెంది ఉంటుందని భావించగా టి.యన్. రామచంద్రన్ ఆ లిపి క్రీ.శ. 450-500 ప్రాంతాలలో ప్రచారంలో వున్న బ్రాహ్మిలిపి అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.[23] ఇందులో పేర్కొన్న నాగార్జునుడు సరహుని శిష్యుడైన తాంత్రిక నాగార్జునుడై ఉంటాడని కొందరు విమర్శకులు ఊహించారు. ఈ ఊహ సత్యమైతే, అతడు క్రీ.శ. 550 ప్రాంతంలో లేదా క్రీ.శ. 400 ప్రాంతంలో ఉండి ఉండాలి. ఇది అసంభవం ఎందుచేతనంటే :

(1) తాంత్రిక నాగార్జునుడు ఐతిహాసిక వ్యక్తియే అని అంగీకరించినా కూడా (చూ.తరువాత) అతను అంత ప్రాచీన కాలానికి చెందిన వాడవడానికి అవకాశం లేదు. (2) సరహునితో సంబంధంగల తాంత్రికుల నామావళిలో జయప్రభ, చంద్రప్రభుల పేర్లు లేవు. (3) "భదంత" అని అశ్వఘోష, నాగార్జునులకు వాడడం వున్నది. కానీ తాంత్రిక సిద్ధులకు ఆ విశేషణం ఉపయోగించడం అలవాటులో లేదు. (4) స్మృతి చిహ్నంగా వ్రాసిన ఈ (శిలా) శాసన తాత్పర్యమూ, ఆ విగ్రహమూ పూర్తిగా మహాయానానికి సంబంధించినవిగా కనబడుతున్నాయి. జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆకాలంలో ఒకరి కంటే ఎక్కువ నాగార్జునులు ఉండేవారని చెప్పడానికి అవకాశం లేదు. ఎందుచేత ననగా అప్పటికి ఇద్దరు నాగార్జునులుండే వారని చెప్పడానికి నిశ్చితమైన ఆధారం ఏమీ లేదు. అందుకు ప్రమాణంగా చూపే వాటిని మరొక విధంగా సమన్వయించడానికి అవకాశం ఉన్నది. పై లేఖ క్రీ.శ.300 సంవత్సరంలో లేదా క్రీ.శ.350 సంవత్సరంలో వ్రాసినది కాదనీ జయప్రభుడు నాగార్జునుని ప్రత్యక్షశిష్యుడు కాదని చెప్పడానికి నిశ్చితమైన ప్రమాణాలేవీ లేవు. చంపాధిపతికి గురువైన శివసోముని ఆజ్ఞానుసారంగా క్రీ.శ.877–887 ప్రాంతంలో శంకరాచార్యుల గూర్చి వ్రాయించబడినటువంటి కంబోడియాలోని ఏకైక శిలాశాసనం ఆతను శంకరాచార్యుల ప్రత్యక్ష శిష్యుడని ప్రతిపాదిస్తూన్నట్టుగానే,[24] ఈ శిలా శాసనం కూడా నాగార్జునుని నిర్దేశిస్తున్నదని చెప్పవచ్చును. ఏమైనా ఈ శిలా శాసనం వల్ల మనకు తెలిసిన క్రొత్త విషయాలేవీ లేవు. కంబోడియా శిలా శాసనాన్ని బట్టి శంకరాచార్యులు కంబోడియా వెళ్లినట్టు చెప్పడానికి ఏ విధంగా వీలులేదో, అదేవిధంగా కొందరు అనుకుంటున్నట్లు, నాగార్జునుడు జగ్గయ్య పేటలోను లేదా ఆంధ్ర దేశంలోను నివసించేవాడని ఈ శిలా శాసనాన్ని బట్టి చెప్పడానికి అవకాశం లేదు. జయప్రభ, చంద్రప్రభులను గూరించి తెలుసుకోవడానికి తగిన ఇతర ఆధారాలేవీ లేకపోవడం చేత, ఈ శిలాశాసనం నాగార్జునుని కాలం నిర్ణయించడానికి కూడా ఉపయోగపడదు. అయితే ఇది నాగార్జునుని ఐతిహాసిక వ్యక్తిత్వాన్ని గూర్చిన సందేహం పోగొట్టడానికి మాత్రం ఉపయోగపడుతుంది.

మనం పైన ఊహించిన నాగార్జునుని కాలం, చాలా వరకు సత్యమే అని చెప్పడానికి మరికొన్ని ఆధారాలున్నాయి! ఆర్యదేవుడు నాగార్జునుని ప్రత్యక్ష శిష్యులలో ప్రధాన శిష్యుడని చెప్పడంలో సందేహించవలసిన పనిలేదు. ఆతను

వోహరకతిస్స అనే రాజుకు సమకాలికుడని చెప్పే సింహళ దేశ చరిత్ర సత్యమే అయిన పక్షంలో ఆతను మూడవ శతాబ్ది ప్రారంభంలో ఉండి ఉండాలి[25] అందుచేత ఆతని గురువు కూడా ఆ కాలానికే చెంది ఉండాలి. క్రీ.శ.350 ప్రాంతంలో మైత్రేయుడు,* అసంగుడూ నాగార్జునుని గ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాశారు. అందువలన ఆ కాలం నాటికి ఆ గ్రంథాలు ప్రామాణికాలుగా పరిగణించబడి ఉండాలి. క్రీ.శ.409 లో కుమారాజీవుడు నాగార్జునుని ప్రజ్ఞాపారమితా శాస్త్రాన్ని, మరొక గ్రంథాన్నీ చైనా భాషలోకి అనువదించాడు.[26] నాగార్జునుని చరిత్ర చైనా భాషలో వ్రాయడానికి అతనే కారణం. ఆతని ప్రత్యక్ష శిష్యులూ, ఉత్తమ పండితులూ అయిన సెంగీజుయి, సెంగ్‌చావో అనేవారూ, ఆతనితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన సమకాలీన పండితుడు హూయి యువాన్ అనే అతనూ నాగార్జున, ఆర్యదేవులు బుద్ధ నిర్వాణానంతరం నూతన శతాబ్దిలో ఉండేవారని చెప్పారు.[27] ఇది క్రీ.శ. మూడవ శతాబ్ది పూర్వార్ధానికి సరిపడుతుంది. చాలా కాలం క్రితం ఇ.జే. ఈవెట్ అనే ఒక చైనా విషయ విద్వాంసుడు, చైనాలో లభించే కొన్ని ఆధారాలను బట్టి నాగార్జునుని కాలం క్రీ.శ. 194 ప్రాంతం అని చెప్పవచ్చునని ప్రతిపాదించాడు. చైనా దేశీయుల సంప్రదాయం ప్రకారం వారి రాష్ట్రీయ పంచాంగంలోని ఏడవ చాంద్రమాన మాసంలో ఇరవై ఐదవ రోజున నాగార్జునుడు జన్మించినట్లుగా జె.ఎడ్కిన్స్ వ్రాశాడు.[28]

టావో అన్ (క్రీ.శ. 568) అనే ఒక చైనా దేశీయ రచయిత అభిప్రాయమూ, కుమారాజీవుని వ్రాతలూ, ఆతను నిర్ణయించిన బుద్ధ నిర్యాణ దినమూ మరికొన్ని ఇతర విషయాలు ఆధారంగా చేసుకొని హకజు ఉయి అనే జపాన్ పండితుడు, నాగార్జునుడు క్రీ.శ.113-213 ప్రాంతంలో ఉండేవారనీ, ఆర్యదేవుడు క్రీ.శ. 163-263 ప్రాంతాలలో ఉండేవాడనీ నిర్ణయించాడు.[29] కుమారాజీవుడు వ్రాసిన నాగార్జున జీవిత చరిత్రనూ, నాగార్జునుని ఒక మత లేఖనూ, ప్రప్రథమంగా మహాయాన గ్రంథాలను అనువదించిన ధర్మరక్షుడు (క్రీ.శ.266-313) వ్రాసిన విషయాలను అన్నింటినీ బట్టి హికాతా ర్యూషో అనే మరొక జపాన్ పండితుడు "నాగార్జునుడు క్రీ.శ. ద్వితీయ శతాబ్ది ద్వితీయార్ధం, తృతీయ శతాబ్ది ప్రథమార్ధం,

---

* డిమీవిల్లి, కాన్జ్ అనేవారు ఇతను ఐతిహాసిక వ్యక్తి అని అంగీకరించలేదు. ఐతే, యు.ఐ. పండితుడూ, కొంతకాలం పాటు తుచ్చి పండితుడూ అంగీకరించారు.

ఈ మధ్య కాలంలో ఉండే వాడు" అని నిర్ణయించాడు.[30]

పైన చెప్పిన దానికి విరుద్ధంగా కనబడే ప్రమాణాలేవైనా ఉంటే వాటిని ఇప్పుడు పరిశీలించవలసి వుంది. క్రీ.శ.673 లో భారతదేశం వచ్చి, నలందలో పది సంవత్సరాల పాటు ఉండి, ఇతర ప్రదేశాలలో కూడా సంచారం చేసిన ఇత్సింగ్ నాగార్జునుడు కనిష్కుని సమకాలికుడని చెప్పాడు. అతను కనిష్కుని కాలంలో జన్మించాడని తారానాథ లామా కూడా చెప్పాడు. ఈ కనిష్కుడు క్రీ.శ. 78 నుంచి 101 వరకు పరిపాలించిన కనిష్కుడు అవడానికి వీలులేదు.[31] ఎందుచేతననగా మనం పైన చూసిన దానినిబట్టి ఇది నాగార్జునుని కాలానికి అతి ప్రాచీనకాలం అయిపోతుంది. మరొక విషయమేమనగా కనిష్కుడు మహాయానాన్ని కాకుండా సర్వాస్తిత్వ వాదాన్ని సమర్థించినట్లుగా పురావస్తు శాస్త్రానికి సంబంధించిన ఆధారాల బట్టి తెలుస్తున్నది. సిల్వాన్ లేవి చెప్పినట్లు, నాగార్జుననికి శాతవాహన రాజుతో ఘనిష్ఠమైన మైత్రి ఉండేదని అనేక సాక్ష్యాల్ని బట్టి నిరూపించబడింది. ఆతని మాటలలో చెప్పాలంటే– "అసందిగ్ధమైన కొన్ని సంబంధాలు వారిరువురినీ దగ్గరగా చేర్చాయి. కనిష్కుని విషయంలో ఇది కుదరదు. అయినా కూడా బౌద్ధ సంప్రదాయానికి చెందిన వారు కనిష్కుని విషయంలో ఎక్కువ మొగ్గుదల చూపిస్తున్నారనీ, వారు ఈ మహాచైత్యాచార్యుణ్ణి కనిష్కునితో కలుపుతున్నారని లెవీ అన్నాడు.[32] ఇది నిజమే అయి ఉండవచ్చును. అయితే కనిష్కులనేవారు ఇంకా ఇద్దరు ఉండడం చేత భ్రాంతికి అవకాశం లేకపోలేదు. క్రీ.శ.119 లో కొంత కాలం పరిపాలించిన రెండవ కనిష్కుడూ, క్రీ.శ.176 నుంచి 210 వరకూ పాలించిన మూడవ కనిష్కుడూ కూడా యూఛి వంశానికి చెందినవారే. నాగార్జునుడు వశిష్క, హువిష్క, కనిష్కుల సమకాలికుడని కల్హణుడు చెప్పి ఉన్నాడు.[33] దీనిని బట్టి నాగార్జునుడు క్రీ.శ.119 ప్రాంతంలో ఉండేవాడని చెప్పవలసి వుంది. ఎందుచేతననగా, మొదటి కనిష్కుని తరువాత వశిష్కుడు రాజ్యానికి వచ్చాడు. ఆతని తరువాత రాజైన వాడు హువిష్కుడు. రెండవ కనిష్కుడు ఈ హువిష్కునికి ప్రత్యర్థి. మనం వెనుక చూచిన దానిని బట్టి నాగార్జునుడు మూడవ కనిష్కునికి సమకాలికుడైతే కావచ్చునేమో కాని రెండవ కనిష్కునికి సమకాలికుడవడానికి అవకాశం లేదు. అదేవిధంగా నాగార్జునుడు, మొదటి కనిష్కునికి సమకాలికుడని ఛెప్పే ప్రసిద్ధ మహాకవియైన అశ్వఘోషునికి సమకాలికుడు అవడానికి అవకాశం లేదు. నాగార్జునుడు అశ్వఘోషునికి

సమకాలికుడని కాని, అతని శిష్యుడని కాని చెప్పడానికి తగిన విశ్వసనీయమైన ప్రమాణాలేవీ లేవు. కుమారలాభుని* కాలంలో అశ్వఘోషుడు, నాగార్జునుడు, ఆర్యదేవుడు, కుమారలాభుడు అనే "నలుగురు సూర్యులు ప్రపంచాన్ని ప్రకాశింప చేశారు" అని ఒక హ్యూయన్‌త్సాంగ్ మాత్రమే చెప్పాడు. అయితే వారందరూ సమకాలికులని అతను చెప్పలేదు.[34] హ్యూయన్‌త్సాంగ్ గ్రంథాల్ని అనువదించిన బీల్, అశ్వఘోషుడు కనిష్కుల సమకాలికుడైతే కావచ్చునేమో, కాని అతడు నాగార్జునుడు మాత్రం తప్పకుండా కనిష్కుని కంటె అర్వాచీనుడనీ, క్రీ.శ. రెండవ శతాబ్దికి చివరి భాగంలో ఉండేవాడనీ వ్రాశాడు.[35] చైనా దేశంలో లభించే కొన్ని ఆధారాలను బట్టి అశ్వఘోష, నాగార్జునుల మధ్య కనీసం ఒక శతాబ్దం వ్యవధానం ఉండాలి.[36] ఇంతే కాకుండా, బహుశా ఆరుగురు అశ్వఘోషులు ఉండేవారు. "మహాయాన శ్రద్ధోత్పాదము" అనే తాత్త్విక గ్రంథం రచించిన అశ్వఘోషుడు వేరు. మహాకవియైన అశ్వ ఘోషుడు వేరు. పై గ్రంథం రచించిన అశ్వఘోషుడు క్రీ.శ.నాల్గవ శతాబ్దికి చెందినవాడై ఉండాలి. ఎందుచేతననగా మాధ్యమికవాద, విజ్ఞానవాదాల సమన్వయాన్ని ప్రతిపాదించే ఈ గ్రంథాన్ని క్రీ.శ.405 లో చైనా భాషలోకి అనువదించడం జరిగింది.

కుతూహల కవి రచించిన "లీలావతి పరిణయము" అనే ప్రాకృత కావ్యం ఒకటున్నది. శాతవాహన రాజైన హాలుడు సింహళ రాజపుత్రియైన లీలావతిని వివాహమాడిన కథ ఇందులో వర్ణించబడింది. భిక్షు నాగార్జునుడు హాలునికి గురువుగాను, సలహాదారుడుగాను ఉండేవాడని ఈ గ్రంథంలో చెప్పబడింది. ఈ కావ్యం ప్రతి ఒకటి, అతి ప్రాచీనమైనది, ఉత్తర భారతంలో లభిస్తున్నది. ఇది క్రీ.శ.1208 సంవత్సరానికి చెందినది. ఆ కావ్యం అప్పటికి ఒకటి రెండు శతాబ్దాలకు పూర్వం రచించబడి ఉండాలి. అంతకంటె ఎక్కువ ప్రాచీనమవడానికి అవకాశం లేదు. హాలుడు క్రీ.శ.19 నుంచి 24 వరకు పరిపాలించాడు. ఈ కాలానికీ, నాగార్జునుని కాలానికీ చాలా దూరం ఉన్నది. అందుచేత నాగార్జునుడు హాలునికి గురువని చెప్పే ఈ కథ కాల్పనికం అని చెప్పడంలో సందేహం లేదు. నాగార్జునుడు కనిష్క, అశ్వఘోషులకు యాభై సంవత్సరాల పూర్వం ఉండేవాడనేది అసంభవము. క్షత్రపులనే (క్షహరతులు) పేరుతో, విభిన్న కాలాలలో భారత

---

* ఇతను బౌద్ధమతానికి చెందిన సౌత్రాంతిక శాఖను స్థాపించినవాడు.

దేశంలోని కొన్ని ప్రాంతాలు పరిపాలించిన సిథియా దేశీయుల వంశాన్ని (క్షహరత వంశం) శాతవాహన చక్రవర్తియైన గౌతమీపుత్ర శాతకర్ణి ఉన్మూలించినాడని ఒక శాసనం ద్వారా తెలుస్తోంది. నాగార్జునుడు "రత్నావళి" అనే మత లేఖ వ్రాసినది ఆ చక్రవర్తికే అని కొందరి అభిప్రాయం. ఈ లేఖలోని విషయాన్ని బట్టి చూడగా, ఇది తన పూర్వపురుషుల మతమైన బౌద్ధ మతాన్ని పరిత్యజించి, దానిని ద్వేషిస్తూ, వైదిక మతం అవలంబించిన రాజుకు వ్రాసినట్లు కనబడుతున్నదని వీరి వాదం.[37] అయితే ఇది బౌద్ధమత ద్వేషికి వ్రాసిన లేఖగా చెప్పడానికి ఆంతరంగిక ప్రమాణాలేవీ లేవు. దీనికి వ్యాఖ్యానం వ్రాసిన అజిత మిత్రుడు "సుహృల్లేఖ" అనే మతలేఖను వ్రాసిన రాజుకే ఈ లేఖ కూడా వ్రాయటం జరిగిందని చెప్పాడు. ఈ లేఖలు వ్రాసిన రాజూ, నాగార్జునుడూ ఆజీవితాంతము మిత్రులుగా ఉండేవారని అన్ని సంప్రదాయాలూ ఏక కంఠంతో చెపుతున్నాయి. లెవి చెప్పినట్లు ఈ లేఖలో ఒకటి వైయుక్తిక విషయరహితంగా ఉన్నది. రాజుకు వ్రాసినవే అయినా ఈ లేఖలలో బౌద్ధ సిద్ధాంతాలకు సంబంధించిన కొన్ని సంక్షిప్తవిషయాలూ, అందరికీ ఉపయోగించే నైతిక ప్రవర్తనా నియమాలూ ప్రతిపాదించబడ్డాయి. "కొందరు అజ్ఞానులు మహాయాన సిద్ధాంతంలో ఉన్న గాంభీర్యాన్నీ, దాని విశ్వజనీనతనూ చూసి భ్రాంతులై దానిని దూషిస్తున్నారు. అభ్యుదయం కోరేవారు ఎవరూ కూడా దానిని ద్వేషించ కూడదు. బుద్ధుని ఉపదేశాలను అర్థం చేసుకోవడానికి నిష్పాక్షిక బుద్ధితో ప్రయత్నం చెయ్యాలి" అని నాగార్జునుడు "రత్నావళి"లో ఉపదేశించాడు. ప్రాచీన రాజులు నెలకొల్పిన మత సంప్రదాయాలన్నీ కొనసాగాలని ఇతను మరొక చోట ఉపదేశించాడు.[40] దీనిని బట్టి రాజు మహాయానాన్ని ద్వేషిస్తున్నాడని కాని, వైయుక్తికంగాను, సామూహికంగాను చేసే పూజాదులను నిషేధిస్తున్నాడని కాని అర్థం కాదు. పాప కార్యాలకు దూరంగా ఉండి, పుణ్య కార్యాలను చేయవలసిందిగా మతాచార్యుడు ఒక వ్యక్తికి ఉపదేశిస్తున్నాడంటే దాని భావం ఆ వ్యక్తి పాప మార్గంలోనే ఉన్నాడని కాదు. "నీ కర్తవ్యాలను చక్కగా నిర్వహించుకుంటూ, చెడు సహవాసాలు మాని, మంచి మార్గంలో నడవాలి" అంటూ తండ్రి కుమారునికి లేఖ వ్రాస్తే దాని అభిప్రాయం ఆ కుమారుడు అంతకు ముందు చెడుదారి పట్టాడని కాదు కదా? ఏమైనా రత్నావళి కూడా పూర్తిగా రాజు కొరకే వ్రాసిన వైయుక్తిక లేఖ కాదు. ఇది అందరికీ ఉపయోగించే ఉపదేశము (పరికథ). మరొక విషయం గౌతమీపుత్ర శాతకర్ణి తండ్రి, తాత, ముత్తాతలు బౌద్ధ మతానుయాయులనీ,

ఇతనే ప్రప్రథమంగా ఆ మతాన్ని విడచి వైదిక మతం అవలంభించాడనీ చెప్పడానికి చారిత్రకాధారాలేవీ లేవు. ఆతని బంధువులల్లో ఆతని అభినందకులూ ఆతనికి "ఏకైక బ్రాహ్మణుడు", "వినివర్తిత చాతుర్వర్ణ్య సంకరుడు" మొదలగు బిరుదులు ఇచ్చి ఉండవచ్చును. ఆతనే స్వయంగా ఆ బిరుదులు చేర్చుకుని ఉండవచ్చును. ఆతని కుమారుడైన శాతకర్ణియే (క్రీ.శ.130–154) సిథియా యువతిని వివాహం చేసుకున్న పరిస్థితులలో ఈ బిరుదుల భావం ఏమిటో మనకి సరిగా తెలియదు.

మరొక విషయం గుర్తు ఉంచుకోవాలి, నాగార్జునుడు కూడా బ్రాహ్మణుడే. సామాన్య బౌద్ధులు తమ వర్ణాలను పరిత్యజించలేదు. కేవలం శ్రమణులు మాత్రమే (సన్యాసులు, బిక్షువులు) సమానత్వం పాటించేవారు. వైయుక్తికంగా వైదికమతం అవలంభించినా, గౌతమీ పుత్రుడు కూడా బౌద్ధమతాన్ని పోషించాడు. ఇతను "పవజితన తేకిరసిన వితరామ", "పవజితన బిక్షిన" అనే ఇద్దరు బౌద్ధ శ్రమణులకు తరన్హు పర్వతం మీద కొన్ని ప్రదేశాలు దానం చేసినట్టుగా నాసిక శిలా శాసనం ద్వారా తెలుస్తోంది. ఆతని తల్లి 'భయదనీయిన' సంప్రదాయానికి చెందిన బౌద్ధ బిక్షువులకు దానాలు చేసినట్లూ, ఆతని కుమారుడైన రెండవ పులోమావి (క్రీ.శ. 102–130) మహా సాంఘిక సంప్రదాయానికి చెందిన బౌద్ధ బిక్షువులకూ (కార్ల శిలా శాసనం), 'ధనకటక' శ్రమణులకూ (నాసిక శిలా శాసనం)* దానాలు చేసినట్టు శిలా శాసనాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ విధంగా గౌతమీ పుత్రుని కుటుంబం అంతా బౌద్ధ భిక్షువులను గౌరవించింది. శాతవాహన వంశీయులు ఎవరూ కూడా, ఏ మతాన్నీ ద్వేషించినట్లు లేదు. అలాంటప్పుడు మత దురభిమానం ఉండడం అనేది అసంభవం. అన్యమత ద్వేషాదులు లేకపోవడం సరికదా, సద్ధర్మానికి క్లైణ్య పరిస్థితులు ఏర్పడినప్పుడు శాతవాహన రాజులు, మహాయాన సంప్రదాయాన్నీ, ఆ గ్రంథాలనూ ప్రచారంలోకి తీసుకుచ్చి సద్ధర్మాన్ని రక్షించారని బౌద్ధ సంప్రదాయం చెపుతున్నది.[41] దీనికంతకీ సారాంశం ఏమనగా, నాగార్జునుడు మతలేఖలు వ్రాసిన రాజు ఎవరో నిర్ణయించడానికి వాటిలో సరైన అధారాలేవీ లభించడంలేదు. గౌతమీ పుత్రుని కాలాన్ని (క్రీ.శ.78–102) [42] పోల్చిచూడగా ఆతనికీ, నాగార్జుననికీ సంబంధం ఉండేదని చెప్పడానికి అవకాశం లేదు. ఎందుచేతననగా మనం పైన చూసిన విధంగా నాగార్జునుడు మొదటి కనిష్కునికీ,

* ధాన్యకటకం (అమరావతి)

అశ్వఘోషుని తరువాత చాలా కాలానికి ఆవిర్భవించాడు. ఆతనూ, ఆతని మిత్రుడైన రాజు ఒకే సమయంలో మరణించారని చెపుతున్నారు. కాబట్టి ఆ రాజు క్రీ.శ. 150కి పూర్వం ఉన్నవాడనడానికి అవకాశం లేదు. ఆ పక్షంలో నాగార్జునుడు అమరావతిలో జీర్ణోద్ధరణం చేయనిచ్చాడని చెప్పడం కుదరదు.

నాగార్జున–వాత్స్యాయన సమస్యను గురించి ఎక్కువ సమయం వెచ్చింప వలసిన పనిలేదు. న్యాయసూత్రానికి భాష్యం వ్రాసిన ప్రకాశిల స్వామి, బహుశా వాత్స్యాయనుడు నాలుగవ శతాబ్దికి, లేదా కొంచెం ముందు కాలానికి చెంది ఉంటాడు. ఇతను వేరు, కామసూత్రం వ్రాసిన మల్లనాగ వాత్స్యాయనుడు వేరు. అతను క్రీ.శ.500 ప్రాంతానికి చెందినవాడై ఉంటాడు. ఈ ఇద్దరు వాత్స్యాయనులు కూడా నాగార్జునునికి చాలాకాలం తరువాత వచ్చిన వారనే విషయంలో ప్రధానులైన ప్రాచ్యదేశ విషయ పండితులందరూ ఐకమత్యంతో ఉన్నారు.[43] నాగార్జునుడు తన "విగ్రహ వ్యావర్తిని" అనే శాస్త్ర గ్రంథానికి తానే వ్రాసిన వ్యాఖ్యలో, ప్రప్రథమంగా న్యాయభాష్యంలోనే చర్చించబడినదీ, పూర్వగ్రంథాలలో వేటిలోనూ లేనిదీ అయిన ఒక విషయాన్ని ఉటంకించి ఖండించాడనే వాదం నిశ్చితమైన పక్షంలో, ఆ విషయాలు న్యాయభాష్యంలో తరువాత చేర్చటమయిందనే చెప్పాలి, లేదా నాగార్జునుడు ఆ వ్యాఖ్యానం వ్రాయలేదనైనా చెప్పాలి. నాగార్జున రచితమైన "ద్వాదశ ముఖ శాస్త్రం" అనే గ్రంథానికి అతనే వ్రాసినట్లుగా చెప్పిన వ్యాఖ్య చివరికి అతనిది కాదని ఏవిధంగా నిర్ణయించబడిందో, దీని విషయంలో కూడా అదే అయి ఉండాలి.[44] న్యాయసూత్రం రచించిన గౌతముడు నాగార్జునుని సిద్ధాంతాలనూ, నాగార్జునుడు గౌతముని సిద్ధాంతాలనూ తమ గ్రంథాలలో పేర్కొనడం జరిగింది. దీనిని బట్టి, షెడ్‌బటోస్కీ అన్నట్లు "నైయాయిక మాధ్యమిక సిద్ధాంతాలు గౌతమ, నాగార్జునుల కంటె పూర్వమే ప్రచారంలో ఉండేవని" చెప్పవలసి వస్తుంది.[45]

IV

నాగార్జునుడు - తంత్రం

ప్రకాశప్రదమైన జ్ఞానమూ, ముక్తిప్రదమైన కార్యకలాపమూ వీటికి తంత్రమని పేరు. కొన్ని రహస్య సిద్ధాంతాలూ, వాటిని ఆధారంగా చేసుకొని ఏర్పడిన మత సంబంధి ప్రక్రియలూ, ఈ తంత్రాలలోని ప్రధానాంశాలు, అత్యుత్తమములు. కొన్ని తాంత్రిక విధానాలలో మానవ ప్రవృత్తిని తల్లక్రిందులు చేయడానికీ, లేదా అసాధారణ లక్షణాలేవైనా ఉంటే వాటిని తొలగించి సహజంగా ఉండేటట్లు చేయడానికీ, ప్రయత్నం జరుగుతుంది. మైధునం వంటి విపరీతాచారాలకు వీటిలో అనుప్రవేశం ఉంటుంది. కొన్నింటిలో అతిప్రాచీనాలైన మత, మాయ విద్యలతో పాటు అత్యుత్తమ తాత్త్విక సిద్ధాంతాలూ, అత్యున్నత శారీర, మానస సంయమాలూ మిళితములై ఉంటాయి. భారత, టిబెట్ దేశీయ విషయాల ఉత్తమ పండితులలో ఒకడైన జి.తుచ్చి, "తంత్రమనేది భారతీయుల రహస్య సిద్ధాంతం యొక్క అత్యున్నత స్వరూపం" అని అంటాడు.[47] మతాల తులనాత్మక అధ్యయనంలో ప్రామాణికుడైన యమ్.ఎలియడ్ తంత్రమనేది "అద్భుతమైన ఆధ్యాత్మిక చింతనా సమన్వయము" అనీ "తత్త్వశాస్త్రానికీ, మతానికీ సంబంధించిన గొప్ప ప్రవృత్తి" అనీ అంటాడు.[48] భారత, టిబెట్ దేశాల సంప్రదాయం ప్రకారం నాగార్జునుడు తాంత్రికుడు. ఇతను అత్యద్భుత విషయాలు సాధించిన రహస్య విద్యావేత్త అని చైనీయుల సంప్రదాయం. అంతటి తత్త్వశాస్త్రవేత్త, శాస్త్రార్థవాద నిపుణుడూ అయినవాడు తాంత్రికుడవడం అసంభవం అని కొందరు ఆధునిక విమర్శకులు అంటూ ఉంటారు. ఇది కేవలం స్వయంకల్పిత వాదం మాత్రమే. రామానుజాచార్యులు, అభినవగుప్తుడు, అప్పయ దీక్షితులు మొదలైన వారున్నారు. బుద్ధి వైభవంలోనూ, అత్యున్నత నైతిక జీవన విధానంలోనూ వీరందరూ కూడా

ఉన్నతశ్రేణికి చెందినవారే. వీరందరూ వైష్ణవ (పాంచరాత్ర) శైవ తంత్రాలను అవలంబించారు. శంకరాచార్యులు కూడా కొంత వరకు శాక్త తంత్రానికి సంబంధించిన శ్రీవిద్యా, దేవీ పూజాదులను అనుసరించినవారే. ఆధునిక యుగానికి చెందిన రామకృష్ణ పరమహంస, శ్రీ అరబిందో కూడా కొంత కాలం తాంత్రిక విధానాలు ఆచరించారు. శాంతరక్షితుడు, కమలశీలుడు మొదలైన ఎంతోమంది బౌద్ధ తత్త్వవేత్తలూ, నలంద, విక్రమశిలాదులలోని బౌద్ధ విశ్వ విద్యాలయాలకు అధ్యక్షులుగా ఉన్న అతిశదీపంకర శ్రీజ్ఞాన, అభయకర గుప్త మొదలైన వారు కూడా తాంత్రికులు. అందుచేత గొప్ప తత్త్వ శాస్త్రవేత్తలు కూడా యోగులుగాను, తాంత్రికులుగాను, భక్తులుగాను ఉండడంలో అసంగతేమీలేదు. ఈ విధంగా తత్త్వ శాస్త్రవేత్త అయినంత మాత్రంచేత నాగార్జునుడు కూడా తాంత్రికుడవడంలో అభ్యంతరం లేదు. అయితే ఇతను తాంత్రికుడుగా ఉండేవాడా అనేది ప్రశ్న. తంత్రశాస్త్ర చరిత్ర పరిశీలిస్తే అతను తాంత్రికుడు అనే ప్రత్యుత్తరమే లభిస్తుంది.

తంత్రాలలో అతి ప్రాచీనమైన విశ్వాసాలూ, ఆచారాలూ ఉంటే ఉండవచ్చును గాని, ఇది ఒక ప్రత్యేకతగల విధానంగా క్రీ.శ. నాల్గవ శతాబ్దానికి పూర్వం ప్రచారంలో లేదు. అంతకు పూర్వకాలంలో దాని ఛాయలు కనబడితే కనబడ వచ్చును. అంతమాత్రమే బౌద్ధ మతానికి సంబంధించినంత వరకు 'వైతుల్యక' లేదా 'వీతుల్యక' సంప్రదాయం ఒక్కటే శ్రమణక, రహస్యాచార, మైధునాది విధానాల మేళనం ఏర్పడిన ప్రాచీన సంప్రదాయం అని చెప్పవచ్చును. క్రీ.శ. మొదటి శతాబ్దానికి చెందిన 'కథావతు'లో ఈ సంప్రదాయం పేర్కొనబడినది. బుద్ధుడు ఎన్నడూ భూమి మీద నివసించలేదనీ, అతనెల్లప్పుడూ 'తుషిత' అనే స్వర్గంలో ఉండేవాడనీ, భూలోకంలో కనబడినదల్లా ఆయన ప్రాతిభాసిక రూపం మాత్రమే అనీ, ఈ సంప్రదాయం వారు చెపుతారు. ఈ సంప్రదాయం ప్రకారం ఒక బౌద్ధ సన్యాసి స్త్రీ సమేతుడై బుద్ధుని ఆరాధించిన తరువాత, దయామాత్ర (ఏకాభిప్రాయ) ప్రేరితుడై, ఆమెతో సంగమం చేసి, కలసి నివసించడానికి నిశ్చయించుకొనవచ్చును. అయితే, ఈ విషయం వైతుల్యక సంప్రదాయంలోని ప్రధానాంశమా, మారుదారి పట్టిన వాళ్ళు చేర్చినదా అనేది నిర్ణయించడానికి తగిన ఆధారాలేవీ లేవు. ఈ వైతుల్యక సంప్రదాయికులు శ్రీలంకలోని అభయగిరి విహారంలో క్రీ.శ. మూడవ శతాబ్ది నుంచి పన్నెండవ శతాబ్ది వరకూ ఉండేవారని,

తరువాత వారిని నిర్మూలించి వేయడం జరిగినదనీ తెలుస్తున్నది.[49] వజిర సంప్రదాయం అనే మరొక బౌద్ధ సంప్రదాయంలోనూ కొన్ని రహస్య ఆచారాలూ సంవిధానాలూ ఉండేవట. అయితే దానినిబట్టి క్రీ.శ. రెండవ శతాబ్ది లోపునా, అంతకు పూర్వం కాని తంత్ర ప్రచారం ఉండేదని చెప్పడానికి వీలులేదు. కొన్ని విద్యలూ (ఉపాసనలు) స్త్రీ, పురుష సంబంధాలకూ, రహస్య విధానాలకూ సంబంధించిన కొన్ని ప్రక్రియలూ, మనకు ఉపనిషత్తుల్లోనూ కనబడుతున్నాయి. దేవీ(జగన్మాత)పూజ, సంన్యాసమూ మొదలైనవి మొహంజదారో సంస్కృతి ఎంత ప్రాచీనమైనదో అంత ప్రాచీనమైనవి. యోగతంత్రాలు కూడా అంత ప్రాచీనమని చెప్పడానికి వీలులేదు. ఏకాత్మతా వాదాన్ని బోధించే వాక్యాలు ఋగ్వేదంలో కూడా ఉన్నాయి కదా అని, అద్వైతం ఋగ్వేదం కాలం నాటిదని ఎలా చెప్పలేమో, అదే విధంగా, మహాయాన సిద్ధాంత సారం బుద్ధుని ఉపదేశాలలో అక్కడక్కడ కనబడినా, ఆయన కాలంలోనే మహాయానం ఉన్నదని చెప్పలేము. భవిష్యత్తు తంత్రచ్ఛాయలు ఉన్నంత మాత్రాన ఆ తంత్రాలే పరిపూర్ణ రూపంలో ఉన్నాయని చెప్పడం కుదరదు.

బౌద్ధ మతంలో తంత్ర ప్రవేశానికి సంబంధించిన స్పష్టమైన ప్రమాణాలు ప్రప్రథమంగా, "మధ్యమ సూత్రాలంకారము" "అభిధర్మ సముచ్చయము" అనే అసంగుని (క్రీ.శ.350 ప్రాంతం) గ్రంథాల్లో కనబడుతున్నాయి. అతను మొదటి గ్రంథంలో, పరివృత్తి (వెనుకకు మరల్చడం), వృత్తి (మానసిక స్థితి), మైథునము అనే వాటి ద్వారా లభ్యమయ్యే విభుత్వాన్ని (గొప్పశక్తిని) గూర్చి ప్రతిపాదించాడు. రెండవ గ్రంథంలో రహస్యాచారాల తాత్పర్యాన్ని (అభిసంధి వినిశ్చయాన్ని) విశదీకరించాడు. రెండవ దానికి ఉదాహరణం– బ్రహ్మచర్యం అనగా మైథున వర్జనం కాదనీ, మైథునం ద్వారా దానిని అతిక్రమించడం లేదా దానిపై విజయం సాధించడమేననీ అతను ప్రతిపాదించాడు. హిందూ మతానికి సంబంధించినంత వరకు, తంత్ర సంప్రదాయం ప్రప్రథమంగా కాపాలికులలో, పాశుపతులలో కనబడుతుంది. అతి ప్రాచీనంకాని "మైత్రాయణీ" ఉపనిషత్తులోనూ, క్రీ.శ.200 –450 సంవత్సరాల మధ్య సంకలితమైన "గాథా సప్తశతి"లోనూ, సంగం యుగం తరువాత (అనగా క్రీ.శ.250కి తరువాత 600కు పూర్వం) రచించబడిన "మణిమెకలై"లోనూ, కాపాలిక మతం పేర్కొనబడింది. క్రీ.శ.380కు చెందిన ఒక శిలా శాసనంలో పాశుపత మతం నిర్దేశించబడింది. అసంగుడు కూడా

"నయసోమ" (సోమ సిద్ధాంతం) అనే పేరుతో ఒక కాపాలిక మతం పేర్కొన్నాడు. న్యాయదర్శనాచార్యుడైన ఉద్యోతకరుడు (క్రీ.శ.620 ప్రాంతం) తాను తాంత్రికుడినని చెప్పుకున్నాడు. ఇతను మహాపాశుపతుడు. ఇలా చెప్పుకొన్న హిందువులలో ఇతనే మొదటివాడు. ఈ విషయాలన్నీ పరిశీలించగా, తంత్రమనేది ఒక నిర్దిష్టమైన రూపంగల సంప్రదాయంగా క్రీ.శ. నాలుగవ శతాబ్దం నాటికి రూపుదిద్దుకొన్నదనీ, ఏడవ శతాబ్దం నాటికి పూర్తిగా అభివృద్ధి చెందినదనీ తెలుస్తున్నది. నాగార్జునుని గ్రంథాలలోకాని, ఆతని సమకాలికుల గ్రంథాలలోకాని, తంత్ర సంప్రదాయానికి సంబంధించిన విషయాలేవీ కనబడడం లేదు. ఆతని కాలం నాటికి తంత్రం అనేదే లేదు. అందుచేత అతను తాంత్రికుడు అవడానికి అవకాశంలేదు. అతనే తంత్ర సంప్రదాయం ఒకటి ఆవిష్కరించి, మహాయానంలో ప్రవేశపెట్టాడని చెప్పడానికి కూడా ఆధారాలేవీ లేవు. అయితే నాగార్జునుడు ధ్యాన యోగం అభ్యసించిన ఆధ్యాత్మ చింతకుడనీ, అమితాభోపాసకుడనీ చెప్పడానికి మాత్రం అవకాశం వుంది.

ఇక్కడ ఒక విషయం చెప్పవలసి వుంది. నాగార్జునుడు మహామాయూరీ విద్యను ఉపాసించేవాడని టిబెట్‌లోని గ్రంథాలు చెపుతున్నాయి. అమోఘసిద్ధి అనే ఒక బుద్ధుని అపరావతారమే మహామాయూరాదేవి అని విశ్వాసం.* ఈ దేవి ఉపాసనకు సంబంధించిన ఒక గ్రంథాన్ని సిరిమిత్రుడనే ఒక పండితుడు క్రీ.శ.307–342 సంవత్సరాల మధ్య చైనా భాషలో అనువదించాడు. "మహా మాయూరీ విద్యారాజ్ఞి" అనే గ్రంథాన్ని కుమారాజీవుడు చైనా భాషలోనికి అనువదించాడు. నాగార్జునుడూ, ఆతని సమకాలికులూ ఏ ఆచారాలు పాటించి ఉంటారో, వాటి వివరణమే బహుశా ఈ గ్రంథాలలో ఉండి ఉంటుంది. ఇది ఉపనిషత్తులలో చెప్పిన విద్యల వంటిదై ఉంటుంది. మహాయాన సంప్రదాయ ఆవిర్భావానికి తోడ్పడిన కొందరు మహా సాంఘికులలో, క్రీ.పూ.ప్రథమ శతాబ్దం నుంచీ కూడా ధారిణులు ఉండేవి. ఇవి హిందువులు జపించే మంత్రాల వంటివి.

"గుహ్య సమాజ తంత్రము", "మంజుశ్రీ మూల కల్పమూ" అనేవి ప్రాచీన తరములూ, పరిపూర్ణములూ అయిన బౌద్ధ తంత్ర గ్రంథాలుగా పరిగణించ బడుతున్నాయి. బరోడాలో ప్రకటించబడిన "గుహ్య సమాజ తంత్రాన్ని" రచించినది

* ధాన్యిబుద్ధుని అవతారం

అసంగుడని చెపుతారు. కానీ వింటర్ నిట్జ్ [50] వ్రాసిన దానిని బట్టి చూడగా అది అతి ప్రాచీన గ్రంథం అని చెప్పడానికి అవకాశం లేదు. పొరబాటున "తథాగత గుహ్య సూత్రం" అనే ఒక ప్రాచీన తంత్ర గ్రంథంతో దానిని ముడిపెట్టడం జరుగుతున్నది. దీన్ని గూర్చి అంతగా ఏమీ తెలియదు. "గుహ్య సమాజము" అనే గ్రంథానికి నాగార్జునుడు వ్రాశాడని చెప్పే వ్యాఖ్యానం ఆతనిది అవడానికి వీలులేదు. ఎందుచేతననగా దీనిలో చర్చించిన కొన్ని విషయాలు ఏడవ శతాబ్ది మధ్యభాగంలోనే ప్రచారంలోకి వచ్చాయి. "మంజుశ్రీ మూలకల్పం"లో లాట (గుజరాత్) దేశంలోని వలభికి ప్రభువైన శీలరాజును పేర్కొనడం జరిగింది. క్రీ.శ.590–710 సంవత్సరాల మధ్య, లాట దేశంలో శిలాదిత్యుడనే పేరుతో ముగ్గురు రాజులుండేవారు. అందుచేత, ఈనాడు మనకు లభిస్తున్న ఆకారంలో ఈ గ్రంథం ఏడు, ఎనిమిది శతాబ్దులకు పూర్వం ఉండడానికి అవకాశంలేదు. ఇది క్రీ.శ.980–1000 సంవత్సరాల మధ్య చైనా భాషలోనికి, పదకొండవ శతాబ్దం ప్రాంతంలో టిబెట్ భాషలోనికి అనువదించబడింది. చైనా భాషలో వున్న ఈ గ్రంథంలో ఇరవై ఎనిమిది అధ్యాయాలు మాత్రమే ఉన్నాయి. క్రీ.శ. 414–421 సంవత్సరాల మధ్య ధర్మక్షేముడు చైనా భాషలోకి అనువదించిన "మహామేఘ సూత్రం"లో తంత్ర శాస్త్రానికి సంబంధించిన అంశాలు ఉన్నాయి. [51] "సాధనమాల"లో కొన్ని తాంత్రిక రచనలు సంగ్రహించబడి ఉన్నాయి. వీటిలో కొన్నింటి రచయితలు నాగార్జున, అసంగులని చెప్పడం ఉన్నది. అయితే దీని అతి ప్రాచీన వ్రాతప్రతి క్రీ.శ.1165వ సంవత్సరం నాటిది. అందులో ప్రతిపాదించిన విషయాలూ, ఆ రచనల స్వరూపాన్ని చూడగా వాటి రచయితలు కాల్పనికులైన నాగార్జున, అసంగులైనా అయి ఉండాలి, లేదా ఆ పేర్లు పెట్టుకున్న వారై వుండాలి. [52] దీనినంతటిని పరిశీలించి చూడగా "తాంత్రిక గ్రంథాలకీ, మహాయాన స్థాపకుడైన నాగార్జుననికీ ఏ విధమైన సంబంధమూ లేదు అని నిశ్చితంగా చెప్పవచ్చును"[53] అంటూ తుచ్చి చేసిన నిర్ణయం నిరాకరించ శక్యం కానిది.

నాగార్జునుడు తాంత్రికుడు కాని పక్షంలో ఆతనికి బౌద్ధ తంత్రంతో సంబంధం ఉన్నదని చెప్పడానికి కారణం ఏమిటి? మహాయానంలోకి తాంత్రిక విధానాలన్నూ, యోగాన్నీ ప్రవేశపెట్టిన వాడు అసంగుడు. అతను తత్త్వవిచారంలో ఒక నూతన మార్గాన్ని ప్రవేశపెట్టినా, ఆతనిపై నాగార్జునుని ప్రభావం అమితంగా ఉన్నది. అనతి కాలం నుంచి ఏడవ శతాబ్ది వరకూ ఉన్న మధ్య కాలంలో

తాంత్రిక సంప్రదాయం భారత దేశం అంతటా వ్యాపించింది. ఎనిమిదవ శతాబ్దం నాటికి శైవ, శాక్త, వైష్ణవ, బౌద్ధాది సకల రూపాలలోనూ అది అత్యున్నత శిఖరాలు అందుకున్నది. ఒక్కొక్క తాంత్రిక సంప్రదాయంలోనూ ఎన్నో విభిన్న మార్గాలు బయలుదేరాయి. బౌద్ధ తంత్రానికి వజ్రయానమని ప్రసిద్ధి. శూన్యత్వమే వజ్రము. ప్రతీ పదార్థము కూడా అనిత్యము, క్షణికము, ఆత్మ (తత్త్వ) శూన్యము అని తెలుసుకోవడమే వజ్రము. "శూన్యత్వం వజ్రముచ్యతే"[54] శూన్యత్వము, కరుణ అనేవి పరిస్పరము విభిన్నములు కాదు "శూన్యతా కరుణ అభిన్నమ్".[55] ప్రతి ఒక్కరూ శూన్య, విజ్ఞాన, మహాసుఖ రూపమైన నిర్వాణం పొందేటట్లు తత్త్వజ్ఞానాన్ని ప్రచారం చేయడం కోసం చేసిన దృఢ నిర్ణయమే కరుణ. నిర్వాణమే వజ్రము. వజ్రయానము శూన్యతా కరుణల సమన్వయ రూపమైన అద్వయ వాదం మీద ఆధారపడి ఉన్నది.[56] దీనిని బట్టి వజ్రయానం, నాగార్జునుని శూన్యవాదం మీద ఎంతగా ఆధారపడి ఉన్నదో స్పష్టం అవుతుంది. అందుచేత బాదరాయణుడే ప్రప్రథమంగా అద్వైతం విశిష్టాద్వైత-ద్వైతాలను స్థాపించిన ఆచార్యుడని ఆయా సంప్రదాయాల వారనుకున్నట్లు, తరువాత వచ్చిన వజ్రయాన సాంప్రదాయికులు, నాగార్జునుడే వజ్రయానాన్ని స్థాపించిన వారిలో, లేదా ప్రచారం చేసిన వారిలో ప్రప్రథముడు, లేదా అతి ప్రాచీనుడు అని విశ్వసించేవారంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. హిందూ మతంలో కూడా కొన్ని శైవ, శాక్త సంప్రదాయాలు కూడా అద్వైతాన్ని ఆధారంగా చేసుకొని బయలుదేరినవనేది చాలా మందికి ఆశ్చర్యకరంగా ఉండవచ్చును.

ఏడవ శతాబ్దంలో, వజ్రయానంలో ఒక విచిత్రమైన, నూతనమైన ప్రవృత్తి ప్రవేశించింది. అయితే దీనిని అసంగుడు ఊహించకపోలేదు. ఈ కాలంలో, ఈ యానంలో మైథునం ప్రవేశపెట్టబడింది. ఈ నూతనాచారానికీ, ఉత్కళదేశ బ్రాహ్మణుడు సరహునికీ సంబంధం ఉన్నది. ఇతను పూర్తిగా మద్యపానలంపటుడై ఇషుకారుని (బాణాలు తయారుచేసేవాని) కూతురైన ఒక నీచజాతి స్త్రీతో కలిసి ఉండేవాడు.[57] నేనీ విషయం ప్రత్యేకంగా ఎందుకు చెపుతున్నానంటే, సర్ ఛార్లెస్ ఇలియట్ వంటి ప్రాచీన రచయితలు వ్రాసినట్లుగా, సరహుడు భారతీయేతరుడు కాడు. సరహుని కొన్ని రహస్య మంత్రాలు ప్రచురించబడ్డాయి.[58] ఇవన్నీ ఒక అపభ్రంశ మాండలిక భాషలో ఉండి, తొమ్మిదవ శతాబ్దంలో రచించబడ్డాయి. అందుచేత వజ్రయాన చరిత్రలో మైథున ప్రక్రియ ప్రవేశం ఇతనితో ప్రారంభం

అయిందనే విషయం సందిగ్ధమైంది. కొన్ని కథలలో 'సరహుడు', 'సవరి', 'సబర' అనే వాళ్ళు ఒకే వ్యక్తి అని చెప్పడం ఉన్నది కాని వీరందరూ వేరు వేరు వ్యక్తులే అయి ఉండవచ్చును. క్రీ.శ.నాలుగవ శతాబ్దికి పూర్వం రాహులభద్రుడనే ఒక వ్యక్తి ఉండేవాడు. అతని రచనల్లో ఒకటి నాగార్జున రచితమని చెప్పబడే "మహా ప్రజ్ఞా పారమితా సూత్రంలో" చేర్చబడింది. ఆ రాహులభద్రుడూ, సరహుడూ ఒక్కడేనని కొన్ని టిబెట్ కథలు చెపుతున్నాయి. చైనాలోని కొన్ని కథల ప్రకారం రాహులభద్రుడు నాగార్జునుని శిష్యుడైనా అయి ఉండాలి, లేదా ఆతని శిష్యుడైన ఆర్యదేవుని శిష్యుడైనా అయి ఉండాలి. రాహులభద్ర సరహుడు నాగార్జునుని గురువని కొన్ని టిబెట్ కథలు చెపుతున్నాయి. అతను నాగార్జునుని గురువూ, ఆర్యదేవుని శిష్యుడు కూడా అని తారానాథుడు చెప్పాడు. బుస్టన్ చరిత్రను బట్టి సరహుడు, రాహుల భద్రుడూ కూడా ఆతని గురువులే. టిబెట్‌లోని ఒక కథ, ఒక నేపాల దేశ కథ నరహశబరుడు నాగార్జునుని శిష్యుడని చెపుతున్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితిని బట్టి ఈ కథలకు ప్రామాణికత ఎంత ఉన్నదో మనం అర్థం చేసుకోవచ్చును. వేరువేరు సరహులు, వేరు వేరు నాగార్జునులు ఉన్నారని చెపితే ఈ అనిశ్చిత స్థితికి తోడు మరొక అనిశ్చిత స్థితి కూడా కల్పించినట్లు అవుతుంది.

పదకొండవ శతాబ్దికి పూర్వం (బహుశా తొమ్మిదవ శతాబ్ది కంటె పూర్వం కాదు) వజ్రయాన, కాపాలిమత, మరయోగ, ధాతు విద్యలు ఒకదానితో ఒకటి కలిసిపోయి ఒక విధమైన సమన్వయరూప మతం ఆవిర్భవించినది. కొంత మంది సిద్ధులు లేదా నాథులు, అతి పురాతన కాలం నుంచీ ఈ మతాన్ని ప్రచారం చేసినట్లు చెప్పడం ఉన్నది.[59] హఠయోగ, ధాతు విద్యల ద్వారా పరిపూర్ణ స్వాతంత్ర్యాన్నీ, ఆరోగ్యాన్నీ, అమరత్వాన్నీ సంపాదించడమే వీరి పరమ లక్ష్యం. శరీరాన్ని పూర్తిగా స్వాధీనంలో ఉంచుకొని, దానిని వినాశరహితమైన దివ్య శరీరంగా, వజ్రదేహంగా మార్చడం హఠయోగ లక్ష్యం.[60] ఈ లక్ష్యసాధనకు కొన్ని లోహాలు, మూలికలు, రసాయన ద్రవ్యాలు మొదలైన వాటి ప్రయోగం కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయం. వజ్రదేహంతో స్వేచ్ఛాయుతమూ, ఆనంద పూర్ణమూ అయిన జీవనాన్ని అతి దీర్ఘకాలం పొడిగించడమే ఈ సమన్వయరూపమత పరమలక్ష్యం. ఈ విధంగా ఇది ఒక మత, తంత్ర, ఆధ్యాత్మిక తత్త్వాల సమ్మేళనం. సిద్ధుల సంఖ్య విషయంలోనూ, నాథుల సంఖ్య విషయంలోనూ

కూడా తొమ్మండుగురు, ముప్పై ఐదుగురు, ఎనభై నలుగురు అని విభిన్న గాథలు ఉన్నాయి.[61] ఈ సంఖ్యలలో ఏ ఒక్క సంఖ్యకాని, సిద్ధులందరి పేర్లుకాని, వారి క్రమంకాని, ఇతిహాసానికి సరిపోవడం లేదు. విష్ణువు యొక్క ఇరవై నాలుగు అవతారాల వలే, స్థవిరవాదులు చెప్పే ఇరవై నలుగురు బుద్ధులవలె (పూర్వం ఏడుగురు మాత్రమే చెప్పబడ్డారు), ఇరవై నలుగురు తీర్థంకరులవలె[63] నాయనార్లు మొదలైన వారివలె, ఎనభై నలుగురు సిద్ధులూ, లేదా తొమ్మండుగురు నాథులూ కూడా ఐతిహాసికాభాసులే. మత్స్యేంద్రనాథుడు, లేదా మీననాథుడు మొదటి సిద్ధుడని "చర్యాచర్య వినిశ్చయము", "నవనాథ చరిత్ర", "హఠయోగ ప్రదీపక" అనే గ్రంథాల్లో చెప్పబడింది. అతనికి శివుని నుంచి లేదా ప్రప్రథముడైన నాథుని నుంచి, లేదా బుద్ధసత్త్వుని నుంచి జ్ఞానోదయం కలిగినదట. వాఙ్మయంలో ప్రప్రథమంగా అభినవగుప్తుని "తంత్రా లోకం"లోను, "కాలజ్ఞాన నిర్ణయం"లోను (11 వ శతాబ్ది) పేర్కొనబడింది. అతని కుమారుడు (అతని పేరు మీననాథుడే) చంబాధిపతియైన సాహిల నృపాలుని (10వ శతాబ్దం) మన్ననలందుకొన్న చర్పటి (చర్పరి) యొక్క శిష్యుడని కొన్ని కథలు చెపుతున్నాయి. అందుచేత మత్స్యేంద్ర నాథుడు తొమ్మిదవ శతాబ్ది చివరి భాగానికి గాని, పదవ శతాబ్దికి గాని చెందినవాడై ఉండాలి. ఇతను నేపాలులో బోధిసత్త్వ అవలోకితేశ్వరుని అపర స్వరూపమైన రక్షాప్రద దేవతగా పూజింపబడ్డాడు. శైవ సిద్ధాంతం ప్రకారం అతను శివుని కుమారుడు. సత్యదూరం. కాని ఒక విషయం ఏమనగా సిద్ధనాథ సంప్రదాయం ధర్మకీర్తి తరువాత, అనగా ఏడవ శతాబ్ది మధ్యభాగంలో ఆవిర్భవించింది. చాలా మంది సిద్ధులు ఎనిమిదవ శతాబ్దం మధ్యభాగంలో అధికారానికి వచ్చిన పాల వంశీయుల రాజ్యకాలంలో ఉండేవారు. వారి సంప్రదాయం భారత దేశం దాటి టిబెట్ వరకూ కూడా వ్యాపించింది. సిద్ధులు, వివిధ సంప్రదాయాలలోని సిద్ధాంతాలు స్వీకరించిన సర్వసమన్వయ వాదులు, వీరు మావారంటే మావారని నేపాల, టిబెట్ దేశాలలోని బౌద్ధులు, శైవులు, హఠయోగులు కూడా అంటారు. "భక్త విజయాలు", "భక్త మాలలు" నాయనార్ మొదలైన వారి కథలు చెప్పినట్లే టిబెట్‌లోని సిద్ధగాథలు, చరిత్ర గ్రంథాలని చెప్పుకునే తదితర గ్రంధాలు సిద్ధులకు సంబంధించిన అనేక అద్భుత గాథలు చెపుతున్నాయి. అవి వారిని ప్రశంసించేందుకు మాత్రమే ఉద్దిష్టమైనవి, పూర్తిగా యథార్థమైనవి కావు. వీటిలో ఒక కథకీ, ఒక కథకీ సంబంధం ఉండదు. ఒక్క కథలోనే పూర్వాపర విరోధాలు ఉంటాయి.[64]

శైవులు తమ తంత్రాలకి సంబంధించిన సిద్ధుల పేర్లలో నాగార్జునుని పేరు కూడా చేర్చడం గమనార్హం. (1) శబర తంత్రంలో ఇరవై నలుగురు కాపాలికుల పేర్లలో నాగార్జునుని పేరు కూడా ఉన్నది. "గోరక్ష సిద్ధాంత సంగ్రహం"లోనూ ఆ పేర్లే ఉన్నాయి. (2) "నవనాథ చరిత్ర"లో మనకు ఇద్దరు నాగార్జునుల పేర్లు కనబడుతున్నాయి. మొదటి నాగార్జునుడు మాలవాధిపతి అల్లుడూ, చంద్ర వంశీయుడూ అయిన నరేంద్రజిత్తు అనే రాజు కుమారుడు. ఒక శాపం చేత అతను సర్పమై అర్జున వృక్షంలో నివసించేవాడు. మీననాధుడు అతనికి, మళ్ళీ మనుష్య రూపం ఇచ్చి శాప విముక్తుని చేశాడు. అర్జున వృక్షంలో నాగ (సర్ప) రూపంలో నివసించడంచేత అతను నాగార్జునుడయ్యాడు. తరువాత అతను మీననాథుని శిష్యుడై, ఆతని అనుగ్రహం వలన నవనాథులలోని ఒక గొప్ప సిద్ధుడయ్యాడు.[63] అతను దక్షిణ భారత, మగధ దేశాల యాత్ర చేశాడు. ఇతను ఒక వ్యక్తిని సిద్ధునిగా చేసి, అతనికి తన పేరే పెట్టి ఆంధ్రదేశంలో తిరగాల్సిందిగా ఆతన్ని ఆదేశించాడు. ఈ రెండవ నాగార్జునుడు శ్రీశైల పర్వతం చేరి అక్కడ శివుని ఆరాధించాడు. ఒక రాజు గొప్ప మాయాశక్తి గల ఈ ధాతువిధ్యా విధునికి శిష్యుడై, మిత్రుడై ఆతని నుంచి అత్యధిక ప్రమాణంలో సువర్ణం సంపాదించాడు. ఇతనిచే ప్రేరితుడై ఆ రాజు కృష్ణానదికి అవతల ఒడ్డున, ఏలేశ్వరానికి ఉత్తరంగా, అశ్వమేధ పర్వతానికి వాయవ్యంగా ఒక పెద్ద పర్వత దుర్గాన్ని నిర్మించి దానికి ఈ సిద్ధుని పేరు పెట్టాడు. ఇతనికొక రక్షకభట మండలం కూడా ఏర్పాటు చేశాడు. ఆ రాజుకు త్యాగనాగార్జునుడు అని కూడా పేరు ఉండేది. ఈ కథ నాగార్జున కొండ స్థాపనానికి సంబంధించినది కాకపోవచ్చును. ఎందుచేతననగా ఈ దుర్గం ఏలేశ్వరానికి ఉత్తరంగా, కృష్ణానది అవతల ఒడ్డున నిర్మింపబడినదని ఈ కథ చెపుతున్నది. ఆ సిద్ధుడు మొత్తం శ్రీశైల పర్వతాన్ని బంగారంగా మార్చాలని అనుకుంటుండగా, ఇంత బంగారం అనాయాసంగా లభ్యమయినట్లయితే లోక వ్యవస్థ తారుమారు అవుతుందనే ఉద్దేశంతో విష్ణువు ఒక ఉపాయంతో ఆ సిద్ధుని సంహరించాడు.[64] ఈ సిద్ధునికి రాజుతో స్నేహమూ, ఆ రాజుకు ఇతను అత్యధిక ప్రమాణంలో బంగారం ఇవ్వడమూ, రాజు ఇతనికి రక్షకభట మండలిని ఏర్పాటు చేయడమూ ఈ విషయాలన్నీ చైనా కథలో కూడా ఉన్నాయి. ఘంట శైలాన్నీ, ధనకోట పర్వతాన్నీ, బంగారంగా మార్చాలని నాగార్జునుడు ఉద్దేశించినట్లూ, తారాదేవి అతన్ని ఆ పని నుంచి నివారించినట్లూ, టిబెట్ కథల్లో కూడా ఉన్నది.

బుద్ధుని హిందూ దేవతలలో చేర్చి అతన్ని గురించి పౌరాణిక గాథలు అల్లినట్లుగానే నాగార్జునుణ్ణి కూడా శైవ సిద్ధ సంప్రదాయంలోకి తీసికొని, అతని చుట్టూ కథలు అల్లడం జరిగింది.* నాగార్జునుడనే శైవసిద్ధుడు కాని, కాపాలికుడు కాని నిజంగా ఉన్నాడా అనేది సందేహాస్పదమే, బౌద్ధ తత్త్వవేత్తయైన నాగార్జునుని కథలో ఒక సిద్ధుని కథ కలిపివేయడం మాత్రమే జరిగి ఉంటుంది.

క్షేమేంద్రుని "బృహత్కథా మంజరి"లోనూ (క్రీ.శ. 1037-1066), సోమదేవుని "కథాసరిత్సాగరం"లోనూ (క్రీ.శ. 1063-1081), మేరుత్యాంగుని "ప్రబంధ చింతామణి"లోనూ (క్రీ.శ. 14 వ శతాబ్దం) ఉన్న అద్భుత కథలలోనూ, కల్పిత కథలలోనూ, నాగార్జునుని పేర్కొనడం చూస్తే మనకు పైన పేర్కొన్న విషయం నిశ్చితం అవుతుంది. నాగార్జునుడు బోధిసత్త్వుడనీ, గొప్ప ధాతు విద్యావేత్త అనీ దయాశీలుడైన మహా బుద్ధిశాలియనీ, ఒక ఆయుర్వర్ధ ఔషధం తయారు చేసి ఒక రాజును చిరాయువుగా చేసిన సిద్ధుడనీ, ఆకాశంలో సంచరించగలిగిన ఇంద్రజాల విద్యా ప్రవీణుడనీ, ఈ కథలు వర్ణిస్తున్నాయి. కథా సరిత్సాగరంలో నాగార్జునుణ్ణి "బోధి సత్త్వాంశణ సంభవః" అని వర్ణించడం చేత ఈ గ్రంథంలో ఇతను బౌద్ధ తత్త్వవేత్తగా చెప్పబడినాడని జె.ఎస్.స్పెయర్ "కథా సరిత్సాగరాన్ని గూర్చిన అధ్యయనము" (Studies about Kathasaritsagara) అనే గ్రంథంలో అన్నాడు. కాని బౌద్ధ కథలనూ, సిద్ధ సంప్రదాయాలనూ, లోక ప్రసిద్ధ ఇతివృత్తాలను మేళవించి ఒక సంశ్లిష్ట రూపుదైన నాగార్జునుణ్ణి వర్ణించడం జరిగిందని చెప్పడం యుక్తంగా ఉంటుంది. పురాణాలలో వర్ణించబడిన బుద్ధుడు బౌద్ధులు పూజించే శాక్యముని కాదు. ఇద్దరూ వేరని చెప్పడానికి కూడా వీలులేదు. ఎందుచేతననగా బౌద్ధ బుద్ధుణ్ణే చాలా మార్చివేసి పురాణాలలో చిత్రించడం జరిగింది. నాగార్జున బోధిసత్త్వ-సిద్ధ నాగార్జునుల విషయం కూడా అంతే.

మత, మాయా సమూహాత్మకాలైన సిద్ధాంతాచారాలు, ధర్మకీర్తి పశ్చాత్తనమైన బౌద్ధ మతంతో కలిసి, కొన్ని మార్పులు చెంది మధ్య ఆసియా, టిబెట్, మంగోలియా దేశాలకు, తరువాత ఉత్తర ఆసియా, సైబేరియాల దాకా వ్యాపించింది. టిబెట్‌లోని సిద్ధ సంప్రదాయ గాథలలోను, నేపాలులోని గాథలలోనూ నాగార్జునుని గూర్చి

---

* ఈ సందర్భంలో ఋషభుణ్ణి జైన తీర్థంకరులలోనూ, విష్ణువతారాలలోనూ చేర్చిన విషయం గుర్తుంచు కొనదగినది.

పరస్పర విరుద్ధాలైన విషయాలు చెప్పబడ్డాయి. కహోరారా, కరహాటకము, విదర్భ దేశము, విదర్భకు దక్షిణంగా ఉన్న ప్రాంతం విదేహ ప్రాంతం, ఇవి ఆతని జన్మస్థానాలుగా చెప్పబడ్డాయి. ఒక్క కథలో మాత్రమే ఇతను రాజకుమారుడని చెప్పబడింది. మిగిలిన అన్ని కథలలోనూ ఇతను బ్రాహ్మణుడే అని చెప్పబడింది. ఇతనికి సరహునితో వున్న సంబంధాన్ని గూర్చి, సరహుడు ఏడవ శతాబ్దానికి చెందిన వాడవడానికి వీలు కాదనే విషయాన్ని గూర్చి వెనుక చర్చించి ఉన్నాము. ఈ మౌలికాధారాలలో సిద్ధుల పేర్ల పట్టికలు వేరు వేరుగా ఇవ్వబడ్డాయి. ఒకే గ్రంథంలో ఇచ్చిన పేర్లలో క్రమభేదం కనబడుతోంది. నాగార్జునుని పేరు ఉన్న కొన్ని నామ పట్టికలు ఈ విధంగా వున్నాయి:

(1) "నాగార్జునుడు", వ్యాడి, కంబలుడు, ఇంద్రభూతి అనేది ఒక (ఆచార్య) క్రమం. ఈ వ్యాడి ధాతువిద్యావేత్తగా ప్రసిద్ధుడైన వ్యాడియే అయితే, ఇంద్ర భూతి ఎనిమిదవ శతాబ్దం ప్రథమార్థం చివర ఉన్న వ్యక్తియే అయితే, ఈ పట్టికలో "నాగార్జునుడు" ఏడవ శతాబ్దికి చెందిన వాడై వుండాలి.[65] ఇది సత్యం అవడానికి అవకాశం లేదు. బహుశా ఇద్దరు లేదా ముగ్గురు ఇంద్రభూతులు ఉండేవారు. ఈ పట్టికలో ఉన్నవాడు మొదటి ఇంద్ర భూతికాక ఆతని కంటె చాలా కాలం తరువాత వున్న ఇంద్ర భూతి అయి ఉంటాడు.

(2) "నాగార్జునుడు" ప్రాచ్య భారతానికి చెందిన నా–రో–పా(నాదపాదుడు) అనే బ్రాహ్మణుని పేరు ఉటంకించి ఉన్నాడు. ఆతను చిన్నతనంలో ఆవులను మేపుతూ ఉండేవాడట. అతను రాజు కాగలడని ఆశీర్వాదం పొందాడట. ఆ ఆవుల మేపరి కొంత కాలానికి రాజయి, ఆ రాజత్వంతో విసిగి, అది విడిచిపెట్టి, యాయావర (సంచారంచేసే) భిక్షువుగా మారి, నలందా విశ్వవిద్యాలయానికి అధ్యక్షుడై, తరువాత గొప్ప సిద్ధుడయ్యాడు. టిబెట్టు బౌద్ధ మతాచార్యుడైన మార్–పా (1012–1097) యొక్క ప్రధానోపాధ్యాయుల్లో నా–రో–పా ఒకరు. కొంతకాలం విక్రమ శిలా విశ్వవిద్యాలయానికి అధ్యక్షుడై తరువాత టిబెట్ వెళ్ళి, అక్కడ బౌద్ధ మతంలో ఎన్నో మలుపులు తీసుకువచ్చిన అతిస దీపంకర శ్రీజ్ఞాన (క్రీ.శ.982–1054) కూడా నా–రో–పాకు శిష్యుడే. దీనిని బట్టి "నాగార్జునుడు" పదవ శతాబ్దికి చివర, పదకొండవ శతాబ్ద ప్రారంభంలో ఉండేవాడని చెప్పవలసి వస్తుంది.

(3) "నాగార్జునుడు" పద్మసంభవుని శిష్యుడై, అన్ని శాస్త్రాలనూ, ఇంద్రజాల

విద్యనూ కూడ ఆయన దగ్గర క్షుణంగా అభ్యసించాడు. ఆతను నాగరాజైన ముచిలిందునికి స్వాస్థ్యం చేకూర్చి, అందుకు ప్రతిఫలంగా నాగలోకంలో రహస్యంగా నిక్షిప్తమై ఉన్న "ప్రజ్ఞాపారమిత శత సాహస్రిక"ను సంపాదించాడు. విక్రమశిలా విశ్వవిద్యాలయంలోని మత గ్రంథాలన్నీ ముచిలిందుని రక్షణలో ఉండేవట. ఈ సంఘటనలను బట్టి నాగార్జునుడు ఎనిమిదవ శతాబ్దం ఉత్తర భాగంలో ఉండేవాడని చెప్పవలసి వస్తుంది.

(4) "నాగార్జునుడు", సబరుడు, అద్వయవజ్రుడు అనే క్రమంలో మరొక పట్టిక ఉన్నది. అద్వయవజ్రునికి పదవ శతాబ్దికి చెందిన వ్యక్తులతో సంబంధం ఉండేదని తెలుస్తున్నది. దీనిని బట్టి నాగార్జునుడు పదవ శతాబ్దం ప్రారంభానికి గాని, తొమ్మిదవ శతాబ్దాంతానికి గాని చెందిన వాడని చెప్పవలసి ఉంటుంది.[66]

ఈ కథలలో ఏ ఒక్కటీ కూడా, ఇతర కథల కంటె, ఐతిహాసికంగా ఎక్కువ ప్రాధాన్యం కలదని చెప్పడానికి అవకాశం లేదు. బౌద్ధ సిద్ధుల పేర్ల పట్టికలోను, శైవ సిద్ధుల పేర్ల పట్టికలోనూ నాగార్జునుని పేరు ఉన్నంత మాత్రం చేత అతను సిద్ధుడని కాని, సిద్ధ నాగార్జునుడొకడు ఉండేవాడని కాని చెప్పడానికి వీలు కాదు. శాక్తుల పేర్ల పట్టికలలో కపిల-శంకరాచార్యుల పేర్లు ఉన్నంత మాత్రాన ఒక శాక్త కపిలురూ, ఒక శాక్త శంకరుడూ ఉండేవారని చెప్పడం ఎలా అశక్యమో ఇది కూడా అంతే* నాగార్జునుడని పేరు పెట్టుకొన్న ఎంతో మంది సిద్ధులు ఉండేవారనీ ఒక్క సిద్ధ నాగార్జునుడు మాత్రమే కాదనీ రాబోయే అనుచ్ఛేదంలో స్పష్టం కాగలదు. నాగార్జునునికి సంబంధించిన కథలన్నింటి లోనూ, ద్వితీయ తృతీయ శతాబ్దులకు చెందిన ఉత్తమ తత్త్వవేత్తకు సంబంధించిన సంఘటనలూ, ఏడు, పది శతాబ్దుల మధ్య వివిధ సమయాల్లో జరిగిన కొన్ని ఇతర సంఘటనలూ చేర్చి అవన్నీ ఒకే వ్యక్తికి సంబంధించినట్లుగా చెప్పడం జరిగింది. మేధోవంతులైన

---

* పరస్పర విరుద్ధాలైన దర్శనాలకూ, తంత్రాలకూ సంబంధించిన కొన్ని ఆచార్య పరంపరలలో వసిష్ఠుడు, అగస్త్యుడు, వ్యాసుడు, దుర్వాసుడు మొదలైన ఋషుల పేర్లు ఉన్నాయి. ధాతు విద్యా ప్రవీణులైన సిద్ధుల నామధేయ పట్టికలలో కపిలుని పేరు, శంకరాచార్యుల గురువైన గోవింద భగవత్పాదుని పేరూ చేర్చబడి ఉన్నాయి. దాని ఆధారంగా ఒక తాంత్రిక వసిష్ఠుడు, ధాతువాది గోవిందా చార్యులు ఉండేవారని చెప్పలేము.

టిబెట్ దేశీయులూ, భారతీయులూ ఈ విధమైన కథలు ఎలా చెప్పి ఉంటారు? ఈ ప్రశ్నకు సమాధానం ఈ క్రింది విధంగా చెప్పవచ్చును:

(1) మొదటి శతాబ్దంలో జన్మించిన నాగార్జునుడు, ఆరువందల సంవత్సరాలు జీవించాడు. మూడు వందల సంవత్సరాల పాటు ఈ ప్రపంచంలో పనిచేసి, తరువాత మూడు వందల సంవత్సరాల పాటు ఆధ్యాత్మిక రహఃస్థితిలో ఉండిపోయాడు. యోగశక్తి చేత ఇతను తన శరీరాన్ని దేదీప్యమానంగా, ఇంద్ర ధనూరూపంగా, చేసికొని ఇంకా జీవించే ఉన్నాడు. ఇచ్ఛానుసారంగా దృశ్యుడు కాగలడు, అదృశ్యుడు కాగలడు. రహస్య శాస్త్రాలు ఇతని ద్వారా, ఇతని శిష్యుల ద్వారా క్రీ.శ. రెండవ, మూడవ శతాబ్దులలో ప్రచారానికి వచ్చాయి. ఇది టిబెట్టులోని లామా సంప్రదాయం వారి విశ్వాసం.[67]

(2) "మహానాగ" అనేది గొప్ప ఆధ్యాత్మిక స్థితిని చేరిన వారికి ఇచ్చే ఒక బిరుదుగా ఏర్పడింది. "క్లేశాలను జయించిన వాడు నాగుడు" అని "మజ్ఝమనికాయం"లో (I.23) చెప్పబడింది. "పాపాల నుంచి దూరంగా ఉన్న మహా పురుషుడే మహానాగుడు" (మహాత్=గొప్ప; న=లేని; గ=పాపము=పాపములు లేని గొప్పవాడు) అని, లేదా "ఇతరులైన అర్హతల కంటె (జ్ఞాన ప్రకాశం సంపాదించిన వారికంటె) గొప్పవాడు మహానాగుడు"[68] అని "ప్రజ్ఞాపారమితా శాస్త్రం"లో చెప్పబడింది. "క్లేశాలను జయించడానికి చేసిన యుద్ధంలో గొప్పవిజయమును సాధించిన పావన పురుషులలో "మహాప్రధానుడు", "మహానాగుడు" అని హరిభద్రసూరి అనే ఒక ప్రామాణికుడు చెపుతున్నాడు.[69] నాగార్జున పదానికి కూడా ఇలాంటి ప్రతీక రూపమైన ప్రాధాన్యం ఇవ్వబడి ఉండడంచేత, ఆధ్యాత్మికోన్నతిని సాధించిన వారికి ఈ బిరుదు ఇవ్వడంకాని, తాంత్రిక విధానాల ఉపదేశం పొందిన వారికి ఈ పేరు పెట్టడం కాని జరిగి ఉండేదని ఊహించవచ్చును. ఇలాంటి కారణాలవల్లనే మనకు చాలా మంది శంకరులు ఉన్నారు. ఇదే వీరిరువురిలో అభిప్రాయ విక్షేపాలకు దారితీసి ఉంటుంది.

(3) నాగార్జునుని వంటి బోధిసత్త్వుడు లోకానుగ్రహార్థమై అనేక పర్యాయాలు అవతరించాడనే విశ్వాసం ఉండి ఉండాలి. అందుచేత తరువాతి కాలంలో ఆవిర్భవించి, నాగార్జునుని వంటి ఆధ్యాత్మికోన్నతి సాధించిన సిద్ధులను అతని

పునరావిర్భావాలు పరిగణించి, వారి అందరి జీవితాలనూ ఒక వ్యక్తి యొక్క అవిచ్ఛిన్న జీవనంగా భావించి ఉంటారు.

(4) వివిధ విద్యా నిష్ణాతుడైన ఆ మహా తత్త్వవేత్త యొక్క ప్రభావం మత చరిత్ర మీద ఎంతగా ప్రసరించిందనగా– అతనికి సంబంధించిన వివిధ స్మృతుల సామూహిక శక్తి వలన ఒక ఆదర్శ వ్యక్తి యొక్క చిత్రాన్ని నిర్మించుకొని దానిని మాత్రమే స్మృతిపథంలో నిలుపు కోవడం జరిగింది. కాబట్టి మనం నాగార్జునుని గూర్చి చెప్పుకునే కథలన్నీ సమూహాత్మక నాగార్జునుని కథలు. భారత, చైనా, టిబెట్ దేశాలలోని సంప్రదాయికులు ఇతని ఐతిహాసిక వ్యక్తిత్వాన్ని పౌరాణిక వ్యక్తిత్వంగా మార్చి, అతను నిజంగా సాధించిన ఉత్తమ కార్యాలకు మాయా శక్తులనూ, తాంత్రిక సిద్ధులనూ జోడించి, ఈ వ్యక్తిత్వానికి సంబంధించినవీ, శ్రద్ధాళువులకు యథార్థాలుగానే కనబడేవీ అయిన "జీవిత చరిత్రలు" నిర్మించారు. కుమారాజీవుని జీవిత చరిత్రలో నాగార్జునుడు మాయా విద్యలో సమర్థుడని వర్ణించబడ్డాడు. మాయావిద్యా విచక్షణుడైన "సిద్ధ నాగార్జునుడు" ఒకడు లేకుండానే ఈ విధమైన వర్ణన చేసే అవకాశం లేకపోలేదు. అందుచేత సమూహాత్మక నాగార్జునుడు, లేదా ఆదర్శరూప నాగార్జున చిత్రమే తాత్త్వికుడు; బోధిసత్త్వుడు; తాంత్రికుడు; సిద్ధుడు; మాయా విద్యావేత్త. ఒక్క "వ్యాసుడు" వేదాలను విభజించాడు. బ్రహ్మసూత్రాలు వ్రాశాడు, మహాభారతం రచించాడు. అష్టాదశ మహా పురాణాలు నిర్మించాడు. ఇంకా ఎన్నో పనులు చేశాడు. అదేవిధంగా ఒకే నాగార్జునుడు "ప్రజ్ఞాపారమిత" ప్రచారం చేశాడు. మాధ్యమిక కారికలు వ్రాశాడు; తత్త్వశాస్త్ర గ్రంథాలు, ఎన్నో తంత్ర గ్రంథాలు, కక్షపుట వంటి[70] ఇంద్రజాల విద్యా గ్రంథాలు రచించాడు. ఇంకా ఎన్నో పనులు చేశాడు. ఈ విభిన్న వైకల్పిక పక్షాలలో చివరిదే నాకు అంగీకారయోగ్యమైనది.

V

నాగార్జునుడు - విజ్ఞాన శాస్త్రం

నాగార్జునుడు వివిధ విద్యా ప్రవీణుడు అని చెప్పడంలో సందేహం లేదు. ఇతను జ్యోతిష శాస్త్రవేత్త (ఫలభాగ), ఖగోళ శాస్త్రవేత్త, శారీర శాస్త్రజ్ఞుడు, రసాయనశాస్త్ర నిపుణుడు, ధాతువిద్యా విశారదుడు, లోహపరిణామ విధాత, ప్రసిద్ధ భిషగ్వరుడు అంటు అతి ప్రాచీనములైన చైనా దేశ గ్రంథాలు చెపుతున్నాయి. నేత్రాన్ని గూర్చి అతను రచించిన గ్రంధము, అతను సూచించిన నేత్ర వైద్య విధానాలు చైనాలో లభిస్తున్నాయి.పదమూడవ శతాబ్దంలో 'సుశ్రుత సంహిత'కు వ్యాఖ్య వ్రాసిన దల్లనుడు, సుశ్రుత సంహితను నాగార్జునుడు పరిష్కరించాడని వ్రాశాడు. ఈ నాగార్జునుడు తత్త్వవేత్తయైన నాగార్జునుడే అని జూలియస్ జాలీ అభిప్రాయం. నాగార్జునుడు సుశ్రుత సంహితకు "ఉత్తర తంత్రం" అనే పేరుతో ఒక అనుబంధం కూడా చేర్చాడట.

సుశ్రుతుని పేరు మహాభారతంలోను, నాల్గవ శతాబ్దికి చెందిన ఆయుర్వేద గ్రంథాలలోనూ పేర్కొనబడినది. బోవెర్ కాష్గర్‌లో కనుగొన్న ఈ గ్రంథాలను "బొవర్ లిఖిత గ్రంథాలు" అనే పేరుతో హెర్నెల్ ప్రకటించాడు. అయితే ఈనాడు మనకు లభ్యమవుతున్న రూపంలో "సుశ్రుత సంహిత", చక్రపాణిదత్తుడు వ్యాఖ్యానం వ్రాసే నాటికి, అనగా పదకొండవ శతాబ్దానికి మాత్రమే సిద్ధమైంది. అందుచేత సుశ్రుతుడు నాగార్జునుని కంటె పూర్వ కాలం వాడా, ఈ గ్రంథంలో సుశ్రుతుడు చెప్పిన సిద్ధాంతాలకు, పద్ధతులకు నాగార్జునుడు ఏమైనా క్రొత్త విషయాలు చేర్చాడా అనే విషయంలో మనం నిశ్చితంగా ఏమీ చెప్పలేము. చికిత్సకు సంబంధించిన నూరు సూత్రాలను బోధించే "యోగశతకం" అనే గ్రంథం నాగార్జునుడే వ్రాశాడని కొందరూ, వరరుచి వ్రాశాడని మరి కొందరూ

అంటున్నారు. ఇది అనేక విభిన్న స్వరూపాలలో నేపాల-సింహళ భాషలలో లభిస్తుంది. దీని ఒకే రూపం సంస్కృతంలో, మధ్య ఆసియాలోని చిన్న రాష్ట్రమైన కుచ రాష్ట్రంలో లభించింది. ఇది నాగార్జునుని రచన కాదు. "ఆరోగ్య మంజరి" అనే గ్రంథం విషయం కూడా అంతే. నాగార్జునుని రచనలని చెప్పే లోహ శాస్త్రానికీ, రతి శాస్త్రానికి సంబంధించిన రెండు గ్రంథాలు కూడా ప్రామాణికాలు కావు.

"రస రత్నాకరం" ఇపుడు మనకు లభిస్తున్న స్వరూపంలో, ఏడవ శతాబ్దికి, లేదా ఎనిమిదవ శతాబ్దికి చెందిన గ్రంథం అయి ఉంటుందని ఆంతరంగిక పరీక్షను బట్టి తెలుస్తున్నది. "శ్రీశైల నివాసి, సకలప్రాణి క్షేమంకరుడు, భాగ్య ప్రకాశాలతో వెలుగొందుచున్న వాడూ అయిన మహాసిద్ధ నాగార్జునునికీ" శాతవాహన రాజుకీ మధ్య జరిగిన సంవాద రూపంలో, కొన్ని రసాయనిక ప్రయోగాలు ఈ గ్రంథంలో ప్రతిపాదించబడ్డాయి. ఇక్కడ చెప్పిన దానిని బట్టి నాగార్జునుడు భారతీయ రసాయన శాస్త్ర పితామహుడని తెలుస్తున్నది. ఈ గ్రంథం రచించిన వాడు సిద్ధ నిత్యనాథుడని కొందరు అంటారు. దీనికి చాలా స్వరూపాలు ఉన్నాయి. బహుశా ఈ గ్రంథం బౌద్ధ మత పరిస్థితులలో రచించబడి ఉంటుంది. నాగార్జున రచనగా చెప్పబడే "మహాప్రజ్ఞా పారమితా శాస్త్రం"లో, ఒక వస్తువును ఓషధి, ధాతు, సంయోగ, మాయా, సమాధి బలాల ద్వారా సువర్ణంగా మార్చే పద్ధతులు ప్రతిపాదించబడ్డాయి. రసోపనిషత్తులో, కేరళ దేశంలో ఎక్కడో ఉన్న సువర్ణ నిక్షేపాలు గల రాళ్ళ నుంచి ఆ సువర్ణాన్ని ఆకర్షించడానికై నాగార్జునుడు కనిపెట్టిన విశిష్ట విధానం వర్ణించబడింది. నాగార్జునుడు రసాయన శాస్త్రజ్ఞుడనీ, ధాతువిద్యా నిపుణుడనీ, ఆనాటి వారు నమ్మేవారనే విషయాన్ని ఇవన్నీ రుజువు చేస్తున్నాయి. పునర్నిర్మిత రూపంలో ఇపుడు లభించే "రసరత్నాకరం" అర్వాచీన గ్రంథమే అయినా, 'టో' మతానుసారీ, ధాతువిద్యా విదుడూ, మూడు, నాలుగు చెందిన వాడైన కోహంగ్ వ్రాతలలో రసరత్నానుకరణలు కనబడుతున్నాయి.[72] "నిజానికి ఇది రెండవ శతాబ్ది వాడైన బౌద్ధ నాగార్జునుని కాలానికి చెందినదై ఉంటుంది".[73] మన తత్త్వచింతకుని అభిప్రాయాలేవైనా దీనిలో ఉన్నవేమో మనకు తెలియదు. సోమనాథ్ దగ్గర ఉన్న దైహక్ కోటకు చెందిన ఒక సోమనాథుడు తన కంటె నూరు సంవత్సరాలకు పూర్వం ఉండేవాడనీ, ఆతను కాయ చికిత్సలో (రసాయన ప్రక్రియలో) సాటిలేని

ప్రావీణ్యం కలవాడనీ, దీనికి సంబంధించి శాస్త్ర విషయాలన్నీ సంగ్రహించి అతడొక గ్రంథం రచించాడనీ, అల్బేరూని వ్రాశాడు.[74] క్రీ.శ. 1030 ప్రాంతంలో భారతదేశంలో పర్యటించిన అల్బేరూని తన కాలంలో ప్రచారంలో ఉన్న, సమూహాత్మక నాగార్జున సంబద్ధాలైన విషయాలను వ్రాసి ఉండవచ్చును. లేదా క్రీ.శ.900 ప్రాంతంలో, పశ్చిమ భారతంలో, రసాయన విద్యా ప్రయోగం చేసే ఒక వ్యక్తి ఎవరైనా ఉండి ఉండాలి. ఒక సంప్రదాయ నాగార్జునుడు ఈ విద్యలో ప్రవీణుడని చెపుతున్నదనీ, మరొక మౌలికాధారం ప్రకారం ఇతను పశ్చిమ భారతదేశం వాడనీ మనం తెలుసుకున్నాము. అందుచేత అల్బేరూనీ చెప్పినది సమూహాత్మక నాగార్జునుని గురించే అయి ఉంటుంది.

మహాతత్త్వవేత్త, విజ్ఞాన శాస్త్ర ప్రవీణుడు అవడం అసంభవం కాదు. ఇలాంటి ఉదాహరణలెన్నో మనకు చరిత్రలో కనబడతాయి. అరిస్టాటిల్ భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం, వాతావరణ శాస్త్రం, మానసిక శాస్త్రాలలో గ్రంథాలు రచించాడు. అనేక శాస్త్రాల్లో పండితుడైన అల్‌కిండి, తత్త్వ శాస్త్రవేత్త అవడమే కాక వైద్యుడుగా కూడా ప్రసిద్ధి చెందాడు. భూగోళ, చరిత్ర గ్రంథాలు రచించాడు. తత్త్వ శాస్త్రవేత్త అయిన ఇబిన్‌సినా వైద్య విద్యలో కూడా సిద్ధహస్తుడు. తత్త్వశాస్త్ర నిష్ణాతుడైన ఇబిన్ రోషడ్ గొప్ప వైద్యుడుగాను, న్యాయ శాస్త్రవేత్త గానూ కూడా ప్రసిద్ధి పొందాడు. అల్బేరూనీ మత, ఖగోళ, భూగోళ, మానవజాతి శాస్త్ర గ్రంథాలు రచించాడు. మన సమకాలికుల్లోనే స్పెన్సెర్, కక్‌స్లీ, రస్సెల్, వైట్‌హెడ్ మొదలైన వారు అనేక (ఒకదాని కంటె ఎక్కువ) శాస్త్రాలలో గ్రంథ రచన చేసి ఆయా విజ్ఞానాల అభివృద్ధికి దోహదం చేశారు. అన్ని సంప్రదాయాల వారూ ఐక్య కంఠంతో చెప్పడాన్ని బట్టి నాగార్జునుడు కూడా రసాయన శాస్త్ర, ధాతు విద్యలలో నిపుణుడైతే కావచ్చును కానీ అపూర్వమైన వైజ్ఞానిక విషయాలేవైనా ఇతను కనిపెట్టాడా అనే విషయం మనకు తెలియదు.

రెండవ భాగం

I

జీవిత చరిత్రకు సంబంధించిన విశేషాలు

మొదటి భాగంలో వివరించబడిన విషయాలు, నాగార్జునుని జీవిత చరిత్రకు సంబంధించిన బౌద్ధుల మౌలికాధార గ్రంథాలలో ఉన్న అంశాలను సంక్షిప్తంగా సమీక్షించడానికి సహకరిస్తాయి. వీటిని సిద్ధుల కథలు, చరిత్రలు, మత గ్రంథాలు, జీవిత చరిత్రలు అని (నాలుగు విధాలుగా) విభజించవచ్చును.

I. ఈ క్రిందివి మొదటి తరగతికి చెందినవి:

(1) "గ్రుబ్‌తాబ్"– దీనిని ఎ.గ్రీన్ వెడెల్ అనే జర్మన్ పండితుడు "ఎనభై నలుగురు అభిచారికుల చరిత్ర" (Die Geschichteder 84 Zavberer) అనే పేరుతో జర్మన్ భాషలోనికి అనువదించాడు. (చూ. నిర్దిష్ట సూచిక 66). దీనికి మూలం ఒక సంస్కృత గ్రంథమని చెప్పబడుతున్నది. బహుశా ఇది పదకొండవ శతాబ్దికి చెందినదై ఉంటుంది. "అభయ దత్తశ్రీ" దీని రచయిత కావచ్చును.

(2) ఛో–జంగ్ లేదా తారనాథుడు (క్రీ.శ.1573లో జన్మించాడు) రచించిన "ఏడు ఆవిష్కరణల గ్రంథము" (The Book of Seven Revelations). ఇది ఎ.గ్రీన్ వెడెల్ చేత జర్మన్ భాషలోకి అనువదింపబడింది. ఈ జర్మన్ అనువాదాన్ని "తారనాథుని రహస్య తత్వగాథలు" అనే పేరుతో బి.ఎన్. దత్తా సంక్షిప్తం చేశాడు (కలకత్తా, 1957).

(3) జి.తుచ్చి ప్రకటించిన, నేపాలులో లభించిన "సిద్ధానామ్ ఆమ్నాయః" గ్రంథం (చూ. 66 నిర్దిష్ట సూచిక) ఈ మూడు గ్రంథాలకి ఈ క్రింది విషయాలలో ఐకమత్యం వున్నది. నాగార్జునుడు గొప్ప పండితుడు, తాంత్రికుడు, మాయా విద్యావేత్త, ధాతువిద్యా ప్రవీణుడు. ఇతను ఎన్నో దేవాలయాలు (చైత్య విహారాదులు) కట్టించాడు. అనేక గ్రంథాలను రచించాడు. నాగార్జునుడు

దక్షిణా పథంలో (దక్షణ భారతదేశంలో)* జన్మించిన బ్రాహ్మణుడు. నలంద విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశాడని మొదటి రెండు గ్రంథాలలో అధికంగా చెప్పబడింది. ఇతను జోస్యం చెప్పిన విధంగా ఒక అభీర బాలుడు (గొప్ప పిల్లవాడు) రాజు అయ్యాడు. ఈ రాజు లేదా మరొక రాజు, నాగార్జుననికి పరమ మిత్రుడయ్యాడు. ఆ రాజుకు ఇతను చిరయౌవనాన్ని, దీర్ఘాయుర్దాయాన్ని ప్రసాదించాడు. ఆ రాజు యొక్క కుమారుడు ప్రార్థించగా "గ్రుబ్ తాబ్" ప్రకారం బ్రహ్మ కోరగా నాగార్జునుడు తన జీవితాన్ని విడిచాడు (చూ. తరువాత). జీవితం ఉత్తర భాగంలో ఇతను చాలా సంవత్సరాల పాటు శ్రీపర్వతం మీద నివసించాడు. కొన్ని వందల సంవత్సరాలు జీవించాడు. నాగలోకం నుంచి "ప్రజ్ఞా పారమితా శాస్త్రం" తీసికొని వచ్చాడని కూడా రెండవ గ్రంథంలో చెప్పబడింది. పై విషయాలకు సంబంధించిన కొన్ని విస్తృతాంశాలలో ఈ అభిప్రాయ భేదం ఉంది. వీటి ఐతిహాసిక ప్రాధాన్యం అత్యల్పమైనది.

II. ఈ క్రిందివి రెండవ తరగతికి చెందినవి:

(1) బుస్టోన్ (క్రీ.శ. 1290-1364) వ్రాసిన "బౌద్ధమత చరిత్ర" (History of Buddism). దీనిని ఇ. జీబెర్ మిల్లర్ అనువదించాడు (హీడెల్ బర్గ్, 1931). షాలు విహారానికి చెందిన ఒక అధికారియైన బుస్టోన్ టిబెట్‌లో జన్మించిన అత్యుత్తమ పండితులలో ఒకడు. ఆతనీ చరిత్ర గ్రంథాన్ని 1323లో పూర్తి చేశాడు. టిబెట్ బౌద్ధ మతానికి సంబంధించిన మత గ్రంథాన్ని సంకలనం చేసిన వాడవడం చేత అతను ఆ మతానికి "వేదవ్యాసుడు". బౌద్ధ సిద్ధాంతాలు, విభిన్న యానాలు, వాటి అభివృద్ధి మొదలైన అంశాలకు సంబంధించినంత వరకు ఈ గ్రంథంలో ఎన్నో ఉపయోగకరమైన విషయాలు లభిస్తాయి. అయితే, ఐతిహాసిక క్రమదృష్టితోనూ, వ్యక్తులు, సంఘటనలకు సంబంధించిన తథ్యాల దృష్టితోనూ చూస్తే ఇది అంతగా ప్రాధాన్యం కలది కాదు.

* మొదటి పుస్తకంలో ఇతను 'కహెూర'లో పుట్టినట్టున్నది. ఇది కాంచిలోని భాగము (వాల్లెసర్). కరహాటకంలో (సతారా జిల్లాలోని కరడ్?) జన్మించినట్లు మూడవ పుస్తకములో ఉన్నది.

(2) తారానాథుని "బౌద్ధమత చరిత్ర" 1608లో పూర్తి అయింది. దీనిని ఏ.షేఫ్నెర్ 'Geschichte der Buddhismus in Indien' అనే పేరుతో అనువదించాడు (St. Petersburg, 1869). దీని ఆంగ్లానువాదం "ఇండియన్ స్టడీస్: పాస్ట్ అండ్ ప్రెజెంట్" అనే పత్రికలో ధారావాహిక రూపంలో ప్రచురితమై పుస్తక రూపంగా కూడా వెలువడినది.

(3) సుంపా ఖంపో యెశ్‌పాల్ జార్ రచించిన "బౌద్ధమత చరిత్ర"* క్రీ.శ. 1747లో పూర్తి చేయబడినది. యస్.పాఠక్ ఇందులో ఉన్న నాగార్జునునికి సంబంధించిన భాగాన్ని అనువదించాడు.[75]

(4) థు-ఉ-బక్‌వాన్, బ్లోబ్జన్-బోస్-క్యీ-ని-మా (1737-1802) రచించిన "స్ఫటికా దర్శనము: తత్వశాస్త్రీయ సిద్ధాంతాలను గూర్చిన ఒక ఉత్తమ గ్రంథము" (The Mirror of Crystal: An Elegant Treatise On Philosophical Schools)** యస్.సి.దాస్, వాల్లెస్టర్ వ్రాసిన వ్యాసాలలో దీనిలో నుంచి అవసరమైన విషయాలు గ్రహించబడ్డాయి.[76] ఈ చివరి మూడు గ్రంథాలు కూడా బుస్టోన్, గ్రుబ్-తాబ్‌లపై అధారపడిన గ్రంథాలు. గ్రుబ్ తాబ్, మత గ్రంథాలు, సంప్రదాయం వీటిపై ఆధారపడినది బు-స్టోన్ గ్రంథం.

ఈ గ్రంథాలకి క్రింది అంశాలలో స్థూలంగా ఐకమత్యం ఉంది :

నాగార్జునుడు దక్షిణ భారత దేశంలోని, విదర్భ ప్రాంతంలోని బ్రాహ్మణ కుటుంబంలో, బుద్ధుని తరువాత నాలుగు వందల సంవత్సరాలకి పుట్టాడు. విదర్భకు దక్షిణ ప్రాంతంలో జన్మించాడని సుంపా ఖంపో అభిప్రాయం. ఇతని తల్లిదండ్రులకు చాలా కాలం వరకు సంతానం కలగలేదు. ఒక స్వప్నంలో చెప్పిన ప్రకారం లేదా జోస్యం ప్రకారం, వారు వంద మంది బ్రాహ్మణులకు యథావిధిగా సంతర్పణలు చేయడంచేత వారికి తను కుమారుడుగా జనించాడు. దైవ నిర్ణయం ప్రకారం ఇతను శైశవంలోనే మరణించవలసి ఉన్నా, వారు అటువంటి సంతర్పణలు మరో రెండు చేసి,

---

* పాగ్-సామ్-జాన్-జంగ్

** దుబ్-తాహ్-సెల్-క్యీ-మి-లాన్

ఏడు సంవత్సరాలు జీవించేటట్లు చేయగలిగారు. ఆ పిల్లవాడు తమకండ్ల ఎదుట మరణించడం చూడడానికి ఇష్టపడక తల్లిదండ్రులు అతనిని ఒక సేవకునికి అప్పగించి దేశ సంచారానికి పంపారు. ఇతను దేశాటనం చేస్తూ నలంద విశ్వవిద్యాలయం చేరాడు. అక్కడ సరహుడు ఈ చిన్న పిల్లవాని సామవేద గానానికి ముగ్ధుడై ఇతనికి అమితాయు బుద్ధ మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రం జపించడం చేత ఇతను చిరంజీవి అయ్యాడు. నలందలో అతను మొదట సరహుని వద్దను తరువాత రాహుల భద్రుడనే సంఘారామాధిపతి వద్దనూ (బస్టన్ చెప్పిన దానిని బట్టి) విద్యాభ్యాసం చేశాడు. తరువాత భిక్షువై భిఖు సంఘానికి అధికారి అయ్యాడు. మరొక ఆఖ్యానం ప్రకారం నలంద విశ్వవిద్యాలయానికి అధిపతి అయ్యాడు. కొంత కాలానికి ఇతను గొప్ప తాంత్రికుడుగా, ధాతువిద్యా ప్రవీణుడుగా, మాయా విద్యా విశారదుడుగాను అయి వేల కొలది ఆలయాలు నిర్మించాడు. నాగలోకం నుంచి "ప్రజ్ఞా పారమిత" తీసికొని వచ్చాడు. బుద్ధగయలోను, అమరావతిలోను ఉన్న చైత్యాలను బాగు చేయించి సముద్ధరించాడు. మహాపండితుడై అనేక గ్రంథాలు రచించాడు. రాజు అవుతానని ఒకరికి జోస్యం చెప్పడం, రాజుకు మిత్రుడు అవడం,* ఒక రసాయనం ద్వారా రాజుకు దీర్ఘాయుర్యౌవ్వనాలు ఇవ్వడం, రాజకుమారుని కోరిక మన్నించి ప్రాణాలు విడవడం, శ్రీపర్వతం మీద చాలా కాలం నివసించడం మొదలైన విషయాలు ఈ "చరిత్ర"లలో కూడా ఉన్నాయి. ఇతను వందల కొలది సంవత్సరాలు జీవించాడు. మరొక ఆఖ్యానం ప్రకారం, ఇతను మళ్ళీ సజీవుడు కానున్నాడు. ఈ విషయాలకి సంబంధించిన కొన్ని విస్తృతాంశాలలో కూడా ఈ మౌలికాధారాలలో కొంత అభిప్రాయ భేదం ఉంది. ఇతర విషయాలలో కూడా పూర్తి అభిప్రాయ బేధం ఉంది. బుద్ధుని ప్రియశిష్యుడైన ఆనందుడే నాగార్జునుడుగా అవతరించాడని ఒక లామా సంప్రదాయం చెబుతున్నది. ఈతని ఐదు ప్రధాన గ్రంథాల విషయంలో బుస్టన్‌కు, తారానాధునికి ఐకమత్యం ఉన్నది. ఇతను ప్రారంభంలో సర్వాస్తివాదాన్ని అంగీకరించాడని

* నాగార్జునుడు భవిష్యవాణి ప్రకారం రాజు అవుతావంటూ చెప్పిన వాడు ఇతనేనా, కాదా అనేది స్పష్టంగా తెలియదు.

చెపుతూ, సుంపా ఖంపో పరస్పర విరుద్ధంగా ఉన్న సంప్రదాయాలకి సమన్వయం చేయడానికి ప్రయత్నించ కుండానే ఈతని జన్మ స్థానాదులను గూర్చి కూడా వ్రాశాడు. బుద్ధుని అనంతరం ఆరు వందల సంవత్సరాల తరువాత నాగార్జునుడు జన్మించాడని కొన్ని టిబెట్ చరిత్రలలో చెప్పటమైంది. పురాణాల వలె ఈ గ్రంథాలు కూడా పురావృత్త రూపమైన అసంస్కృత ఖనిజం అత్యధికంగా లభించే గనులు. ఐతిహాసిక సత్యాలనే సువర్ణ రేణువులు అత్యల్పంగా దృష్టి గోచరం అవుతాయి. ఈ "చరిత్రలు" క్రీ.శ.ఎనిమిదవ శతాబ్దం మధ్య భాగం నుంచి పంద్రెండవ శతాబ్దం మధ్య భాగం వరకూ ఉన్న పాల వంశీయుల పేర్ల విషయంలో కూడా సరిగా లేవు. టిబెట్‌తో నిరంతర సంబంధం ఉన్న బెంగాలులో జరిగిన సంఘటనలను కూడా వీటిలో యథార్థ రూపంలో చిత్రించడం జరగలేదు. అలాంటి గ్రంథాలలో లభించే అతి ప్రాచీనులైన వ్యక్తులను గూర్చిన వృత్తాంతం యథార్థంగా ఉంటుందని అనుకోవడం కల్ల.

III. మూడవ తరగతికి చెందిన మౌలికాధారాలు ఇవి:

(1) "మహా మేఘ సూత్రము" మూల గ్రంథం లుప్తమైపోయినా క్రీ.శ.414–421 సంవత్సరాలకు చెందిన చైనా అనువాద రూపంలోను, టిబెట్ భాషానువాద రూపంలోను సురక్షితంగా ఉంది. అయితే ఈ రెండు అనువాదాలకీ ఐకమత్యం లేదు. "బుద్ధుని మరణానంతరం పన్నెండు వందల సంవత్సరాలకి, శాతవాహన రాజు కాలంలో, దక్షిణ భారతంలోని సౌరాష్ట్ర దేశంలో, సుపయా నదీ సమీపాన ఉన్న "కుసుమమాలు" లేదా "సుమనమాల" అనే గ్రామంలో "నాగార్జునుడు" అనే ఒక గొప్ప బౌద్ధ శ్రమణుడు జనించాడు. అతను ధర్మ రక్షణార్థమై తన జీవితాన్ని త్యాగం చేశాడు" అని మొదటి గ్రంథంలో చెప్పబడింది. బుద్ధ నిర్వాణానంతరం నాలుగు వందల సంవత్సరాలకు, విపత్తి చికిత్సకుడనే రాజు కాలంలో, దక్షిణ భారతంలోని 'రిషిలా' దేశంలో, సుందరభూతి నదికి ఉత్తర తీరాన ఉన్న మహావటాక గ్రామంలో, వైశ్యుల భూమి మీద ఒక లిచ్ఛవి జన్మించాడు. అతను నాగుడనే శ్రమణుడై, బుద్ధుని పేరు కూడా ధరించి, ధర్మ ప్రచారం చేసి దాని కోసం ప్రాణత్యాగం చేశాడు"[77] అని రెండవ గ్రంథంలో

చెప్పబడింది. ఈ గ్రంథాల్లోని ఆఖ్యానాలలో ఉన్న భేదాన్ని బట్టి ఈ రెండు గ్రంథాలూ అప్రామాణికాలే అని తేలుతుంది. బహుశా రెండవ కథ 'నాగబోధి' లేదా 'నాగబుద్ధుడు' అనే మరొక శ్రమణునికి సంబంధించి ఉంటుంది.

2. "లంకావతార సూత్రం"లోని సగతక ప్రకరణంలో ఒక ఖండిక. ఇది గుణభద్రుడు వ్రాసిన మొట్టమొదటి చైనా భాషానువాదంలో (క్రీ.శ.443) లేదు. బోధిరాచి (క్రీ.శ. 513) అనువాదంలోను, శిఖానందుని (క్రీ.శ. 700–704) అనువాదంలోను ఉంది. ఇది సంస్కృత మూలంలో కూడా ఉన్నది. దీని గూర్చి గుణభద్రునకు తెలియదు. ఇందులో గుప్తులను, మ్లేచ్ఛులనూ పేర్కొనడం జరిగింది. అందుచేత ఈ ప్రకరణం క్రీ.శ. 443–513 సంవత్సరాల మధ్య చేర్చబడి ఉంటుందని చెప్పవచ్చును. ఈ ప్రకరణంలో ఈ విధంగా చెప్పబడింది: "దక్షిణ భారతంలో 'వెదలి' అనే గ్రామంలో నాగుడనే పేరు గల గొప్ప బౌద్ధ సన్యాసి జన్మించాడు. అతను అస్తిత్వ-నాస్తిత్వాల విషయంలో ఉన్న అతి విరుద్ధ భావాలు తొలగించి మహాయానమే బుద్ధుడు ఉపదేశించిన సిద్ధాంతమని-ప్రతిపాదించాడు. ఆధ్యాత్మికోన్నతిలో పరమావధిని అందుకొని, మరణానంతరం 'సుఖవతీ' స్వర్గం చేరుకున్నాడు". చైనా గ్రంథంలో కాలం పేర్కొనబడలేదు కాని, సంస్కృత గ్రంథం మాత్రం ఇతను బౌద్ధ నిర్వాణానంతరం నాలుగు వందల సంవత్సరాలకు జన్మించి, ఆరువందల సంవత్సరాలు జీవించినాడని చెబుతున్నది. టిబెట్‌లోని గ్రంథాలలో నాగుడనే పేరు గల మరొక వ్యక్తి కూడా కనబడుతున్నాడు. అందుచేత ఈ గ్రంథంలో చెప్పబడినవాడు నాగార్జునుడా లేక మరొక వ్యక్తియా అని సందేహం కలుగుతుంది. అయితే ఇతను నాగార్జునుడే అని చెబుతున్న ఆ గ్రంథానువాదకుల మాటలు మనం విశ్వసించవచ్చును.

3. "మంజుశ్రీ మూల కల్పం"లో, "బుద్ధ నిర్వాణానంతరం నాలుగు వందల సంవత్సరాలకు నాగుడనే సన్యాసి ఆవిర్భవించి, ఆరు వందల సంవత్సరాలు జీవించి, అత్యుత్తమమైన ఆధ్యాత్మికోన్నతి సాధించి, బౌద్ధమతానికి చాలా హితం చేశాడు. ఇతను అనేక శాస్త్రాలలో నిష్ణాతుడైన మాయూరీ విద్యా సిద్ధుడైన మహాత్ముడు. ఇతను నిస్స్వభావార్థమనే సత్యాన్ని బోధించాడు. చివరికి

ఇతను బుద్ధుడు కానున్నాడు" అని చెప్పబడింది. ఈ రెండు గ్రంథాల్లోనూ పేర్కొన్న వ్యక్తి ఒక్కడే అన్న విషయం స్పష్టమే. ఆ వ్యక్తి మాధ్యమిక సిద్ధాంతాన్ని ప్రచారం చేసినవాడు అని రెండు గ్రంథాలలోను చెప్పబ డి ఉండడం చేత అవి నాగార్జునుడినే నిర్దేశిస్తున్నాయి అనడంలో సందేహం లేదు. ఈ చివరి గ్రంథం మనకిపుడు లభ్యమవుతున్న స్వరూపంలో ఏడవ శతాబ్దిలోనో, ఎనిమిదవ శతాబ్దిలోనో రచించబడి ఉంటుంది. కొంచెం మార్పులతో క్రీ.శ. 900–1000 ప్రాంతాలలో చైనా భాషలోకి, పదకొండవ శతాబ్దంలో టిబెట్ భాషలోకి అనువదించబడి ఉంటుంది.

4. "బుద్ధ నిర్వాణానంతరం ఏడు వందల సంవత్సరాలకు నాగార్జునుడనే ఒక సన్యాసి ఆవిర్భవించి, మిధ్యావాదాలన్నింటినీ తొలగించి, ధర్మజ్యోతిని ప్రజ్వలింపచేశాడు" అని "మహామాయా సూత్రం"లో చెప్పబడింది.[78]
5. ఇతని ఆధ్యాత్మికోన్నతి "మహాభేరి సూత్రం"లో కూడ వర్ణించబడింది.[79] అయితే ఈ చివరి రెండు గ్రంథాలు మహాయాన శాస్త్రీయ పవిత్ర గ్రంథాలని శాంతిదేవుని "శిక్షా సముచ్చయం"లో కాని, "మహా వ్యుత్పత్తి"* లో కాని చెప్పకపోవడం చేత ఇవి ప్రామాణిక గ్రంథాలు కాకపోవచ్చును. ఈ గ్రంథాలన్నీ నాగార్జునుని గూర్చి భవిష్యద్వాణి రూపంలో (భవిష్యత్కాలం ప్రయోగించి) ముచ్చటించడం గమనార్హం.

అతి ప్రాచీనములవడంచేత, నాగార్జునుని గూర్చి టిబెట్ దేశీయులు వ్రాసిన గ్రంథాలకు ఆధారాలవడంచేత, ఈ మత గ్రంథాలు నిస్సందేహంగా ఎక్కువ ప్రామాణ్యం ఇవ్వదగిన గ్రంథాలు. ఐదవ శతాబ్దం నాటికే, మహాయాన సంప్రదాయంలో నాగార్జుననకు ఎంతటి ఉన్నత స్థానం లభించిందో ఇవి రుజువు చేస్తున్నాయి. అతను (అ) దాక్షిణ్యాత్యుడు, (ఆ) మాధ్యమిక సిద్ధాంతం లేదా శూన్యవాదం బోధించిన మొట్టమొదటి పరమాచార్యుడు. (ఇ) సకల శాస్త్ర పారంగతుడు. (ఈ) అత్యుత్తమమైన ఆధ్యాత్మికోన్నతి సాధించిన వాడు. (ఉ) ఐదవ శతాబ్దం నాటికే ఒక పౌరాణిక పురుషుడుగా, ఆదర్శ వ్యక్తిగా ప్రసిద్ధుడయ్యాడు. ఇవి ఈ గ్రంథాల నుంచి మనం గ్రహించగలిగిన అంశాలు.

---

* ఇది క్రీ.శ. 798–836 సంవత్సరాలలో అయిదుగురు భారతదేశ పండితులు, ఆరుగురు టిబెట్ దేశ పండితులు కలిసి వ్రాసిన బౌద్ధమత విజ్ఞాన సర్వస్వము.

IV. మనం ఇప్పుడు చివరి తరగతి మౌలికాధారం దగ్గరకి వచ్చాము.

1. భారతదేశంలో లభించే ఒక నాగార్జున జీవిత చరిత్రకు కుమారాజీవుడు (క్రీ.శ.344-413) వాచికంగా ఒక చైనా భాషానువాదం చేయగా, కాలాంతరంలో దానిని అతని శిష్యులు గ్రంథస్థం చేశారట. ఈ విధంగా చైనా భాషలో ఉన్న జీవిత చరిత్ర కుమారాజీవుడు చెప్పగా అతని శిష్యులు వ్రాసుకున్నది.[80] మొట్టమొదటి సారిగా ఇది చైనాలో క్రీ.శ.922 సంవత్సరంలో ప్రచురించ బడింది. కొన్ని మార్పులతో పదకొండవ శతాబ్దంలో కొరియాలో ప్రచురించ బడింది. క్రీ.శ.1239లో పూర్తిగా పరిశోధించి మళ్ళీ చైనాలోనే ప్రకటించ బడింది. తరువాత కొద్ది మార్పులతో రెండు సార్లు ప్రకటించ బడింది.[81] అందుచేత చైనాలో నేడు లభించే కుమారాజీవ విరచితమైన జీవిత చరిత్ర యొక్క ప్రామాణికమైన ప్రాచీన ప్రతిరూపం ఏదీ మనకు లభ్యం కాదు. చాలా కాలం క్రితం ఇవాన్ వాస్సిల్‌జ్యూ, "డెర్ బుద్ధిస్మస్" అనే గ్రంథం మొదటి భాగంలో దీనిని సంగ్రహ రూపంలో ఇచ్చాడు. తరువాత 1923 సంవత్సరంలో వాల్లెసర్ ఒక వ్యాసంలో దీనిని గురించి సంగ్రహంగా ఇచ్చి విమర్శనా దృష్టితో దీని మూల్యాంకనం చేశాడు.

2. ప్రసిద్ధ చైనా యాత్రికుడు హూయాన్‌త్సాంగ్ (క్రీ.శ.596-664) తన అభిలేఖలలోని ఎనిమిదవ అధ్యాయంలోను, పదవ అధ్యాయంలోను, నాగార్జునుని జీవిత చరిత్రకు సంబంధించిన కొన్ని అంశాలు చేర్చాడు. కుమారాజీవుని ఆఖ్యానంలో కంటె దీనిలో కాల్పనికత్వం తక్కువగా ఉంది. మరొక విషయం, కుమారాజీవుడు చెప్పిన జీవితచరిత్ర అతను స్వయంగా వ్రాసింది కాదు. అనేక పర్యాయాలు దానిలో మార్పులూ, చేర్పులూ చేయబడ్డాయి. అందుచేత ఈ గ్రంథాలలో అభిప్రాయ భేదం కనబడినప్పుడు హ్యూయాన్‌త్సాంగ్ వ్రాసిందే ఎక్కువ ప్రామాణికమని అంగీకరించాలి. "కాల్పనికాంశాలేవీ లేవని పూర్తిగా చెప్పడానికి వీలు లేకపోయినా, హ్యూయాన్‌త్సాంగ్ వ్రాతలు, ప్రత్యక్షంగా చూడబడిన వ్యక్తికి సంబంధించిన స్మృతులను ఆధారంగా చేసుకొని వ్రాసినట్లు కనబడతాయి"[82] అని వాల్లెసర్ అంటాడు. క్రీ.శ.1905 సంవత్సరంలో "హ్యూయాన్‌త్సాంగ్ భారతదేశ యాత్రలు" అనే గ్రంథం రెండవ భాగంలో టి.వాట్టర్స్ అత్యుత్తమమైన

వివరణ ఇస్తూ చైనా యాత్రికుడు హూయాన్‌త్సాంగ్ సేకరించిన విషయాలపై విమర్శనాత్మకాలైన వ్యాఖ్యలు చేశాడు. 1883 సంవత్సరంలో బీల్ ఆ అభిలేఖలను అనువదించాడు.

3. చైనా త్రిపిటకంలోని అనేక గ్రంథాలలో బౌద్ధ మతాచార్య (సుస్‌షిహ్) పరంపర ఇవ్వబడింది. చైనా దేశీయ బౌద్ధ మతానికి సంబంధించిన ప్రతి సంప్రదాయానికీ ఒక్కొక్క పరంపర ఉన్నది. అయితే చాలా సంప్రదాయాల ప్రకారం, ఇరవై నలుగురు మతాచార్యులు మాత్రమే ఉన్నారు. ఇరవై నాలుగు అవతారాలు, ఇరవై నలుగురు బుద్ధులు, ఎనభై నలుగురు సిద్ధులూ ఉన్నట్లే ఇది కూడా, బహుశా కాల్పనికమైన సంఖ్య కావచ్చును. భారతీయ బౌద్ధ మతంలో ఆచార్య సంప్రదాయం లేదని చెప్పవచ్చును. కారణం ఏమిటో తెలియదు కాని "ఫుఫాత్సంగ్ యువాన్ చింగ్" అనే ఒక గ్రంథం గొప్ప ప్రమాణ గ్రంథంగా పరిగణించబడుతోంది. దీనికి ఆధారం "ధర్మ పిటక సూత్రం" అనీ, ఇది క్రీ.శ.472లో చేసిన సంస్కృత గ్రంథానువాదమనీ ప్రసిద్ధి. దీని సంస్కృత మూలం లభించడంలేదు. టిబెట్‌లోని మత శాస్త్రానికి దీనిని గూర్చి తెలియదు. అందుచేత బహుశా ఇది అరవ శతాబ్దంలో చైనా భాషలో చేసిన సంకలన గ్రంథం అయి ఉంటుంది.[83] ఈ గ్రంథం ప్రకారం నాగార్జునుడు పదమూడవ మతాచార్యుడు. కపిమాల ఆర్యదేవులు ద్వాదశ చతుర్దశాచార్యులు, చైనా, టిబెట్ మత గ్రంథ జాతంలో సురక్షితంగా ఉన్న గ్రంధాల రచయితలు కపిమాల,ఆర్యదేవులతో మన తత్త్వవేత్తను (నాగార్జునుని) కలపడం చేత, అతి ప్రాచీనమవడంచేత ఈ (ఆచార్య) నామపట్టిక చాలా ప్రధానమైనదని చెప్పవచ్చును. ఇలాంటి పట్టికలు చాలా ఉన్నాయి. కొన్నింటిలో నాగార్జునుని పేరు కనబడుతుంది. కొన్నింటిలో (ఉదా. సర్వాస్తివాదుల పట్టిక) కపబడడంలేదు.

4. కుమారాజీవుని అనుసరించిన వాడు అతనితో పత్ర వ్యవహారం నడిపిన వాడూ అయిన హూయి యువాన్ (క్రీ.శ.334-416) "మహాప్రజ్ఞా పారమితా" శాస్త్రానికి ఒక సంక్షిప్త రూపం రచించి దీనికి ఒక పీఠిక వ్రాశాడు. ఈ పీఠికలో ఇతను నాగార్జునుని చరిత్ర సంగ్రహంగా వ్రాశాడు. రాబిన్సన్ ఈ పీఠికను అనువదించి తన పుస్తకంలో చేర్చాడు

(5) ఫ్యూన్ క్రీ.శ.1151 లో వ్రాసిన "ఫాన్ఇమింగ్ ఇ-చి" అనే ఒక సంస్కృత

పద కోశంలో, భారత దేశంలోని జీవిత చరిత్ర మూల గ్రంధాన్ని సంక్షిప్తం చేసి చేర్చాడు. వాల్లెసర్ వ్రాసిన వ్యాసంలో దీని అనువాదం ఇవ్వబడింది.

చైనా దేశీయ మౌలికాధారాలను ప్రమాణంగా చేసికొని రెండవ విభాగంలో నాగార్జునుని జీవిత చరిత్ర కూర్చబడింది.

II

నాగార్జునుని జీవితం

పరిస్థితులు :

ద్వితీయ శతాబ్ది పూర్తిగాను, క్రీ.శ.218 వరకు దక్షిణా పథమంతా శాతవాహన రాజుల పాలనలో ఉండేది. కనీసం క్రీ.పూ.180 నుంచే శాతవాహనులు ఈ ప్రాంతంలో అత్యున్నత శక్తిశాలురుగా ఉండేవారు. మధ్యప్రదేశ్‌లోని చాలా భాగమూ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లూ, దక్షిణ ఒరిస్సా ప్రాంతమూ, దక్కను పీఠభూమిలో చేరిన కర్ణాటక ప్రాంతమూ వీరి రాజ్యంలో చేరినాయి. వివిధ సమయాలలో శాతవాహన రాజులు, అతి విశాలమైన ఈ భూభాగంలో కొంత భాగం కోల్పోతూ, మళ్ళీ దానిని సంపాదించుకుంటూ ఉండేవారు. అప్పుడప్పుడు వారి రాజ్యాధికారం ఉత్తరాపథంలో అతి దూరం వరకూ, దక్షిణాన కాంచిపురం కడ్డలూరు ప్రాంతాల వరకూ వ్యాపిస్తూ ఉండేది. ఒక్కోసారి సంకుచితమవుతూ కూడా ఉండేది. ఈ శతాబ్దిలో దక్షిణాన చేర, చోళ, పాండ్య రాజ్యాలనే త్రై రాజ్యం అభివృద్ధిలో ఉండేది. ద్రవిడ దేశంలో ఇది గొప్ప సంగ యుగం. పశ్చిమ భారత దేశంలో సిథియా వారు, శకులూ క్రింద మీదు అవుతున్న అధికార ప్రాబల్యంతో రాజ్యం పాలించేవారు. ఈ శతాబ్ది మధ్యలో వీరు స్వల్పకాలం పాటు, నర్మదా తీర ప్రాంతాన్ని, పశ్చిమ రాజస్థానాన్నీ కూడా చేజిక్కించుకున్నారు. ఈ శతాబ్ది మధ్య భాగం వరకూ అత్యున్నత స్థితితో, ఉత్తర భారతంలో రాజ్యపాలన చేసిన యుచి వంశీయులు లేదా కుషాణులు మెల్లి మెల్లిగా పశ్చిమోత్తరం సరిహద్దుల వైపు తరిమి వేయబడడంతో భారశివులు లేదా నాగరాజులు గంగా, యమునా ప్రాంతంలో అధికారానికి వచ్చి క్రమక్రమంగా మధ్య భారతంలో అత్యధిక శక్తిశాలులుగా ఏర్పడ్డారు. తూర్పున సర్వాధికార సంపన్నుడైన రాజు ఎవరూ

లేకపోవడంతో గణతంత్ర పాలకులైన లిచ్ఛవులు తమ ప్రాధాన్యాన్ని మరల నెలకొల్పుకొన గలిగారు. ఈ కాలంలో దక్షిణాపథానికీ, ద్రవిడ దేశానికీ కూడా గ్రీక్, రోమన్ భూభాగాలతోనూ, ఆగ్నేయ ఆశియా దేశాలతోను, చైనాతోను, విస్తృతమైన సముద్ర వాణిజ్యమూ, సాంస్కృతిక సంబంధాలూ ఉండేవి. అదే విధంగా పశ్చిమ ఆసియా రాజ్యాలతో వర్తకమూ, సాంస్కృతిక వినిమయమూ, చురుకుగా, నిరంతరాయంగా సాగుతూ ఉండేవి. వాణిజ్యాభివృద్ధి ఆనాటి ప్రధాన రాష్ట్రీయ ధ్యేయంగా ఉండేది. ద్వీపాంతర వాణిజ్యం, వర్తకుల భాగ్య సమున్నతి, నగరాభివృద్ధి మొదలైనవి ఇలాంటి ధ్యేయంతో అనుస్యూత్రంగా ఉండే ప్రధాన లాభాలు. అందుచేత సర్వజనాదర పాత్రమే అయినా, ప్రధానంగా ధనికులైన వర్తకుల మతంగాను, నాగరిక విద్యావంతుల మతంగాను ఉన్న బౌద్ధమతం, ఈ కాలంలో వీని ఔదార్యం చేత ఎక్కువ లాభం పొందడం సహజమే. ఉత్తర భారతావనికి గ్రీక్ సంస్కృతితో ఉన్న సంబంధం సుదీర్ఘమైనది. అదేవిధంగా ఉత్తర భారతానికి రోమ్, పశ్చిమ ఆసియా, చైనా దేశాలతో ఉన్న వాణిజ్యము, తదితర సంబంధాలూ కూడా సామాన్యమైనవి కావు. అయితే క్రైస్తవ శక ప్రారంభ శతాబ్దులలో దక్షిణాపథ ద్రావిడ దేశాలు తమ రాజకీయ స్వాతంత్ర్యాన్ని పరాయత్తం కాకుండా సంరక్షించుకుంటూ పాలనా స్థైర్యాన్ని అనుభవిస్తూ, బాహ్య ప్రపంచంతో అనేక వస్తువులలో వ్యాపారం చేయడంలోనూ, భావ వినిమయంలోనూ, కొత్త ఆలోచనా పద్ధతులు రూపొందించుకోవడంలోనూ, నూతన కళాసృజనలోనూ, నిరంతర ప్రయత్నశీలాలుగా ఉండేవి. ఇవీ నాగార్జునుడు అవిర్భవించినపుడున్న పరిస్థితులు.

జననము, విద్యాభ్యాసము:

నాగార్జునుడు దక్షిణాపథంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. క్రీ.శ. 443–513 ప్రాంతాలకు చెందిన ఒక గ్రంథం ప్రకారం ఇతను జన్మించిన గ్రామం పేరు 'వెడలి' అని మనం వెనుక చూసియున్నాము. అంత కంటె కొంచెం ప్రాచీనమూ, సందిగ్ధ ప్రమాణ్యమూ అయిన మరొక గ్రంథం, ఆ గ్రామం "కుసుమమాల" అని చెప్పుతున్నది. ఎనిమిదవ శతాబ్దికి చెందిన టిబెట్ గ్రంథం ఒకటి 'వెడలి'కే 'విదేహ' అని భ్రాంతి పడి ఉంటుంది. పధ్నాల్గవ శతాబ్దికి చెందిన మరొక టిబెట్ 'చరిత్ర'లో దీనిని పొరబాటున విదర్భ అని గుర్తించడం

జరిగింది. తరువాత వచ్చిన గ్రంథాలన్నీ ఈ పొరబాటునే ప్రచారంలోకి తీసికొని వచ్చాయి. "ఆంధ్ర" శబ్దానికి అర్థం ఏమయినా, శాతవాహనులు మాత్రం ఆంధ్రులే. నాగార్జునుడు వారి రాజ్యంలోనే జన్మించి వివిధ కార్యవ్యాపృతమైన తన జీవిత కాలంలో చాలా భాగం ఈ ఆంధ్రదేశంలోనే అమరావతిలోనూ, శ్రీపర్వతం మీదా గడిపినాడనడంలో సందేహం లేదు. అయితే ఇంత మాత్రం చేత ఇతను ఆంధ్రుడే అని చెప్పడానికి శక్యం కాదు. కాంచిలో పుట్టి, వేంగి దేశంలో నివసించిన తార్కిక శిరోమణియైన దిఙ్నాగుడు వలెను ఇతను కూడా ఎక్కడో జన్మించి, ఇక్కడికి వచ్చి ఉత్తమ కార్యాలు కొన్ని చేసి ఉండవచ్చును. ఇతను దక్షిణాపథంలో ఎక్కడ పుట్టాడో తెలుసుకోవడం కష్టమైన విషయం. ప్రాంతీయ పక్షపాతాన్ని పురస్కరించుకొని ఇతను ఆంధ్ర దేశీయుడని కొందరూ, నాగపూర్ సమీపంలో వున్న ప్రదేశానికి చెందినవాడని కొందరూ చెపుతున్నారు.[84]

నాగార్జునుడు ఏ సంవత్సరంలో పుట్టాడో చెప్పలేము. అయితే క్రీ.శ.150 -200 సంవత్సరాల మధ్య బహుశా ఇతను గొప్ప కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి ఉంటాడని చెప్పవచ్చును. (చూ.పై. I భాగం, III విభాగం). అతని తల్లిదండ్రుల పేర్లుగాని, వారిని గూర్చిగాని మనకు ఏమీ తెలియదు. నేపాల్ దేశంలోని ఒక అతి విశ్వసనీయమైన "ఆమ్నాయం"లో అతని తల్లిదండ్రుల పేర్లు సావిత్రీ, త్రివిక్రములని చెప్పబడింది. అతనెక్కడ విద్యాభ్యాసం చేసిందీ మనకు తెలియదు. ఆతనికి నలందతో కాని, అక్కడి బౌద్ధ విశ్వవిద్యాలయంతో కాని ఏ విధమైన సంబంధమూ లేదనే విషయం మాత్రం తథ్యం. ఆ ప్రదేశాలలో గుప్తుల కాలానికి పూర్వం ఎవరూ నివసించలేదని పురావస్తు శాస్త్ర ప్రమాణాల ద్వారా తెలుస్తోంది. ఆ విశ్వవిద్యాలయం క్రీ.శ.425లోనో లేదా దానికి కొద్దిగా ముందూ, వెనకో స్థాపించబడి ఉంటుంది.

బాల్యం నుంచీ నాగార్జునుడు వేద శాస్త్రాధ్యయనం చేశాడు. వేదాధ్యయనం చేయడమే కాకుండా వేదార్థ జ్ఞానం కూడా సంపాదించాడు. లౌకిక శాస్త్రాల "లోతులు కనుగొన్నాడు". ఇరవై సంవత్సరాల వయస్సు వచ్చేసరికి అతను మహా పండితుడుగా విశ్వవిఖ్యాతి గడించాడు.

తరువాత (కుమారాజీవుడు చెప్పిన కథ ప్రకారం) నాగార్జునుడు జీవితంతో విసుగు చెంది, సాహస కృత్యాల ద్వారా ఆనందాతిశయం సంపాదించాలనే ఉద్దేశ్యంతో మాయావిద్య నేర్చి, అదృశ్యుడుగా రాజ ప్రాసాదంలో ప్రవేశించి,

రాజకుమారితో ప్రణయ వ్యవహారాలు నడిపించడం ప్రారంభించాడు. ఒక రోజున అతను పట్టుబడ్డాడు. దీనితో అతని మనస్సులో జీవితం మీద ఏవగింపు కలిగింది. ఆ గండం నుంచి తప్పించుకొని బైటబడితే (బౌద్ధ) సన్యాసి కావాలని సంకల్పించు కున్నాడు. అత్యాశ్చర్యకరంగా, తప్పించుకుని బైటపడి, వెంటనే భిక్షువై పోయాడు. ఇది ఏ మాత్రమూ సారంలేని కథ. మహాజ్ఞానులందరూ మొదట కొంతకాలం, పాపభూయిష్టమైన, వైషయిక సుఖలోలుపమైన జీవనం గడిపేవారే అంటూ మామూలుగా ప్రచారంలో ఉండే కథలను ఆధారంగా చేసికొని బయలుదేరినది.

అన్వేషణ, సాఫల్యం:

చైనాలోని మౌలికాధారాలు సమన్వయించుకొని మనం, నాగార్జునుడు ఆధ్యాత్మిక జ్ఞాన సంపాదనకై చేసిన యాత్రల వృత్తాంతాన్ని అల్లుకోవచ్చును. పెద్దవాడగుతున్న కొద్దీ అతనికి ఈ ప్రాపంచిక జీవితం సంతృప్తి కలిగించజాలకపోయింది. వైదిక విద్యవల్ల కాని, హిందూ ధర్మం వల్ల కాని, అతనికి ఆధ్యాత్మిక విశ్రాంతి, తత్వజ్ఞాన విషయమైన సంతృప్తి కలగలేదు. అందుచేత అతను త్రిపిటకాలను మూడు మాసాల పాటు క్షుణ్ణంగా చదివి వాటి నిగూఢ తాత్పర్యాన్ని ఆకళించుకున్నాడు. తృష్ణను విడచి, ప్రపంచానికి దూరంగా, అహంకార వర్జితుడై జీవించడం ప్రారంభించాడు. అయినా అతని సంశయాలన్నీ తొలగలేదు. సమస్యలు తీరలేదు. తరువాత సన్యాసియై చిన్న చిన్న అడవులలోనూ, జలప్రాయ దేశాలలోనూ ఏకాంతంగా నివసిస్తూ ధ్యానాభ్యాసం చేశాడు. దానితో అతని మనస్సుకు నిలకడ లభించింది. సూక్ష్మ విషయాలను గ్రహించి, అలౌకిక విషయాలను కూడా చూడగలిగాడు. ఇట్లా ఒక విధమైన జ్ఞానోదయం కలిగింది. అయినా ఇంకా ఏదో లోటు ఉన్నదనే భావం అతనిని వెన్నంట సాగింది. ఇంకా ముందుకు వెళ్ళడానికి అవకాశం ఉన్నదా అని చూడడానికి ప్రయత్నించాడు.

ఈ విధంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్వేషణంలో దేశయాత్ర చేస్తూ హిమాలయ పర్వతాలు చేరుకున్నాడు. పూర్వం ఋషులెక్కువగా సంచరించే ఒక ప్రదేశంలో అతనికొక భిక్షువు కనబడ్డాడు. ఆతని వద్ద కొన్ని మహాయాన గ్రంథాలు చదివాడు. వాటియందు ప్రీతి, శ్రద్ధలు ఏర్పడ్డాయి. వాటి గంభీర తాత్పర్యం గ్రహించాడు. కాని వాటి సారందాకా వెళ్ళలేకపోయాడు. ఇంకా మరికొన్ని

గ్రంథాలు సంపాదించాలనే కోరికతో భారతదేశం అంతా తిరిగాడు. కానీ ఏమీ లభించలేదు. ఈ దేశ సంచారంలో ఎందరో బౌద్ధ పండితులతో, బౌద్ధేతరులతో వాదాలు చేశాడు. వాదంలో తాను అజేయుడనే విషయం గ్రహించాడు. ఈ కారణం చేత లభ్యమైన గ్రంథాలన్నీ చదివి ఉండటంచేతా తాను సర్వజ్ఞుడననే అహంభావం కలిగింది. మహాయాన గ్రంథాలు గంభీరార్థ ప్రతిపాదకాలే అయినా వాటి ప్రతిపాద్య విషయాలను అవి సమర్థించ లేకపోవడం చేత, వాటిలో తర్కబద్ధత్వం లేదని అతని సునిశిత బుద్ధికి తోచింది. యుక్తుల ద్వారా ప్రత్యక్షంగా చూపశక్యం కానిది పూర్ణసత్యం కాజాలదని అతని అభిప్రాయం. బౌద్ధేతర దార్శనికులు బౌద్ధ సిద్ధాంతాలపై చేసిన కొన్ని ఆక్షేపాలు, అతనికి యుక్తిసహంగానే ఉన్నట్లు కనబడ్డాయి. స్వయం సంపూర్ణత్వం లేని దానిలో ఏదో ఒక లోపం ఉండే ఉంటుందని ఆతను నిర్ణయించుకున్నాడు. ఈ అభిప్రాయాలు కలగడంతో అతను బౌద్ధ గ్రంథాలను విమర్శించడం ప్రారంభించాడు. బుద్ధుడు తనకు ఆచార్యుడని అంగీకరంచడానికి ఇష్టపడక "నాకు ఆచార్యుడెవ్వరూ లేరు" అని చాటి చెప్పాడు. ఒక క్రొత్త సిద్ధాంతం స్థాపించి ప్రత్యేకమైన నియమ వేషాదులతో ఒక క్రొత్త భిక్షు సంప్రదాయాన్ని నెలకొల్పాలని నిశ్చయించుకొన్నాడు. ధర్మాన్ని పూర్తిగా మార్చివేసి, తర్క గంభీరంగా చేసి, తన నూతన ధర్మాన్ని చాటడానికై ఒక రోజు నిర్ణయించుకున్నాడు.

ఈ సమయంలో బోధిసత్త్వుడైన మహానాగుడు ప్రత్యక్షమై, అతనిపై కరుణ కలగడంచేత, అతన్ని సముద్రమధ్యంలో ఉన్న నాగ ప్రాసాదానికి తీసికొని వెళ్ళాడు. అక్కడ ఒక శాలలో ఉన్న అనర్ఘాలైన ఏడు పాత్రలను అతనికి చూపించాడు. వాటిలో దురవబోధార్థాలైన అనేక సూత్రాలు, ధర్మాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆ మహానాగుడు వాటి నుంచి వైపుల్య సూత్రాలు* తీసి అతనికి బహుకరించగా అతను తొంబై రోజుల పాటు వాటిని అధ్యయనం చేశాడు. వాటి ఉపదేశ సారాన్ని అవగాహన చేసికొని అన్ని గ్రంథాలలోనూ తుల్యరూపంలో వున్న

---

* "విస్తరింప చేయదానికి తగిన సూత్రాలు" అని అర్థం. మహాయాన సూత్రాల విషయంలో ప్రయోగించే పదం ఇది. ఇతను పూర్వం కొన్ని మహాయాన సూత్రాలు చదివి ఉన్నాడు. కనుక ఈ ప్రాసాదంలో ఇతను కనుగొన్న సూత్రాలు "ప్రజ్ఞా పారమిత సూత్రాలు" కావచ్చును.

"పునరనుద్గమనాన్ని" సాక్షాత్కరించుకొనగలిగాడు. అతని క్లేశాలన్నీ నిలిచి పోయాయి. పాపాలన్నీ తొలగిపోయాయి. ఈ విధంగా అతను బుద్ధుడు ఉపదేశించిన మార్గంలోనికి తిరిగి రావడమే కాకుండా బోధిసత్త్వుడు కూడా అయ్యాడు. నాగ ప్రాసాదంలో ఉన్న అనంత సూత్ర భాండాగారం నుండి కొన్ని సూత్రాలు మాత్రమే నాగార్జునుడు తీసుకున్నాడు. అతన్ని మహానాగుడు తిరిగి దక్షిణ భారత దేశానికి తీసికొని వచ్చాడు. అతను ఆ సూత్రాలను మళ్ళీ పది పర్యాయాలు చదివి, ధర్మాన్ని ప్రచారం చేసి, అభివృద్ధి చెందించి, బౌద్ధేతరుల నందరినీ వాదంలో జయించి, ఎందరో విద్యార్థులకు బోధించి, అనేక గ్రంథాలు రచించాడు. మహాయానాన్ని వృద్ధి పొందించాడు. ఇదీ ఆధ్యాత్మిక జ్ఞానం కోసం నాగార్జునుడు చేసిన దేశ సంచార గాథ.

ఈ కథలోని ఐతిహాసిక సత్యసారం:

జీవితం అంటే ఏమిటి? లోకంలో ఈ చెడుగులన్నీ ఎలా వస్తున్నాయి? అనే సమస్య నాగార్జునుని మనస్సును కలవరపెట్టింది. హిందూ మత గ్రంథాల నుంచి కాని, తత్త్వ శాస్త్రం నుంచి కాని, ఇతనికి సంతృప్తికరమైన సమాధానాలు రాలేదు. అదేవిధంగా స్థవిరవాదం కాని, తాపసత్వం కాని, సన్యాసి జీవనం కాని ఆతనికి మనఃశాంతి కలిగించలేదు. అప్పుడు ఎవరో ఒక వృద్ధ శ్రమణుడు అతనికి మహాయానం చూపించాడు. గ్రంథాలలో ఇచ్చిన ఆచార్య పరంపర సత్యమే అయితే ఈ వృద్ధ శ్రమణుడు కపిమాలుడు అయి ఉంటాడు. మహాయానం వల్ల కూడా అతనికి పూర్తి సంతృప్తి కలగలేదు. అందుచేత కొత్త భిక్షు నియమాలతో కొత్త సిద్ధాంతాలతో (ఈ సిద్ధాంతాలు కూడా యుక్తి యుక్తములుగా కనబడే బుద్ధుని ఉపదేశాల మీదనే ఆధారపడి ఉండవచ్చును). ఒక నూతన తత్త్వశాస్త్రీయ సంప్రదాయాన్ని నెలకొల్పాలనే భావం అతని మనస్సులో కొంత కాలం పాటు ఉండేది. ఇంతలో ఆతనికి వైపుల్య సూత్రాలు లభించాయి. వాటిని అధ్యయనం చేయగానే అతనికి అంతవరకూ అన్వేషిస్తున్న జ్ఞానజ్యోతి లభించింది. సందేహాలు తీరిపోయాయి. సమస్యలు తొలగిపోయాయి. ఆ ఉపదేశాలను ఆచరించడంతో అతనికి జ్ఞానోదయం కలిగి మనఃశాంతి లభించింది. అది మొదలు బుద్ధునికి పరమ భక్తుడై ఆయన బోధించిన ధర్మాన్ని ప్రచారం చేయసాగాడు. ఆతనికి ఆధ్యాత్మిక సంతృప్తి కలిగించిన ఆ వైపుల్య సూత్రాలు, ఆనాడు కొన్ని బౌద్ధమత

శాఖలలో అప్పుడప్పుడే ప్రచారంలోకి వస్తున్న "ప్రజ్ఞా పారమితా సూత్రాలు" అయి ఉంటాయి.

నాగకథ :

నాగార్జునుడు నాగ ప్రాసాదం నుంచి వైపుల్య సూత్రాలు తీసికొని వచ్చాడని చెప్పే కథకు భావం ఈ విధంగా చెప్పవచ్చును:

(1) నాగార్జునుడు, ఆ సూత్రాల ప్రామాణ్యం అంగీకరించి వాటిని ఆధారంగా చేసుకొని తాత్త్విక సిద్ధాంతాన్ని నెలకొల్పిన మొట్టమొదటి వ్యక్తి అయి ఉంటాడు. అవి కొత్తగా ప్రచారంలోకి రావడానికి కారణం చెబుతూ, వాటి ప్రామాణ్యం స్థాపించడం కోసం, అవి వాస్తవంలో బుద్ధుని ఉపదేశాలే అనీ, అయితే వాటిని నాగులు దాచివేశారనీ, వాటిని ప్రచారం చేయవలసిన సమయం రావడంతో వాటిని స్వీకరించడానకి తగిన వ్యక్తి నాగార్జునుడు* లభించగానే అతని ద్వారా వాటిని మానవులకు అందించడం జరిగినదనీ ఒక కథ ప్రచారంలోకి వచ్చింది.

(2) నాగులనే వారు దక్షిణా పథంలోని ఏదో ఒక ప్రాంతంలో నివసించే, ప్రాకృత భాష మాట్లాడే జాతి కావచ్చును. వారి జాతీయ చిహ్నం సర్పం అయి ఉంటుంది. వాళ్ళు ప్రజ్ఞా పారమితా వాఙ్మయాన్ని మొదట ప్రాకృతంలో రచించగా అది కాలాంతరంలో సంస్కృతంలోకి అనువదించబడి ఉంటుంది. నాగపూజ, దేవీ పూజ చేసేవారు ఈ వాఙ్మయాన్ని సృజించారని చెప్పడానికి కొన్ని ఆధారాలు ఉన్నాయి. జాతకాలలో నాగరాజుల పేర్లు చెప్పటం జరిగింది. భారశివులు, శాతవాహనుల తరువాత మహారాష్ట్ర, కుంతల దేశాలు పాలించిన "ఛూతులు" కూడా నాగజాతి వారై ఉంటారు. ఆంధ్రదేశాన్ని పాలించిన ఇక్ష్వాకుల వంశానికి చెందిన కొందరు రాజకన్యలు "విశాఖనాగ" "కమ్మనాగ" ఇత్యాది విధంగా "నాగ" పదం చివర ఉన్న పేర్లు గల కొందరు సేనాపతులను, మండలాధిపతులనూ వివాహమాడ్డారు. వీరకూర్చుడనే ఒక ప్రసిద్ధ ప్రాచీన పల్లవ రాజు నాగజాతి రాజకుమారిని వివాహం చేసుకున్నాడు. సంగం వాఙ్మయంలో నాగుల ప్రశంస ఉంది. గుప్త చక్రవర్తియైన చంద్రగుప్త విక్రమాదిత్యుడు కూడా ఒక నాగ కన్యకను వివాహం చేసుకున్నాడు. నాగులు భారత దేశ చరిత్రలో అతి ప్రధానమైన పాత్ర

---

* "నాగార్జునుడు" అనే పేరును బట్టి ఈ కథ అల్లడం జరిగినదా? (చూ.తరువాత)

వహించిన జాతికి చెందినవారు. వారి పవిత్ర గ్రంథాలన్నింటిని సర్పాలు సంరక్షించి అందజేస్తూ ఉండేవని ఒక కాల్పనిక గాథ ప్రచారంలోకి వచ్చింది.

ఈ రెండు విధాల కల్పనలలోనూ కూడా సర్పాలు రహస్య సిద్ధాంతాలను అందజేసినట్లు ఎందుకు చెప్పవలసి వచ్చింది అనే ప్రశ్నలు కలుగవచ్చును. భారతీయ జానపద సాహిత్యంలో సర్పాలు భూమాత గర్భంలో నిక్షిప్తమై ఉన్న అనాది సిద్ధమైన పవిత్రతత్వానికి ప్రతీకములు. అవి ధనాగారాలను, పవిత్ర స్థానాలనూ రక్షిస్తూ ఉంటాయి. పవిత్ర వస్తువులను దూషితములు కాకుండా సంరక్షిస్తూ అవి గృహీతవ్రతులైన యోగ్యత కలవారినే వాటి దరి చేరనిస్తాయి. సర్పాలు బుద్ధిమంతులకు ప్రతీకలు (పోల్చి చూడండి. సేంట్ మాథ్యూ, 16). అందుచేత నాగార్జునునికి అత్యుత్తమ జ్ఞానం "ప్రజ్ఞా పారమిత" ప్రసాదించిన మహానాగుడు బుద్ధిమంతులలో అగ్రగణ్యుడైన ఒక వ్యక్తి కావచ్చును. ఈ గ్రంథాలు స్వర్గం నుంచి కాక, సముద్రంలోంచి తీసికొని రాబడినవని చెప్పడంలో కూడా ఒక విశేషం వుంది. సముద్రం పవిత్ర వస్తువుల నిధానము, లోకోత్తర ప్రపంచానికి ప్రతీకమూ అనే భావన సముద్ర సంబద్ధమైన సంస్కృతిలోనే కలగడానికి అవకాశం ఉంది. శాతవాహన మరియు సంగం కాలాలకు చెందిన దాక్షిణాత్యులు ఆగ్నేయ ఆసియా దేశాలతో సంబంధాలు ఏర్పరచుకున్న సాముద్రిక జనులు. ఈ సందర్భంలో చెప్పవలసిన మరొక విషయం. ఏడవ శతాబ్దికి చెందిన బాణమహాకవి నాగార్జునుని గూర్చి చెపుతూ, అతను నాగరాజైన వాసుకి పారితోషికంగా ఇవ్వగా, అందంగాను, దేదీప్యమానంగాను ఉన్న ఒక ముత్యాల హారాన్ని నాగలోకం నుంచి తీసికొని వచ్చాడనీ, అది సకల విషదోష నివారణమనీ, దాని స్పర్శ మాత్రం చేతనే సకల బాధలూ నశిస్తాయనీ వర్ణించాడు.[86]

అతని పేరు:

"నాగార్జునుడు" అనేది ఆతని తల్లిదండ్రులు పెట్టిన పరు కాకపోవచ్చును. అతడు సన్యాసం స్వీకరించిన తరువాత పెట్టినది కూడా కాకపోవచ్చును. బహుశా ఈ పేరు అతనే పెట్టుకొని ఉంటాడు. అయితే అతను కూడా ఈ పేరు అంగీకరించి తన గ్రంథాల పుష్పికలలో చేర్చాడు. ఆతను నాగలోకానికి వెళ్ళినట్లు చెప్పడాన్ని లేదా విశ్వాసాన్ని బట్టి ఈ పేరు వచ్చినదో మనకు తెలియదు. ఇదేవిధంగా కాళీ భక్తుడవడంచేత కాళిదాసుకు ఆ పేరు వచ్చిందో, లేదా ఆ పేరును బట్టి ఆతను

కాళీభక్తుడు, కాళీ ప్రసాదం సంపాదించాడు అనే కథలు అల్లడం జరిగిందో తెలియదు. శంకరుని విషయంలో కూడా అంతే. ఈ పేరును బట్టి ఆతను శివావతారం అనే విశ్వాసం చేత అతనికా పేరు పెట్టడం జరిగిందా? ఇవన్నీ కాలాంతరంలో వచ్చిన సార్థక నామధేయాలైన పక్షంలో బాల్యంలోనే వీరు కీర్తి ప్రతిష్ఠలు సంపాదించడానికి పూర్వం యౌవనం లోను వీరి పేర్లు ఏవో మనకు తెలియదు. కొందరు ప్రసిద్ధ భారతీయుల నామధేయాలు దుర్భేద్య రహస్యాలుగా ఉండిపోయాయి. "లంకావతారం"లో నాగార్జునుని పేరు "బిక్షు శ్రీమాన్" అనగా "ప్రభావశాలియైన బిక్షువు" అని ఉన్నది. దీనిని బట్టి ఇతనికీ పేరు (భిక్షుశ్రామాన్) బౌద్ధ సంఘంలో ఏదో ఒక అధికారిక స్థానం లభించిన తరువాత వచ్చిందని బుస్టోన్ అభిప్రాయపడ్డాడు. అయితే అధికారిక స్థానం లభించిన తర్వాత ఇతని పేరు "శ్రీ ప్రజ్ఞాధరుడు" అని సుంపా ఖంపో వ్రాశాడు. ఈ రెండు అభిప్రాయాలలో దేనికీ సరైన ఆధారాలు లేవు. ప్రాచీన చైనా గ్రంథాలలో నాగార్జునుడు అనే పేరు "బంగ్‌షు" (సర్పవృక్షం) అని అనువదించ బడినది. అర్జున వృక్షం క్రింద పుట్టడంచేత, సర్పాల ద్వారా నిర్వాణమార్గం తెలుసుకోవడం వలన, ఇతనికీ పేరు వచ్చిందని కుమారాజీవుడు వివరించాడు. కొన్ని గ్రంథాలలో ఈ పేరు "లుంగ్‌షెంగ్" (సర్వవ్యాపి) గా అనువదించబడింది. హూయాన్‌త్సాంగ్, ఇత్సింగులు "లుంగ్‌హింగ్ (సర్పధీరుడు) అని అనువదించారు. టిబెట్ దేశీయులు "క్లుస్‌గ్రుబ్" (సర్పాల చేత సిద్ధుడుగా చేయబడినవాడు) అని అనువదించారు.*

నాగార్జునుని స్తుతిస్తూ చంద్రకీర్తి వ్రాసిన పద్యాల భావాన్ని అనుసరించి బుస్టన్ ఈ పేరును ఇలా వ్యాఖ్యానించాడు: సముద్రంలో పుట్టిన నాగం రెండు తీరాలనూ కూడా చేరకుండా, వాటికి దూరంగా ఉన్నట్లు, విజ్ఞానసాగరంలో జనించిన (సంబుద్ధాది సాగర) ఇతను కూడా రెండు తీరాలకూ ('అస్తి' 'నాస్తి' అనే వాటికి) దూరంగా ఉన్నాడు. సర్పాల వద్ద వజ్రాలు, సువర్ణమూ ఉన్నట్టు ఇతని

---

* ఈ అనువాదం సరియైనదని నా అభిప్రాయం. దీని వ్యుత్పత్తి ఈవిధంగా చెప్పవచ్చును. "అర్జ్యతే ఇతి అర్జునః నాగైః అర్జునః అర్జ ప్రతియత్నే ప్రతియత్నో గుణాధానే", అనగా "అర్జధాతువునకు ప్రతియత్నము అనగుణాధానము. అనగా గుణము కలుగునట్లు చేయుట అని అర్థము. నాగుల చేత ఇతని యందు ఉత్తమ గుణములు కూర్చబడినవి కావున "నాగార్జునుడు".

వద్ద సద్ధర్మకోశం ఉంది. సర్పం యొక్క అగ్ని పూర్ణాలైన నేత్రాలూ, విషమూ కాల్చివేసినట్లుగా ఇతని ప్రదీప్తమైన ప్రతిభ, వాద చాతుర్యమూ, ప్రతివాదాల సిద్ధాంతాలను భస్మం చేసి, అందరి మనస్సులనూ వెలుగుతో నింపుతాయి. అందుచేత ఇతను నాగుడు, పాండు కుమారుడైన అర్జునుని బాణాలు శత్రు సైన్యాలను చెండాడి రాజ్యం సంపాదించినట్లు, ఇతని నిరుపమానమైన జ్ఞానం, పదజాలమూ, దుష్టశక్తులను అణచివేసి, ఆతని ఉపదేశాలను వినే మానవులకూ, దేవతలకు కూడా ధర్మ సామ్రాజ్యం స్థాపిస్తున్నాయి. అందుచేత అతను అర్జునుడు. ఈ విధంగా ఇతను నాగుడు, అర్జునుడూ కూడా అని బుస్టోన్ వ్యాఖ్యానించాడు. ఇదంతా నైపుణ్యంతో చేసిన ప్రయత్నం మాత్రమే. సంస్కృతంలో ఉన్న ఏ పేరుకైనా ఇలాంటి వ్యాఖ్యానాలు చేయవచ్చును. దీని వల్ల మనకు తెలియవచ్చే కొత్త విషయం ఏదీ ఉండదు.

మత, వైజ్ఞానిక కార్యకలాపాలు:

బుద్ధుల పూజ, బోధిసత్త్వుల ఆరాధన, స్తూపాలకు అభిప్రదక్షిణ, నమస్కార, నైవేద్యాదులు చేయడం, ఇలాంటి మహాయాన సంప్రదాయానికి చెందిన కార్యకలాపాలలో నాగార్జునుడు పాల్గొన్నట్లు కనబడుతుంది. అనేక చైత్యాల నిర్మాణాన్ని ప్రోత్సాహించాడు. నిరంజన నదీ ప్రవాహానికి దెబ్బ తినకుండా బుద్ధగయలోని పవిత్ర స్థానానికి రక్షణ కల్పించాడు. బోధివృక్షానికి, అక్కడ ఉన్న చైత్యానికి చుట్టూ రాళ్ళతో వజ్ర గవాక్షాలున్న ప్రాకారం కట్టించాడు. ధాన్యకటకం (గుంటూరు జిల్లాలోని అమరావతి) లోని స్తూపానికి లోహ ప్రాకారంతోకూడిన ఆవరణ కట్టించాడు. ఇది కళా సౌందర్య సమంచితమైన ఉత్తమ కార్యసాధనం అని చెప్పవచ్చును (చూ.క్రింద). దేవలోక బుద్ధులలో ఒకడైన అమితాభుని భక్తుడై ఆ సంప్రదాయం అభివృద్ధి చెందడానికి చాలా కృషి చేసినట్టు కనబడుతుంది. మాధ్యమిక సిద్ధాంతం అభివృద్ధి చేయడానికి నాగార్జునుణ్ణి ప్రోత్సాహించింది మంజుశ్రీ అనే బోధిసత్త్వుడని "గ్రుబ్‌మ్థా"లో జమ్-యాన్-బ్జార్-పా (క్రీ.శ. 1800 ప్రాంతం) వ్రాశాడు. ధ్యానం ద్వారా ఆధ్యాత్మికోన్నత స్థితిని అధిరోహించిన ఇతని రహస్య విద్యాప్రావీణ్యము, ప్రజ్ఞ (నిశితమైన అంతర్దృష్టి), సర్వ భూతకరుణ వీటిని బట్టి బోధిసత్త్వునిగా గుర్తించడం జరిగింది. నాసికా రంధ్రాల ద్వారా జలం త్రాగడం మొదలగు యోగాభ్యాస ప్రక్రియల చేత ఇతను దీర్ఘాయుర్దాయం

సంపాదించగలిగాడని "నాన్‌హైచిక్వి"లో చెప్పబడింది.

విజ్ఞాన శాస్త్రానికి ఆతని ద్వారా లభించిన లాభాలను గూర్చి నిశ్చితంగా ఏమీ చెప్పడానికి వీలులేదు. అయితే ఇతను ఆయుర్వేదంలో ప్రావీణ్యం సంపాదించి ఉండవచ్చును. రసాయన, లోహ శాస్త్రాలలో కూడా ప్రవేశం సంపాదించి బ్లెర్కి అనే ఆంగ్ల దేశ తత్త్వవేత్త.తారునీళ్ళతో ఏమేమో చేసి దాని గుణాలను వర్ణిస్తూ వ్రాసినట్లు ధాతు విద్యలో కూడా కొంత జ్ఞోక్యం కలిగి ఉండవచ్చును.

యాత్రలు :

ఆధ్యాత్మిక జ్ఞానసంపాదన కోసం దేశాటనం చేస్తూ ఆతను హిమాలయాలు చేరి ఉండవచ్చు. బౌద్ధ క్షేత్రాలు కూడా సందర్శించి ఉండవచ్చును. కల్హణుని ప్రకారం, ఇతను కొంత కాలం కాశ్మీరదేశంలో కూడా ఉన్నాడు. కనిష్కుని కాలంలో నాగార్జునుడు శ్రీనగరం పరిసరాలలో, శాలిమార్ నుంచి రెండు మైళ్ళ దూరాన వుండి, నేడు హర్వాన్ అనే పేరుతో పిలవబడుతున్న దర్హద్వనంలో నివసించాడని ఒక ఆఖ్యానం తెలుపుతోంది. ఆతను ధర్మ ప్రచారం చేస్తూ, బౌద్ధేతర దార్శనికుల్తో వాదిస్తూ ధర్మాన్ని సమర్థించి, వారిని సరియైన మార్గంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తూ దేశాటనం చేసి ఉండాలి. పాటలీపుత్రంలోని కుక్కుటారామంలో పంద్రెండు రోజులపాటు; సర్వజన సమక్షంలో జరిగిన ఒక శాస్త్రార్థవాదంలో ఇతను బౌద్ధేతర సిద్ధాంతాన్ని ఖండించాడనీ, ఆ విజయానికి స్మృతి చిహ్నంగా అక్కడ వున్న రాజు ఒక "బృహద్ ఘంటానాద గోపురం" అనే పేర ఒక గోపురం కట్టించాడనీ, ఫాంగ్ చిహ్ వ్రాశాడు. అయితే ఇది సాధించిన వాడు నాగార్జునుని శిష్యుడైన అర్యదేవుడని హ్యూయన్‌త్సాంగ్ చెప్పాడు.

నివాసము :

మొదట, నాగార్జునుడు కోసల దేశంలోని ఒక నగరానికి దక్షిణంగా అశోక గోపురంతో కూడిన ఒక ప్రాచీన విహారంలో నివసించేవాడనీ తరువాత కోసల రాజధానికి నైరుతిగా దాదాపు 300 'లీ' ల దూరంలో ఉన్న "పోలో మోలోకిలి" పర్వతం మీద (భ్రమర గిరి మీద) ఆతనికై ప్రత్యేకంగా 'శాతోపోహ'-(శాతవాహన) రాజు కట్టించిన పెద్ద విహారంలో నివసించేవాడనీ, హ్యూయన్‌త్సాంగ్ వ్రాశాడు.

* 1లీ = 1/6 మైలు

అయితే హ్వాలీ వ్రాసిన హ్యూయన్‌త్సాంగ్ జీవిత చరిత్రలో ఆ ప్రదేశం దక్షిణ కోసలమని చెప్పబడింది. హ్యూయన్‌త్సాంగ్, ఆ పర్వతం, ఆ దేశానికి మూడు వందల 'లీ'ల దూరంలో ఉన్నదని వ్రాశాడు. కానీ, అది రాజధాని నుంచి కాదని చాలా మంది పండితులు అభిప్రాయపడుతున్నారు. హ్యూయన్‌త్సాంగ్ చెప్పిన పర్వతం భ్రమరగిరి అనీ, రాజు శాతవాహనుడనీ చెప్పడానికి ఏ అభ్యంతరమూ ఉండకూడదని చైనా దేశ విషయ పండితులు చెపుతున్నారు. ఆంధ్రదేశంలోని శ్రీశైల పర్వతం మీద ఉన్న దేవతకు 'భ్రమరాంబ' లేదా 'భ్రామరి' అని పేరు. అందుచేత "భ్రమరగిరి" అనే పేరు గల పర్వతం ఇది ఒక్కటే కనబడుతోంది. అయితే దీని మీద ముఖ్యమైన బౌద్ధ విహార్యాద్య విశేషాలేమీ లభించలేదు. కోసల దేశానికి దక్షిణంగా ఉన్న దేశం మంచి కాని, నైరుతిగా ఉన్న దేశం నుంచి కాని, దక్షిణ కోసలం నుంచి కాని, ఈ పర్వతం దగ్గరికి మూడు వందల 'లీ' ల కంటె ఎక్కువ దూరం లేదు.

హ్యూయన్‌త్సాంగ్ ఇతిహాస పండితుడు కాని, భూగోళ శాస్త్రజ్ఞుడు కానే కాడు. అతనొక గొప్ప పండితుడు. అయితే అతను అన్నింటినీ నమ్మే మధ్యకాలిక బౌద్ధ శ్రమణుడు, శ్రద్ధావంతుడైన యాత్రికుడు. భారత దేశంలో ఉన్న బౌద్ధ పవిత్ర క్షేత్రాలన్నీ సందర్శించి, వాటికి సంబంధించిన కథలన్నీ పోగుచేసుకొని, వాటిని వ్రాసుకున్నాడు. ఇతను చెప్పిన ప్రకారం కోసల దేశం కళింగ దేశానికి నైరుతిగా 1800 'లీ' దూరంలో ఉన్నది. కోసలకి దక్షిణంగా 900 'లీ'ల దూరంలో ఆంధ్రదేశం ఉన్నది. ఆంధ్ర దేశానికి దక్షిణంగా సుమారు 1000 'లీ'ల దూరంలో 'ధాన్యకటకం' ఉన్నది. దీనికి నైరుతి దిక్కున సుమారు 1000 'లీ'ల దూరంలో చోళ దేశం ఉన్నది. అతను ఇచ్చిన ఈ ప్రదేశాల మధ్యనున్న దూరాలు, వాటి దిక్కులూ సరిగా లేవు. భ్రాంతియుతాలుగా వున్నాయి. అంతే కాక అతని "జీవిత చరిత్ర"లో కోసలకు బదులు దక్షిణ కోసల దేశం చెప్పబడింది. ఆంధ్రదేశం నుంచి ఇక్కడికి దూరం అలాగే ఉన్నా దిక్కు మాత్రం మారింది. ధాన్య కటకం నుంచి చోళ దేశం ఉన్న దిక్కు మరొక విధంగా చెప్పబడింది. ఇంతకీ అతను భ్రమరగిరి మీద ఉన్న విహారం చూడలేదు. ఆ విహారం పాడుపడి పోయినదనీ, అక్కడికి ఎలా వెళ్ళాలో కూడా తెలియదనీ అతనే వ్రాశాడు. ధాన్యకటకం వెళ్ళినట్టుగా చెప్పుకున్నాడు కాని ప్రసిద్ధమైన అమరావతి చైత్యం మాటైనా ఎత్తలేదు. కనీసం మౌర్య సామ్రాజ్యం చివర కాలం నుంచీ ఉన్న ఈ చైత్యానికి

క్రీ.శ. 12 వ శతాబ్ది వరకూ కూడా నిరంతరమూ దానాదులు లభిస్తూనే ఉండేవని పురాతత్త్వ శాస్త్రం ద్వారా తెలుస్తోంది. దానికి బదులు ఇతను ధాన్యకటక దేశంలో ఉన్న ఎన్నో పాడుపడిపోయిన విహారాలను గూర్చి ఉపయోగంలో ఉన్న ఇరవై విహారాల గూర్చీ, ఆ దేశపు రాజధానికి (పేరు చెప్పలేదు) తూర్పు, పడమరగాను ఉన్న పర్వతాల మీద ఉన్న రెండు విహారాలను గూర్చి వ్రాశాడు. దీనిని బట్టి ఇతను తాను సందర్శించిన ప్రదేశాలలో ఉన్న కొన్ని ప్రధాన విషయాలను కూడా చూడలేదని తెలుస్తోంది. అలాంటి రచయిత వ్రాసిన విషయాలలో ఇతర మౌలిక ఆధారాల చేత ప్రమాణికాలైన వాటిని మాత్రమే మనం అంగీకరించవలసి ఉంటుంది. నాగార్జునుడు కోసలలో కానీ, దక్షిణ కోసలలో కాని నివసించినట్లు ఏ మౌలికాధారాలు కూడా చెప్పడం లేదు. అందుచేత నాగార్జునునికి వీటితో ఏవిధమైన సంబంధమూ లేదు. శాతవాహన రాజుతో ఇతనికి ఘనిష్ఠమైన మైత్రి ఉండేదని ఇతర మౌలికాధారాల ద్వారా తెలుస్తోంది. నాగార్జునుడు మహాచైత్యం నిర్మించడానికై ఈ రాజును ప్రోత్సాహించినట్లు రత్నావళి సూచిస్తుంది. అందుచేత ఈ విషయంలో మనం హ్యూయన్‌త్సాంగ్ మాటలు విశ్వసించవచ్చును.

నాగపూర్ సమీపంలో రామటేక్ దగ్గర ఉన్న ఒక కొండ దక్షిణ కోసల సరిహద్దులోకి వస్తుంది. ఈ కొండ మీద పాడుపడిన విహారం అవశేషాలు కొన్ని ఉన్నాయి. దీని గుహలలో ఒక దానికి "నాగార్జున గుహ" అని పేరు ఉన్నది. ఈ కారణాల చేత 'పోలోమోలోకిలి' పర్వతం ఇదే అయి ఉంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇది చైనా యాత్రికుడు చెప్పిన దేశం అవడానికి వీలులేదు. ఎందుచేతననగా ఇది కళింగదేశం నుంచి నైరుతిగా 1800 'లీ'ల దూరంలోను, (అతను చెప్పినట్లు వేంగి రాజధానిగా గలిగిన) ఆంధ్రదేశానికి ఉత్తరంగా 900 "లీ"ల దూరంలోను లేదు. ఇక్కడ ఉన్న పర్వతం కూడా "ఉన్నతమూ, సుసంహతమూ అయిన భ్రమరగిరి అవడానికి వీలు లేదు. అక్కడ కనబడేవి హరావశేషాలు. ఈ యాత్రికుడు వర్ణించినట్లుగా పెద్దదీ, శాతవాహన చక్రవర్తి నిర్మించినదని చెప్పడానికి అర్హత కలదీ అయిన విహారానివి కాదు. గయ నుంచి దాదాపు ముప్పై మైళ్ల దూరంలో ఒక "నాగార్జున పర్వతం" ఉన్నది. నాగార్జునుని మహావిహారం నిర్మించిన పర్వతం ఇదే అని చెప్పడం కూడా యుక్తి విరుద్ధమే. చిత్తోర్‌కు తూర్పుగా ఆరు మైళ్ల దూరంలో క్రీ.పూ. రెండవ శతాబ్దం మొదలు గుప్తులు కాలం వరకు ఉన్న (ప్రస్తుతం "నాగరి" అనే పేరు గలది)

శిబి వంశీయుల రాజధానియైన 'మాధ్యమికం' అనే నగరంలో ఈ మాధ్యమిక సిద్ధాంతం ఆవిర్భవించిందని చెప్పడం కూడా యుక్తివహం కాదు.

హ్యూయన్‌త్సాంగ్ చెప్పిన దానిని ఇతర ప్రమాణాలతో సమన్వయించి నాగార్జునుని పర్వత విహారం గుర్తించవచ్చును. క్రీ.శ.405-411 ప్రాంతాలలో భారత దేశంలో పర్యటించిన ఫాహియాన్ దక్షిణాపథంలోని ఒక పర్వతం మీద ఉన్న అయిదు అంతస్తుల 'పోలోయు' (పర్వత) విహారం ఉన్నట్లు వర్ణించాడు. ఇతను చేసిన దీని వర్ణనం మొత్తం మీద నాగార్జునుని కోసం రాజు కట్టించిన ఐదు అంతస్తుల విహారాన్ని గూర్చి హ్యూయన్‌త్సాంగ్ చేసిన వర్ణనకి సరిపోతుంది. ఫాహియాన్ 'పర్వత' అనే దానిని పొరబాటున 'పరవత' అని విని ఉంటాడు అని వాల్టర్ అభిప్రాయాన్ని అంగీకరించిన పక్షంలో, ఇది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలోని కృష్ణానదీ తీరాన ఉన్న, "నాగార్జున కొండ" అని పిలవబడే పర్వతం కావచ్చును. దీనికి శ్రీపర్వతం అని పేరు ఉండేదని చెప్పడానికి శిలాశాసన రూపమైన ఆధారం ఉంది.[87] దీని వల్ల హ్యూయాన్‌త్సాంగ్, తాను స్వయంగా చూడకుండా, విన్న దానిని పట్టి చేసిన నాగార్జున పర్వత వర్ణనానికి సమాధానం కుదురుతుంది. నాగార్జునుడు, దక్షిణ దేశంలో, ధాన్యకటకం దగ్గర ఉన్న శ్రీపర్వతం మీద అనేక సంవత్సరాల పాటు నివసించాడని భారత టిబెట్ దేశీయ వ్యాఖ్యానాలు చెపుతున్నాయి. విహారాలకీ, స్థూపాలకీ సంబంధించని అతి విశాల భవన జాలం దీని మీద కనుగొనబడింది. దీనితో సమానమైనది మరొకటి దక్షిణ దేశంలో ఎక్కడా లభించలేదు. ఇక్కడ ఉన్న ప్రాచీనమైన కొన్ని కట్టడాలు చివరి శాతవాహనుల కాలం నాటివి కావచ్చునని శాసన ప్రమాణాలు సూచిస్తున్నాయి. ఇది 'నల్లమలై' పర్వత శ్రేణిలో భాగం. భ్రమరగిరి (శ్రీశైలం) కూడా ఈ పర్వత శ్రేణిలో చేరినదే. ఇక్ష్వాకుల కాలంలో (క్రీ.శ. 218-260) ఈ పర్వత శ్రేణి కంతకి "శ్రీపర్వతం" అని పేరు ఉండేది.[88] తెలుగు చోడ రాజులు, రెడ్డి రాజులు, రేచెర్ల రాజులు వ్రాయించిన శాసనాలలోను, చివరికి 14 వ శతాబ్దికి చెందిన తెలుగు వాఙ్మయంలో కూడా శ్రీశైలాన్ని శ్రీపర్వతమనీ, కేవలం 'పర్వతం' అనీ నిర్దేశించడం జరిగింది. శాతవాహన చక్రవర్తియైన రెండవ పులోమావి ఒక శిలాశాసనంలో, తన సామ్రాజ్యంలో ఉన్న పర్వతాలను పేర్కొంటూ, ఈ పర్వతాన్ని "సిరితన" (శ్రీస్థాన) అని నిర్దేశించాడు. దీని చుట్టుప్రక్కల ఉన్న ప్రదేశం,

ములక* కూడా ఇతని సామ్రాజ్యంలో చేరినదే. శ్రీపర్వతము, శ్రీశైలము, శ్రీగిరి లేదా పర్వతము అని చెప్పబడే మరొక పర్వత శ్రేణి ఏదీ ఈ ప్రాంతంలో లేదు. ఇది బౌద్ధులకు, హిందువులకు, జైనులకూ కూడా పవిత్రమైన పర్వతం. వాఙ్మయంలోను, కథలలోను చాలా ప్రసిద్ధి గాంచింది. కొంతకాలం శ్రీశైలం కాపాలికుల కార్యస్థానంగా ఉండి, తరువాత శాక్తుల[73] ప్రధాన కేంద్రం అయింది. బాణుడు, భవభూతి దీనిని వర్ణించారు. ఇది సర్వసిద్ధి ప్రదమైన పర్వతమని క్రీ.శ.968 నాటి కంబోడియా శిలా శాసనంలో వ్రాసి వుంది.

శ్రీపర్వతానికి "నాగార్జున కొండ" అనే పేరు ఎప్పటి నుంచి వచ్చిందో నిశ్చితంగా చెప్పలేము. ఇక్ష్వాకులను జయించిన తరువాత పల్లవులు, మూడవ శతాబ్దిలో, శ్రీపర్వతం మీది బౌద్ధావాసాలు ధ్వంసం చేసినట్లు కనబడుతుంది. "కొండవీడు సీమ దండకావళి" ప్రకారం చోళుల కాలం నుంచి కూడా నాగార్జున కొండ ఒక సీమకు ("సీమ" అనేది పరిపాలనా వ్యవస్థ కోసం చేసిన విభాగం) కేంద్రంగా ఉండేది. అయితే ఈ రకమైన స్థానిక అభిలేఖలు పధ్నాలుగవ శతాబ్దం కంటె పూర్వమైనవి కావు. ఈ విషయాలన్నీ పరిశీలించగా నాగార్జునుడు తన జీవిత చరమకాలంలోని చాలా భాగం గడపిన పర్వతమే "శ్రీపర్వతము" లేదా "నాగార్జున కొండ" అని చెప్పవచ్చును. ఆతని కోసం భ్రమరగిరి మీద విహారం నిర్మించబడినదని హ్యూయన్‌త్సాంగ్ వ్రాసింది ఒక విధంగా చూస్తే నిజమే అన్నట్లు కనబడుతుంది. ఎందువలన అనగా ఆ పర్వతానికి కూడా "శ్రీపర్వతం" లేదా "శ్రీశైలం" అనే పేరు ఉండేది. అది కూడా కృష్ణానదీ తీరం మీదనే వుంది. అది ఒకే పర్వత శ్రేణికి చెందిన చివరి భాగం. మరొక చివరి భాగమైన నాగార్జున కొండకు కూడా "శ్రీపర్వతం" అనే పేరు ఉన్నది. ఈ పర్వత శ్రేణి అంతా కూడా 'నల్లమలై' తూర్పు కనుమలలోని భాగమే.

ఇక్కడ మరొక విషయం కూడా చెప్పవలసి ఉన్నది. బర్జెస్, వొగెల్, జోవ్యూడెబ్రిల్ మొదలు డెమివిల్, కాంజ్ వరకూ గల భారతీయ విషయ పండితులైన ప్రధాన పాశ్చాత్య పండితులందరూ, చాలా వరకూ గల భారతీయ విద్వద్వరేణ్యులు కూడా "పొలోమోలోకిలి" అనేది శ్రీపర్వతమే అనీ, మన దార్శనికుడు దాని మీదనే నివసించాడనే అంగీకరిస్తున్నారు. అయితే కొందరు

* ఇదే తెలుగు వాఙ్మయంలోని 'ములికినాడు' లేదా 'ములికి విషయము'.

భారతీయ పండితులు దీనిపై నివసించిన వాడు సిద్ధనాగార్జునుడనీ, మాధ్యమిక సిద్ధాంత వేత్తయైన మన దార్శనికుడు కాదనీ అభిప్రాయ పడుతున్నారు. బహుశా అలాంటి నాగార్జునుడు మరొకడు లేకపోవచ్చును. ఆ పేరుతో ఒకరిద్దరు సిద్ధులు ఉన్నా, వారు ఎనిమిదవ శతాబ్దానికి, లేదా దాని తరువాతి కాలానికి చెందినవారై ఉంటారు. అలాంటి బౌద్ధ సిద్ధులకు ఎనిమిదవ శతాబ్దంలోను, అటు తదనంతర కాలంలోనూ ఆంధ్ర దేశంలో నివాసయోగ్యమైన పరిస్థితులు కాని, శ్రీపర్వతం మీద నివాసం లభించడానికి అవకాశం కాని లేవు. ఆనాటి మతం, రాజకీయ పరిస్థితులు దానికి అనుగుణంగా లేవు. క్రీ.శ.260 తరువాత శ్రీపర్వతం మీద బౌద్ధ సంస్థలేవీ లేవని వెనుక చెప్పటమైంది. అలాంటి ఊహ (అతను దార్శనిక నాగార్జునుడు కాడు అనే ఊహ) దార్శనిక నాగార్జునునికి శాతవాహనుల తోటి, శ్రీపర్వతంతో సంబంధం ఉన్నట్లుగా నిరూపించే ప్రమాణ సంఘాతానికి విరుద్ధం అవుతుంది.

శ్రీపర్వతం చేరడానికి పూర్వం నాగార్జునుడు గుంటూరు జిల్లాలో ఉన్న అమరావతీ, ధాన్యకటకాలలో కాని, వాటికి సమీపంలో కాని ఉన్న విహారంలో నివసించి ఉంటాడు. దీన్ని సమర్థించడానికి అనేక హేతువులున్నాయి. రాజ్యంలోని ప్రధాన నగరాల నుంచి రాజధాని నుంచి వచ్చి అనాయాసంగా కలుసుకోవడానికి శక్యం కాని ప్రదేశంలో నివసించిన పక్షంలో అతను రాజుకు మిత్రుడు, సలహాదారు అవడానికి అవకాశం ఉండదు. ప్రతిష్ఠానము, అమరావతి, వైజయన్తి అనేవి ఆనాటి ప్రధాన నగరాలు. మొదటి దానితోటి, మూడవ దాని తోటి నాగార్జునునకు సంబంధం ఉండేదని చెప్పడానికి ఆధారాలు లేవు. అమితాభ సంప్రదాయం ధాన్యకటకంలో (ధరణికోట, ఇదే టిబెట్ వారి ధింగ్‌కోట) ఆవిర్భవించినట్లు కనబడుతుంది. బోధిసత్త్వ మంజుశ్రీ ధాన్యకటక (ధాన్యాకర) మహానగరం సమీపంలో ఉన్న ఒక విహారంలో నివసించి, చుట్టుప్రక్కల అరణ్యాలలో ఉన్న నాగులను బౌద్ధ మతంలోనికి మార్చినట్లుగా ఒక మహాయాన గ్రంథమైన "గండవ్యూహం" ద్వారా తెలుస్తోంది. ధాన్యకటకం నుంచి ముప్పై ఐదు మైళ్ళ దూరంలో కృష్ణా జిల్లాలోని, విజయవాడలో ఉన్న ఇంద్రకీల పర్వతంతో కూడా ఇతనికి సంబంధం ఉండేది. బహుశా ప్రజ్ఞా పారమితా వాఙ్మయం అంతా ఇక్కడే బయలుదేరింది.

మనం వెనుక చూసినట్లు నాగార్జునునికి వీటి అన్నింటితో మిక్కిలి సంబంధం

ఉంది. అమరావతీ స్తూపానికి నాగార్జునుడు లోహ ప్రాకారాన్ని కట్టించాడని భారత, టిబెట్ మౌలికాధారాల ద్వారా తెలుస్తుంది. అతని శిష్యుడైన ఆర్యదేవుని అవశేషాలతో ఒక కుండ గుంటూరు జిల్లాలో దొరికింది.[90] నాగార్జునుని నిర్దేశం ఉన్న జగ్గయ్యపేటలోని శిలాశాసనాన్ని గూర్చి వెనుకనే తెలిసికొని ఉన్నాము. ఈ విధంగా వివిధ విషయ పరిశీలనను బట్టి నాగార్జునుడు మొదట ధాన్యకటక, అమరావతులలోను, తరువాత శ్రీపర్వతం మీదనూ నివసించాడని చెప్పడానికి అవకాశాలున్నాయి.

పైన చెప్పిన దానిని బట్టి, నాగార్జునునికి అమరావతీ, శ్రీపర్వతాలతోటి, శాతవాహన సామ్రాజ్య కాలంతోటి ఏ సంబంధమూ లేదని చెప్పడం చాలా కష్టమనీ, మరొక ప్రాంతంతో కాని, రాజుతోకాని అతనికి సంబంధం ఉన్నదని చెప్పడం ప్రామాదిక వాదం అవుతుందనీ తేలింది.

రాజమిత్రుడు :

నాగార్జునుడు జోస్యం చెప్పిన ప్రకారం ఒక బాలుడు రాజు అయినట్లూ, అతనికి రత్నాలు బహూకరించినట్లూ చెప్పే టిబెట్ కథ నిరాధారమైంది. నాగార్జునుడు ఏడు సంవత్సరాల పాటు నిరంతరమూ తన ఎదుట ఒక ఎఱ్ఱని జెండా తీసుకుని వెడుతూ ఉండటం ద్వారా ఒక రాజు యొక్క దృష్టిని ఆకర్షించి, తరువాత అతనికి తన సర్వజ్ఞత్వాన్ని చూపి అతనిని బౌద్ధ మతంలోకి మార్చాడని కుమారా జీవుడు ఒక కథ చెప్పాడు. భారత దేశ రాజ సమక్షంలో జరిగిన మాయావిద్యా స్పర్ధలో నాగార్జునుడొక బ్రాహ్మణుని ఓడించాడని, అతనే మరొక కథ కూడా చెప్పాడు. మరొక కథ ప్రకారం అతను ఒరిస్సాదేశ రాజైన ముంజుని బౌద్ధ మతంలోకి మార్చాడు. అసంగత రూపంలో ఉన్న ఈ కథలన్నీ ఊహాకల్పనలే.

శాతవాహన చక్రవర్తి నాగార్జునుని పట్ల అత్యంత భక్తితో అతని నివాసం వద్ద రాజగౌరవం సూచించే రక్షక భట మండలి ఏర్పాటు చేశాడని, తొమ్మిది కోట్ల బంగారు నాణాలు వ్యయించి అతని కొరకై ఒక విహారం కట్టించగా రాజ ధనాగారం శూన్యం అయిపోవడంతో నాగార్జునుడు శిలలను సువర్ణంగా మార్చి అతనికి అత్యధిక ప్రమాణంలో సువర్ణం అందజేశాడనీ హ్యూయన్‌త్సాంగ్ వ్రాశాడు. హ్యూయన్‌త్సాంగ్ సమకాలికుడైన బాణభట్టు (చూ. నిర్దిష్ట సూచి 86) సముద్ర త్రయాధీశుడైన శాతవాహన చక్రవర్తి నాగార్జునుని మిత్రుడనీ, అతనికి

నాగార్జునుడు నాగలోకం నుంచి తెచ్చిన ముత్యాల హారం బహుకరించాడనీ వ్రాశాడు. శాతవాహనుడు నాగార్జునుని శిష్యుడనే విషయాన్ని 'రసరత్నాకరం' (ఏడవ లేదా ఎనిమిదవ శతాబ్దం) ధ్రువీకరిస్తున్నది. ఆ రాజు శాతవాహన వంశీయుడని ఇత్సింగ్ కూడా వ్రాశాడు. అందుచేత నాగార్జున శాతవాహనుల సంబంధాన్ని గూర్చి సందేహించడానికి తగిన ఉపపత్తి ఏమీలేదు.

టిబెట్‌లోని "చరిత్రలు" వాటి అలవాటు ప్రకారం రాజు పేరు తికమక చేశాయి. డెంజల్ చెప్పినట్లు బ్డెస్ప్యోడ్ అనే పదానికి సరిపడేట్లుగా "శాంతివాహన" "సద్వాహన" అనే యుక్తి యుక్తాలైన పదాలతో పాటు ఆ రాజుకే "ఉత్రయన" "ఉదయన" "అంతివాహన" "శంకం"లనే పేర్లు కూడా వచ్చేటట్లు మార్చడానికి వీలయ్యే పదాలు కూడా, భ్రాంతి జనకమైన పద్ధతిలో ఉపయోగపడ్డాయి.* ఇదంతా పొరబాటు వల్లా భ్రాంతివల్ల ఏర్పడినదని షీస్నెర్, డెంజెల్, వాల్లెసర్ చూపించారు.

నాగార్జునుడు రెండు మతలేఖలూ ఒకే రాజుకు వ్రాశాడని రత్నావళి వ్యాఖ్యాత, అజిత మిత్రుడు చెప్పాడు. ఆ లేఖలలో రాజు పేరు లేదు. సుహృల్లేఖను అనువదించిన చైనా పండితుడు ఆ రాజు పేరు షియెన్ టిహ్‌కియ లేదా శాంతోకియా అని వ్రాశారు. దానిని 'జతకు', 'జంతక', 'శంతక' లేదా 'సింధుక' అని అర్థం చేసుకోవచ్చును. ఒక అనువాదకుడు అతని దేశం పేరు షింగ్‌తు అని వ్రాశాడు. ఒక సంస్కృతం పేరుకు చేసిన చైనా అనువాదం తప్పనీ, అతని అసలు పేరు శాతవాహనుడనీ, ప్రతి లేఖనం నుంచి (చైనా లిపిలో వ్రాసిన సంస్కృతం పేరు నుంచి) ఈ పదం (శాతవాహన) కూడా గ్రహించడానికి అవకాశం ఉన్నదని యస్.బీల్ చెప్పాడు.

సుహృల్లేఖలో వైయక్తిక నిర్దేశాలేవీ లేవు కాని, 'రత్నావళి' నుంచి రాజును గూర్చి ఈ క్రింది వివరాలు సేకరించడానికి వీలున్నది. నాగార్జునుని మిత్రుడు రాజు మాత్రమే కాదు, మహాభౌముడు (IV.2). ఇతను పూర్వజన్మలలో ఔదార్య వంతుడవడం చేత ఇపుడు ఇంతటి ఐశ్వర్యవంతుడయ్యాడు (IV.7). రాజ్యం ధర్మ మార్గంలోనే సంపాదించాడు (IV.43) సామాన్య రాజులు స్వప్నంలో సైతం ఊహించరానిదీ, సామంతులకు గగుర్పాటు కలిగించేదీ అయిన ఒక గొప్ప

* ఒక లామా సంప్రదాయం ప్రకారం ఆ రాజు విక్రమాదిత్యుడట (ఎవాన్స్ వెంట్జ్)

ధర్మస్థదాన్ని (ఆలయాన్ని) నెలకొల్పవలసినదిగా నాగార్జునుడు రాజుకు బోధిస్తాడు. నిర్మాత మరణించిన తరువాత కొంత కాలం వరకైనా ఉత్తమ స్మృతి చిహ్నంగా నిలవజాలని విహారం కట్టించడం కంటె మానడమే మంచిది. (IV. 10-11). మంచి ఆరోగ్యంతో ఉన్నపుడే అలాంటి విహారం కట్టించడం మంచిదనీ, మరణం ఏ క్షణంలోనైనా రావచ్చుననీ, దాతృత్వం పుణ్యప్రదమూ, ప్రధానమూ అనీ ఆ రాజుకు ఉపదేశిస్తున్నది. ఈ లేఖ ఆ రాజు నాగార్జునుని విషయంలో స్నేహ, భక్తి భావాలు గలిగిన శిష్యుడన్నట్లూ (IV. 5,3) సద్ధర్మ భజనకు అర్హత కలవాడన్నట్లూ (I. 2) ఈ లేఖలో సూచించబడింది. "రత్నావళి"లో లభించే సాక్ష్యాలను బట్టి, ఆ రాజమాత్రుడు అధర్మ మార్గాన గాని, దురాక్రమణ ద్వారా గాని కాక ధర్మమార్గాన రాజ్యానికి వచ్చిన చక్రవర్తి* అనీ, ప్రపంచంలోనే అత్యాశ్చర్యకరం అయే ధర్మస్థానాన్ని నిర్మించవలసిందిగా నాగార్జునుడు అతనికి ఉపదేశించాడనీ మనం నిస్సంశయంగా చెప్పవచ్చును. ఈ ఉపదేశానికి ఫలితంగా అమరావతిలోని ఆ మహా లోహప్రాకార నిర్మాణం జరిగి ఉంటుందని కూడా ఊహించవచ్చును. "ఇది బహుశా భారత దేశంలో అత్యధిక ప్రశంసార్హమైన స్మృతి చిహ్న భవనము" "భారతీయ (వాస్తు) కళ యొక్క పరాకాష్ఠ" అని జేమ్సు ఫర్గూసన్, "భారతీయ మూర్తి నిర్మాణ కళ సృజించిన అపూర్వ సౌందర్య విలసితము, అత్యంత సుకుమారమూ అయిన మనోహర కుసుమం" అని ఎ.కె. కుమారస్వామి, దీనిని వర్ణించినారు.

నాగార్జునుని మిత్రుడు ఏ శాతవాహనుడో నిర్ణయించడం అశక్యం. ఒక శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి గూర్చి వర్ణిస్తూ "అతని అశ్వాలు మూడు సముద్రాలలో నీళ్ళు త్రాగాయి. (త్రిసముద్రతోయ పీత వాహన) అని చెప్పబడింది. బాణభట్టు కూడా "మూడు సముద్రాలకు అధిపతి" అనే విశేషణం ప్రయోగించి ఉండటం చేత ఈ రాజు గౌతమీపుత్ర శాతకర్ణి కావచ్చునా అని ఒక సందేహం. ఇది కుదరదు. (చూ.పై. I భాగం III విభాగం). ఈ రాజు దక్షిణ దేశానికంతకీ సమ్రాట్ అని శాసనాలలో వర్ణింపబడినవాడు (వసిష్ఠ పుత్ర) రెండవ పులోమావి తరువాత అధికారానికి వచ్చినవాడు అయిన శాతకర్ణి కావచ్చును. ఆ రాజమిత్రుడు రెండవ పులోమావియే అనీ, ఆతను రెండవ శతాబ్దం మధ్య భాగానికి చెందినవాడనీ

---

* ఆ కాలంలో దక్షిణ భారతంలో సాతవాహనుడొక్కడే అలాంటి సార్వభౌముడు.

ఆర్.పి.చందా అభిప్రాయం. బహుశా ఇలా అనుకోవడానికి కారణం అతని పేరు అమరావతీ శాసనాలలో ఉండడం కావచ్చును.*[92] నాగార్జునుని మిత్రుడు యజ్ఞశ్రీ అని 1886లో బహుశా ప్రప్రథమంగా గుర్తించినవాడు యస్.బీల్. ఇతని అభిప్రాయం ప్రకారం యజ్ఞశ్రీ క్రీ.శ.178-207 ప్రాంతానికి చెందినవాడు. ఎం.వింటర్ నిట్జ్, ఇ. లామొట్టి కూడా ఇది సంభావ్యమే అని అంగీకరించారు. అయితే రాజు క్రీ.శ.166-196 ప్రాంతానికి చెందినవాడని వింటర్ నిట్జ్, మూడవ శతాబ్దానికి చెందినవాడని లామొట్టి అభిప్రాయం వెలిబుచ్చారు. క్రీ.శ. 213లో రాజ్యానికి వచ్చిన విజయశ్రీ అయి ఉంటాడని ఎమ్.వెల్లెసర్ యొక్క అభిప్రాయం** ఈ ఊహాలలో దేనినీ ప్రామాణికమని కానీ, అప్రమాణికమని కాని చెప్పడానికి ఆధారాలు లేవు.

మరణము :

నాగార్జునుడు ఎంత కాలం జీవించాడో, ఎలా మరణించాడో మనకు తెలియదు. అతను అరవై సంవత్సరాలు జీవించాడని టిబెట్ సంప్రదాయం ఒకటి ఉన్నది. వంద సంవత్సరాలు జీవించాడనీ, వందల కొలది సంవత్సరాలు జీవించాడనీ, మరణించి పునరుజ్జీవితుడయ్యాడనీ, వివిధ సంప్రదాయాలున్నాయి. యోగ ప్రభావంచేత, రసాయన ప్రయోగంచేత అతను సుదీర్ఘకాలం జీవించాడనీ చెప్పే అనేక సంప్రదాయాల అభిప్రాయాన్ని మనం అంగీకరించవచ్చును. ఇతను ధర్మం కోసం మరణించాడని ఒక మహాయాన గ్రంథంలో ఉన్నది. అందులో ఎందుచేత, ఎట్లా అనేది చెప్పలేదు. కుమారా జీవుడు చెప్పిన ఒక కథ ప్రకారం మాయావిద్యకు సంబంధించిన పోటీలో ఓడిపోయిన ఒక బ్రాహ్మణున్ని నాగార్జునుడు "నేనీ భూలోకంలో చాలా కాలం ఉండడం నీకిష్టమేనా" అంటూ ప్రశ్నించాడు. "నిజానికి నాకిష్టం లేదు" అని ఆ బ్రాహ్మణుడు సమాధానం చెప్పగానే నాగార్జునుడు తన గదిలోకి వెళ్ళి, తాళం వేసికొని, ఆ రోజంతా బైటకు రాలేదు. తలుపు బ్రద్దలు కొట్టి చూస్తూ అతను అక్కడ లేడు. వెంటనే అక్కడి నుంచి ఒక

* అమరావతిలో శాసనాలలో శివమక శాతకర్ణి, యజ్ఞశ్రీ అనే ఇద్దరు శాతవాహనుల పేర్లు మాత్రమే పేర్కొనబడ్డాయి. మొదటి రాజు విషయంలో మనకేమీ తెలియదు.

** జెక్టిస్క్రిఫ్ట్ ఫర్ బుద్ధిజం, మ్యూనిచ్ VI, పు.103.

కీటకం ఎగిరిపోయినది.

హ్యూయన్‌త్సాంగ్ మరొక కథ చెప్పాడు– ఏదో ఒక అజ్ఞాత శక్తి చేత నాగార్జునుని జీవితమూ, రాజు జీవితమూ, పరస్పర సంబద్ధాలై ఉన్న నాగార్జునుడు, తననూ, తన మిత్రునీ కూడా దీర్ఘాయుర్దాయవంతులను చేశాడు. ఆ రాజు కనిష్ఠ పుత్రుడు సింహాసనం ఎప్పుడు అధిరోహించాలా అని ఆతురత పడుతూ ఉంటాడు. "నాగార్జునుడు మరణిస్తే కాని అది కుదరదు" అని రాణి చెపుతుంది. నాగార్జునుడు మరణిస్తే కానీ రాజు మరణించడు అన్నట్లు ఆమె ఇచ్చిన సూచనను గ్రహించి, ఆ రాజకుమారుడు నాగార్జునుని వద్దకు వెళ్ళి"నా కోసమై నీవు ప్రాణ త్యాగం చెయ్యాలి" అని అభ్యర్థించాడు. నాగార్జునుడు అందుకు అంగీకరించి, ఒక ఎండిన గడ్డి పరకతో తన కంఠం ఛేదించుకొని మరణించాడు. వెంటనే రాజు కూడా మరణించాడు. కొంచెం మార్పులు, చేర్పులూ చేసి టిబెట్ పుస్తకాలు కూడా ఈ కథ వర్ణించాయి. ఆ రాజకుమారుని పేరు ఆ కథల ప్రకారం, శక్తిమంతుడు లేదా సుశక్తి. అయితే నాగార్జునుడు మాత్రం బ్రహ్మ కోరిక ప్రకారం శిరస్సు ఖండించుకున్నాడని "గ్రుబ్‌తాబ్" కథనం. అతను 'సుఖవతి' అనే పేరు గల అమితాభుని స్వర్గానికి వెళ్ళాడని కొన్ని గ్రంథాలలో చెప్పగా టిబెట్టు 'చరిత్రలు' మాత్రం, అతని శిరస్సూ, మొండెమూ మళ్ళీ కలుసుకున్నాయని అంటూ ఇంకా ఏవో కథలు చెపుతున్నాయి. ఈ కథలన్నీ అవిశ్వసనీయాలు, నిరుపయోగములు అయితే అతను శ్రీపర్వతం మీద మరణించాడనే విషయంలో చాలా వరకు ఐకమత్యం ఉన్నది కాబట్టి అది సత్యమే కావచ్చును.

నాగార్జునుడు మరణించిన వంద సంవత్సరాలకు దక్షిణ దేశంలో అతనికి దేవాలయాలు నిర్మించి, బుద్ధుని ఆరాధించినట్లు అరాధించేవారని కుమారాజీవుడు చెబుతున్నాడు. 1938 సంవత్సరంలో పురావస్తు శాఖ వారు జరిపిన త్రవ్వకాల్లో నాగార్జునకొండ వద్ద ఒక విహారంలోని భిక్షు నివాస గృహంలో సున్నపు రాయితో చేసిన పూర్ణకుంభం లభించింది. దీని ఎత్తు 15 అడుగులు, గర్భ పరిధి (వైశాల్యం) 10 1/2 అడుగులు. ముఖ పరిధి (వైశాల్యం) నాలుగు అడుగులు. దీనిలో చిన్న దంతాలు తప్ప మరేమీ లేవు. ఇవి నాగార్జునుని అవశేషాలని భావిస్తున్నారు.

III

నాగార్జునుని రచనలు - శిష్యులు

రచనలు:

నాగార్జునునివి అని చెప్పే రచనలన్నీ ఆతనివి కాకపోవచ్చును. కాని ఈ క్రింద పేర్కొన్నవి, మరికొన్ని కూడా నిస్సందేహంగా ఆతని రచనలే కావచ్చును.

(1) "మాధ్యమిక శాస్త్రము" లేదా "మాధ్యమిక కారికలు" ఇది నాగార్జునుని ప్రధాన గ్రంథం. దీనికి సంస్కృత మూలమూ, చైనా టిబెట్ భాషానువాదాలూ, చాలా వ్యాఖ్యానాలు లభిస్తున్నాయి. అనేక వ్యాఖ్యానాలలో చంద్రకీర్తి వ్రాసిన వ్యాఖ్యానం ఒకటి. దీని సంస్కృత మూలం కూడా లభ్యం అవుతోంది. టిబెట్ అనువాద రూపంలో ఉన్న చంద్రకీర్తి వ్యాఖ్యానంతో సహా ఎనిమిది వ్యాఖ్యానాలూ, చైనా భాషానువాద రూపంలో మూడు వ్యాఖ్యానాలు సురక్షితంగా ఉన్నాయి, అనువాదాలు చాలా వరకు సంస్కృత మూలానుసారంగానే ఉన్నాయి. యల్.డెలా వల్లీ పౌస్సిన్, సంస్కృత మూలాన్నీ (449 శ్లోకాలు) చంద్రకీర్తి వ్యాఖ్యానంతో పరిష్కరించి ప్రకటించాడు (సెయింట్ పీటర్స్ బర్గ్, 1903). బహుశా ఇది కారికా రూపంలోని అతి ప్రాచీన గ్రంథం. సమగ్రములూ, అత్యుత్తములూ అయిన దీని అనువాదాలు ఈ పుస్తకాలలో ఇవ్వబడ్డాయి.

(1) ఫ్రెడరిక్ జె.స్ట్రెంగ్ రచించిన "శూన్యత్వము దీని మతపర విమర్శ" (Emptiness - A study in Religious Meaning, Nashville, New York, 1967) కెన్నెత్ కే. ఇనడా రచించిన "నాగార్జునుడు", (హొకుడోప్రెస్, టోకియో, 1970). స్ట్రెంగ్ రచించిన పుస్తకంలో "విగ్రహ వ్యావర్తిని" అనువాదం కూడా ఉంది. ఇనడా యొక్క మూల కారికలు కూడా ప్రతి లిపిలో ఇచ్చాడు.

(2) "విగ్రహ వ్యావర్తిని" (విరోధ నిరాకరణము), డెబ్బై శ్లోకాల ఈ గ్రంథానికి

ఆతనే వ్యాఖ్యానం వ్రాశాడు. మూలవ్యాఖ్యానాలు రెండు కూడా సంస్కృత మూలంలోను, చైనా, టిబెట్ బాషానువాదాల రూపంలోనూ లభిస్తున్నాయి. ఇ.హెచ్.జాన్‌స్టన్, కె.కున్‌ష్ట్ అనే పండితులు దీని యొక్క పరిశోధిత సంస్కరణ ప్రకటించారు * (Bruges, Begium 1951).

(3) "రత్నావళి" – ఇది శాతవాహనునికి వ్రాసిన మత లేఖ. ఇందులో ఐదు ప్రకరణాలున్నాయి. టిబెట్, చైనా భాషల అనువాదాల రూపంలో ఇది లభ్యం అవుతుంది. దీనికి రెండు టిబెట్ వ్యాఖ్యానాలు లభ్యం అవుతున్నాయి. ప్రథమ ప్రకరణము, ద్వితీయ ప్రకరణము, చతుర్ధ, పంచమ ప్రకరణలు సంస్కృత మూలంలో కూడా లభిస్తున్నాయి. వీటిలో మొదటి మూడింటిని జి.తుచ్చి పరిష్కరించి అనువదించాడు. (Journal of the Royal Asiatic Society, London, 1934, 1936).

(4) "సుహృల్లేఖ"– ఇది కూడా రాజుకే వ్రాసిన మతలేఖ. ఇందులో 123 శ్లోకాలు ఉన్నాయి. సంస్కృత మూలం మాత్రం లభ్యం కాలేదు. కాని దీని చైనా భాషానువాదాలు మూడూ, ఒక టిబెట్ భాషానువాదమూ లభిస్తున్నాయి. చివరి ధానిని హెచ్.వెంజెల్ ఆంగ్ల భాషలో అనువదించాడు (Journal of Pali Text Society, 1866). ఇన్సింగ్ కాలంలో ఇది భారత దేశంలో బహుళ ప్రాచారంలో ఉండేది.

నాగార్జునుని రచనలని చెప్పే మరి రెండు గ్రంథాలు చైనా, జపాను దేశాలపై అమిత ప్రభావాన్ని ప్రసరింప చేశాయి. వీటి అనువాదాలు మాత్రమే లభిస్తున్నాయి.

(1) "ద్వాదశముఖ శాస్త్రము"– ఇరవై ఆరు శ్లోకాల వ్యాఖ్యాన సహితమైన గ్రంథం. మూలకర్తయే వ్యాఖ్యానం కూడా రచించినట్లు ప్రసిద్ధి. వీటిలో 21 శ్లోకాలు మాధ్యమిక శాస్త్రంలోనివి. వ్యాఖ్యానం నాగార్జునుడు రచించినది కాకపోవచ్చును.

(2) "మహా ప్రజ్ఞాపారమితా శాస్త్రం"– ప్రజ్ఞా పారమిత సూత్రాలలో ఉన్న ఈ గ్రంథం విజ్ఞాన సర్వస్వం వంటిది. దీని ప్రమాణికత్వాన్ని గూర్చి కొందరు సూక్ష్మదృష్టి గల పండితులు సందేహం వెలిబుచ్చారు. నాగార్జునునివిగా చెప్పడానికి వీలులేని చాలా విషయాలు ఇందులో ఉన్నాయి. ఇందులోని నూరు ప్రకరణాల్లో

---

* మేలింగ్స్ చినోయిస్ ఎట్ బోధి క్యూస్, IX జులై 1957.

మొదటి ముప్పై ప్రకరణాలను ఇ.లామొట్టి ఫ్రెంచిలోనికి అనువదించాడు. (Louvain 1944,1949). కె. వెంకటరామన్ దీనిని గూర్చి పాండిత్య సమంచితమైన, సమగ్ర విషయాలతో గ్రంథం రచించాడు. (చూ. నిర్దిష్ట సూచిక 44). ఈ రెండు గ్రంథాలూ చైనా భాషలో మాత్రమే లభ్యం అవుతున్నాయి.

శిష్యులు :

నాగార్జునుని ప్రత్యక్ష శిష్యులలో సర్వ ప్రధానుడు ఆర్యదేవుడు. ఇతను దక్షిణ భారతానికి చెందిన బ్రాహ్మణుడని కుమారాజీవుడూ, సింహళ రాజకుమారుడని హ్యూయన్‌త్సాంగ్, చంద్రకీర్తులూ చెపుతున్నారు. ఇతడు ఆంధ్రదేశంలోనే నివసించి అక్కడనే మరణించాడనేది తథ్యం. అందుచేతనే అతని అవశేషాలు గుంటూరు జిల్లాలో లభ్యం అయ్యాయి. ఇతను నాగార్జునుని ప్రధాన శిష్యుడని అన్ని బౌద్ధ సంప్రదాయాలూ ఏకగ్రీవంగా చెపుతున్నాయి. దీనికి విరుద్ధంగా ఏ ప్రమాణమూ కనబడడం లేదు. అందుచేత ఇతను తరువాతి కాలానికి చెందినవాడని చెప్పడం యుక్తియుక్తం కాదు.

మొదట ఆర్యదేవుడు నాగార్జునునితో వాదం చేయడానికై వచ్చాడు. అప్పుడు నాగార్జునుడు అశోక గోపురం ఉన్న ఒక భిక్షు విహారంలో ఉండేవాడు. ద్వారం దగ్గర ఉన్న శిష్యుడు, లోపలికి వెళ్ళి ఆర్యదేవుడు వచ్చిన సంగతి నాగార్జునునికి తెలిపాడు. నాగార్జునుడు ఆర్యదేవుని కీర్తి అంతకు పూర్వమే విని ఉన్నాడు. అతను నీళ్ళు నింపిన పాత్ర ఒకటి శిష్యునికిచ్చి దానిని ఆర్యదేవునికి చూపమని ఆదేశించాడు. దానిని చూడగానే ఆర్యదేవుడు ఏమీ మాటలాడకుండా ఒక సూది దానిలో వేసి శిష్యుని లోనికి పంపాడు. ఈ విషయం నాగార్జునునికి చెప్పగానే అతను ఆర్యదేవుడు ధీశాలియైన ధార్మిక వ్యక్తి అని అంటూ, అతనిని లోపలికి తీసికొని రమ్మని శిష్యుణ్ణి ఆజ్ఞాపించాడు. ఆశ్చర్యమగ్నుడైన శిష్యునికి ఆ సంఘటనను గూర్చి వ్యాఖ్యానించి చెపుతూ నాగార్జునుడు "జలపూర్ణమైన ఆ పాత్ర నా సర్వజ్ఞత్వానికి ప్రతీక. ఆర్యదేవుడు తాను దాని లోనికి చొచ్చుకొని వెళ్ళ కలిగినట్లుగా ఆ సూచీ ప్రక్షేపం ద్వారా సూచించాడు" అని విశదీకరించాడు. ఆర్యదేవుడు వినీతుడై లోనికి ప్రవేశించి తనకు ఉపదేశం చేయమని నాగార్జునుని ప్రార్థించాడు. నాగార్జునుడు అతణ్ణి గొప్ప పండితుడని ప్రశంసించి "నేను వార్ధక్యం చేత దుర్బలుడనైపోతున్నాను. అందుచేత ఈ నిరంతర ధర్మ దీపాన్ని (ఆచార్యత్వాన్నీ,

మహాయాన సంప్రదాయ నాయకత్వాన్నీ) నీకప్పగించాలని అనుకుంటున్నాను" అని అంటాడు. తరువాత అతను బౌద్ధమతాన్ని గూర్చి విశదీకరించమంటూ ఆర్యదేవుని ఆదేశించగా, ఆర్యదేవుడు ప్రారంభించబోయి, తేజోసముద్దీపితమైన నాగార్జునుని వదనంలోకి చూడగానే, నోటమాట రాక అలాగే మౌనంగా ఉండిపోయాడు. తరువాత ఆర్యదేవుడు "నేను నీ శిష్యుడను" అని అనడంతో నాగార్జునుడు ఆతనికి ధైర్యం కలిగించి సత్యమైన ధర్మాన్ని బోధిస్తాడు. ఇది హ్యూయన్‌త్సాంగ్ చెప్పిన కథ.

కుమారాజీవుడు చెప్పిన కథ ప్రకారం ఆర్యదేవుడు ఒక బౌద్ధేతర దార్శనికుని వాదంలో జయించగా, ఆతని శిష్యుడు ఒక అరణ్యంలో ఆర్యదేవుని అడ్డగించి అతన్ని చంపివేశాడు. మరణించడానికి ముందు ఆర్యదేవుడు దీనికి ప్రతీకారం చెయ్యాలని అనుకుటున్న శిష్యులను ఉద్దేశించి "సర్వమూ శూన్యమే. చంపే వానికి గాని, చంపబడే వానికి గాని యదార్థమైన స్థితి అనేది లేదు. అందుచేత ప్రతీకారం చెయ్యాలనే అభిప్రాయం ఏమీ పెట్టుకోవద్దు" అని ఉపదేశించాడు. తరువాత ఆతని అవశేషాల మీద ఒక సమాధి కట్టించి ఆతనికి పూజలు జరిపించేవారట.

"చతుః శతకము", "శత శాస్త్రము" అనేవి ఆర్యదేవుని ప్రధాన రచనలు. మొదటి గ్రంథంలో మూడవ వంతు మాత్రమే సంస్కృత మూలంలో లభిస్తోంది. మొత్తం గ్రంథం టిబెట్ భాషలో లభ్యమవుతున్నది. రెండవ గ్రంథం యొక్క సంస్కృత మూలం లభ్యం కాదు. కాని చైనా భాషానువాదం లభిస్తోంది. చైనా జపాను దేశాల మీద "శతశాస్త్ర" ప్రభావం అత్యధికంగా ప్రసరించింది.

చైనా దేశీయ బౌద్ధ మతానికి ఆచార్య పరంపర, సంప్రదాయ నిర్వహణ మీద విశ్వాసముంది. మగధ దేశీయుడైన మహాకాశ్యపుడు వీరి ప్రథమాచార్యుడు. అతనికి బుద్ధుడు "ధర్మం యొక్క పవిత్ర రహస్యాన్ని నిర్వాణం యొక్క రహస్యమైన హృదయాన్నీ" అందజేసినాడు.[93] బుద్ధుని ప్రియశిష్యుడూ, ఆయనకు అతి సన్నిహితుడూ అయిన ఆనందుడు రెండవ ఆచార్యుడు. ఈ అవిచ్ఛిన్నాచార్య పరంపరలో నాగార్జునుడు పదమూడవ వాడుగాను, ఆర్యదేవుడు పధ్నాలుగవ వాడుగాను పరిగణించబడ్డారు. సునిశ్చితమైన ధర్మజ్ఞానమే కాకుండా మాయా విద్యా నైపుణ్యం కూడా ఉండి, అత్యున్నతాధ్యాత్మిక జ్ఞాన శిఖరం అధిష్ఠించి యథార్థమైన ధర్మ స్వరూపాన్ని ఉపదేశించ కలిగినవాడే ఆచార్యుడు. బౌద్ధమతాన్ని సమర్థిస్తూ, దాన్ని వ్యాపింపచేయడమే ఇతని పరమధ్యేయం. నిరాడంబరమైన

సన్యాసి జీవితం గడుపుతూ, ఇతను సదాచారం చేతనూ, ఆత్మగుణాలచేతనూ తన ప్రాభవాన్ని నిలుపుకుంటూ ఉంటాడు.[94] చైనాలో ఉన్న నమ్మకం ప్రకారం మొత్తం ఇరవై నలుగురు ఆచార్యులు ఆవిర్భవించారు. రాబోయే ఆచార్యుని, వెనుకటి ఆచార్యుడు నిర్ణయిస్తూ ఉంటాడు.

బాణభట్టు హర్ష చరిత్రలో చెప్పిన దివాకరుని వృత్తాంతం గమనార్హము. విధ్యాటవులలో నివసించే దివాకర మిత్రుడనే బౌద్ధ శ్రమణకుడు నాగార్జునుని నుంచి వస్తోన్న గురుశిష్య పరంపరకు చెందినవాడట. నాగార్జునుడు పాతాళ లోకం నుంచి తీసికొని వచ్చిన ముత్యాలహారం ఆతని దగ్గర ఉండేదట. దానిని ఆతను హర్షవర్ధనునికి (క్రీ.శ 606-647) బహూకరించాడట. మధ్య భారత నివాసియైన దివాకరుడనే ఒక బౌద్ధ భిక్షువు "వజ్రచ్ఛేదిక ప్రజ్ఞాపారమిత సూత్రానికి" శ్రీదత్తుడు (లేదా గుణదుడు) వ్రాసిన వ్యాఖ్యానాన్ని క్రీ.శ. 683 ప్రాంతంలో చైనా భాషలోకి అనువదించాడు. ఈ ఇద్దరు దివాకరులూ ఒక వ్యక్తియే అని చెప్పవచ్చునేమో అనిపిస్తున్నది. నాగార్జునుడు మొదలుకొని ఏడవ శతాబ్దం వరకూ అవిచ్ఛిన్నమైన ఆచార్య పరంపర ఉన్నదని చెప్పడం అసంభావ్యం కాదు.

నందుడు, సంఘుడనే ఇద్దరు ఉత్తమ భిక్షువులు నాగార్జునుని శిష్యులుగా ఉండేవారు అని మంజుశ్రీ మూలకల్పం తెలుపుతూంది. ఇత్సింగ్ నాగుడనే మరొక శిష్యుని పేరు కూడా పేర్కొన్నాడు. కృష్ణా జిల్లాలోని నందిగామంలో, భిక్షు సంఘానికి చెందిన ఆనందుడనే భిక్షువు యొక్క పర్యవేక్షణలో సిరివీర పురిసదాత అనే రాజు రాజ్యం చేస్తూన్న కాలంలో శ్రీపర్వతం మీద ఉన్న మహాచేత్యాన్ని పునరుద్ధరించడం జరిగిందని పురావస్తు శాస్త్రీయాధారాల ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలోనే నాగధరుడనే మరొక భిక్షువు కూడా అక్కడ జరిగిన నిర్మాణ కార్యక్రమాన్ని నడిపించినట్లు శిలా శాసనాల (విలేఖనాల) ద్వారా తెలుస్తోన్నది. ఆ విలేఖనాలలో చెప్పబడిన ఆనంద నాగధారులే వాఙ్మయ మౌలికాధారాలలో నాగార్జునుని శిష్యులుగా చెప్పబడిన నంద, నాగులు అయి ఉండవచ్చునని సుబ్రహ్మణ్యం చేసిన ఊహ సత్యదూరం కాదు. జగ్గయ్యపేటలోని ఒక విలేఖనంలో నాగార్జునునికి జయప్రభుడనే ఒక శిష్యుడుండేవాడని చెప్పిన విషయం వెనుక తెలుసుకున్నాము.

IV

నాగార్జునుని సిద్ధాంతం - దాని ప్రభావం

భారతదేశంలో :

మనం వెనుకటి విభాగంలో చూసిన దానిని బట్టి నాగార్జున, ఆర్యదేవుల కాలం నుండి కూడా నాగార్జున సిద్ధాంతం, లేదా మాధ్యమిక సిద్ధాంతం ఉండి ఉండాలి. అయితే ఇప్పుడు లభ్యమయ్యే ఆ దార్శనికుల గ్రంథాలను బట్టి చూడగా, ఈ సిద్ధాంతం ఐదవ శతాబ్దానికి పూర్వం ఉన్నట్లు చెప్పడానికి వీలు కనబడడం లేదు. బహుశా ఐదవ శతాబ్దం ప్రారంభంలో బుద్ధపాలితుడనే ఒక దాక్షిణాత్యుడు మాధ్యమిక శాస్త్రానికి వ్యాఖ్యానం వ్రాసి, దాని ద్వారా ప్రసంగాపాదనమే సరియైన తత్త్వచింతనా పద్ధతి అనీ, ఏ తాత్త్విక దృక్పథమూ కూడా యుక్తికి నిలిచేది కాదు అనేదే నిజమైన దార్శనిక తత్త్వమనీ, (ఇది మాధ్యమిక సిద్ధాంతం) సమర్థించ దలచిన సిద్ధాంతమేదీ లేదనీ, ప్రతిపాదిస్తూ మాధ్యమిక సిద్ధాంతంలో ఒక శాఖకు ఆరంభం చేశాడు. మాధ్యమికునికి ఒక సాధ్యం అనేది లేదు. అతను ఏ సిద్ధాంతాన్నీ ప్రతిపాదించడానికి ప్రయత్నించడు. అందుచేత దేనినీ సమర్థించడానికి యుక్తులను చూపించడు. ఆరవ శతాబ్దం చివర భాగానికి గాని, ఏడవ శతాబ్దం ప్రారంభానికి గాని చెందినవాడూ, బహుశా దాక్షిణాత్యుడూ అయిన చంద్రకీర్తి ఆ శాస్త్రానికి వ్యాఖ్య వ్రాసి ఈ సిద్ధాంతాన్ని ఇంకా కొంత ముందుకు నడిపించాడు. ఇతను లోతుగాను, స్పష్టంగాను ఆలోచించగలిగినవాడు. ఇతని సంస్కృత వ్యాఖ్యానం ఒక్కటే ఆ శాస్త్రంలో సులభంగా పండితులకు లభ్యమయ్యే గ్రంథం అవడంచేత, ఇతడు చెప్పినదే మాధ్యమిక సిద్ధాంతమని వాళ్ళు గ్రహించారు. భిక్షువుగా అయిన సౌరాష్ట్ర రాజకుమారుడు, శాంతి దేవుడు (బహుశా ఎనిమిదవ శతాబ్దం ప్రారంభం), ప్రాసంగిక పద్ధతి అనుసరించినా, బుద్ధ బోధిసత్త్వుల మీద భక్తికీ, సత్ప్రవర్తనకీ,

ఆధ్యాత్మిక సంయమనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. అద్వైతుల్లో మధుసూదన సరస్వతి ఎట్టివాడో, మాధ్యమికులలో ఇతను అట్టివాడు. ఇతను రచించిన "శిక్ష సముచ్చయము", "బోధిచర్యావతారము"లు ప్రధానములు. సర్వజనాదరణను పొందిన గ్రంథాలు. బహుశా ఐదు, ఆరవ శతాబ్ద ప్రారంభానికి చెందిన భావవివేకుడు లేదా భవ్యుడు మరొక అవాంతర శాఖ ప్రారంభించాడు. ఇతను ధాన్యకటక దేశ రాజధానికి దక్షిణంగా అనతి దూరంలోని ఒక పర్వత శిఖరం మీద నివసించేవాడు. అతను ఇతర సిద్ధాంతాలన్నింటినీ నిరాకరించి మాధ్యమిక సిద్ధాంతాన్ని యుక్తి బలం చేత సమర్థించవచ్చని తాను వ్రాసిన శాస్త్రవ్యాఖ్యానంలో, ఇతర స్వతంత్ర గ్రంథాలలో ప్రతిపాదించాడు. మాధ్యమికమనేది నిశ్చితమైన స్వతంత్ర స్వరూపం గల సిద్ధాంతమనీ, యుక్తి బలంతో దీనిని సమర్థించవచ్చుననీ ఇతని అభిప్రాయం. పైన చెప్పిన అవాంతర శాఖ వారు బౌద్దేతర మతాలన్నింటినీ, స్థవిరవాదంతో సహా అసత్యాలని కొట్టివేయగా, భావవివేకుడు అవన్నీ అసంపూర్ణ సత్యాలనీ నిర్వాణం పొందే అధికారం శూన్య వాదులకే కాక ఇతరులకు కూడా వున్నదనీ అంగీకరించాడు. పై శాఖ వారి సిద్ధాంతంలో పిడివాదమెక్కువ. ఈ శాఖ విశాల దృక్పథం కలది. భావవివేకుడు సకల శాస్త్ర నిష్ణాతుడుగాను, వాద చతురుడుగాను ప్రసిద్ధి చెందడం మాత్రమే కాక ఆధ్యాత్మికంగా ఉన్నతి చెందిన వ్యక్తి అని హ్యూయన్‌త్సాంగ్ వ్రాశాడు. అయితే టిబెట్ పండితుడైన ఖాఇడుబ్ సూచించినట్లు ఈ రెండు సిద్ధాంత శాఖలూ కూడా పాక్షిక మాధ్యమికాలే, నాగార్జున ఆర్యదేవుల సిద్ధాంతమే సర్వాంగపూర్ణ మాధ్యమిక సిద్ధాంతము.

ఇవే కాకుండా ఇంకా కొన్ని మాధ్యమిక సిద్ధాంత వ్యాఖ్యలు ఉన్నాయి. క్రీ.శ.640 ప్రాంతంలో నలందా విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడుగా ఉన్న సింహరశ్మి, నాగార్జునుని సిద్ధాంతం విజ్ఞానవాదం కాదని, అది సందిగ్ధతావాదం అనీ అన్నాడు. నలందలో ఆగంతుక విద్వాంసుడుగా ఉన్న త్రిపిటకుడు అనే ఒక చైనా పండితుడు ఈ వాదాన్ని ఖండిస్తూ ఒక గ్రంథం వ్రాసి, నాగార్జునుని వాదం విజ్ఞాన వాదమే అని నిరూపించాడు.* క్రీ.శ.673 మొదలు పది సంవత్సరాల పాటు నలందాలో ఉన్న ఇత్సింగ్ మగధలో ఉన్న బౌద్ధులను గూర్చి వ్రాస్తూ వారు వినయాన్ని నిర్లక్ష్యం చేసి, పూర్తిగా శూన్యవాద పరిశీలనలో నిమగ్నులై

---

* ఎ.డబ్ల్యూ.వాలే 'ది రియల్ త్రిపిటిక', లండన్

ఉన్నారని చెప్పాడు. దీనిని బట్టి గుజరాత్‌లో వల్లభి విశ్వవిద్యాలయం సంమితీయ బౌద్ధ సంప్రదాయానికి నిలయమైనట్లుగా, నలంద మాధ్యమిక సిద్ధాంతానికి పెట్టనికోటగా అయినదనిపిస్తుంది. మాధ్యమికాచార్యులలో చాలా మంది దాక్షిణాత్యులే అయినా దక్షిణ దేశంలో గట్టి మాధ్యమిక సిద్ధాంతాధ్యయన కేంద్రం ఏదీ బయలుదేరక పోవడం ఆశ్చర్యకరంగా ఉంది.

మైత్రేయుడు, అసంగుడు నాగార్జునుని గ్రంథాలకు వ్యాఖ్యానాలు వ్రాశారు, అతని చేత ప్రభావితులయ్యారు. అయినా వారు విజ్ఞనవాదమనే పేరుతో మరొక వాదాన్ని స్థాపించారు. అయితే దీనితో కూడా నాగార్జునుడు చెప్పిన మౌలిక సిద్ధాంతాలను అంగీకరించారు. క్రీ.శ.405కు పూర్వమే అశ్వఘోషుడు (ఇతను ఆ ప్రసిద్ధ మహాకవి అశ్వఘోషుడు కాదు) "మహాయాన శ్రద్ధోత్పాదన" మనే గ్రంథంలో మాధ్యమిక, విజ్ఞాన వాదాల మధ్య అద్భుతమైన సమన్వయాన్ని ప్రతిపాదించాడు. ఎనిమిదవ శతాబ్దంలో శాంతరక్షిత, కమలశీలులు ఈ రెండింటికి మధ్య సమన్వయం కుదిర్చే ఒక దార్శనిక సంప్రదాయాన్ని నెలకొల్పారు. ఈ సమన్వయాత్మకమైన దర్శనమే నలంద, విక్రమశిలా విద్యాలయాల్లో నాటి నుంచి, క్రీ.శ. 1200 ప్రాంతంలో అవి ధ్వంసం చేయబడినంత దాకా అభివృద్ధిలో ఉండేది.

వజ్రయాన, హఠయోగ, సిద్ధ సంప్రదాయాల మీద శూన్యవాదానికి ఉన్న ప్రభావాన్ని వివరించినాము. ఈ మాధ్యమిక సిద్ధాంత ప్రభావం అద్వైత వేదాంతం మీద, దాని ప్రారంభ దశలోనూ (గౌడపాదుడు) శాస్త్రవాదాభివృద్ధి దశలోనూ* (శ్రీహర్షుడు) ప్రసరించిందనడంలో సందేహం లేదు. గ్రంథాలు, గ్రంథాంశాలనూ కూడా పారమార్థిక సత్యప్రతిపాదకములు, వ్యావహారిక సత్య ప్రతిపాదకములుగా విభజించడమూ, సత్యాన్ని పారమార్థిక సత్యము, ప్రాతిభాసిక సత్యము అని విభజించడమూ, మాయావాదము, అన్నింటికంటె ప్రధానంగా దృశ్య నిరాకరణము మొదలగు ఈ విషయాలన్నీ ముందుగా మాధ్యమిక సిద్ధాంతంలోనే ప్రతిపాదించ బడ్డాయి. పశ్చాతానమై అద్వైత వేదాంతం పూర్వమున్న సిద్ధాంతాల నుంచి విషయాల్ని గ్రహించి వాటిని ఉపనిషత్ సిద్ధాంతానుగుణంగా మలుచుకున్నదని చెప్పకుండా ఉండడం కుదరదు.

---

* "మహోపనిషత్" మొదలయిన కొన్ని అర్వాచీనాలైన చిన్న ఉపనిషత్తులలో బ్రహ్మాను 'శూన్యం' అని పేర్కొనడం కనబడుతుంది.

చైనాలో :

బౌద్ధమతం క్రైస్తవ శకారంభంలో చైనాలో వ్యాపించింది. "దాదాపు వెయ్యి సంవత్సరాల పాటు చైనా దేశీయుల ఆలోచనా విధానం బౌద్ధమతం చేత అత్యధికంగా ప్రభావితం అయింది". మహాపండితుడైన కుమారాజీవుడు భారతీయ వైదేశికునకు, కుచదేశ రాజకుమారి యందు జన్మించిన పుత్రుడు. కాశ్మీరులోను, కాష్గర్‌లోను విద్యాభ్యాసం చేశాడు. పందొమ్మిది సంవత్సరాల పాటు కుత్సాంగ్(కాన్సు)లోనూ, తరువాత పదకొండు సంవత్సరాల పాటు చ్ఇన్‌కూ రాజధానియైన చియాంగ్ అన్‌లోను నివసించాడు. అక్కడ (ఛియాంగ్ అన్‌లో) చక్రవర్తి మన్ననలు పొందాడు. మాధ్యమిక శాస్త్రం, ద్వాదశముఖ శాస్త్రం, శత శాస్త్రములనే మూడు గ్రంథాలను చైనా భాషలోకి అనువదించడం ద్వారా మాధ్యమిక సిద్ధాంతాన్ని చైనాలో ప్రవేశ పెట్టాడు. ఇతను ప్రజ్ఞా పారమితా శాస్త్రాన్ని ఇంకా అనేక గ్రంథాలనూ కూడా సంపాదించి అనువదించాడు. అనతి కాలంలోనే మొదటి మూడు శాస్త్రాలను ఆధారంగా చేసుకొని "సన్‌లన్' (గ్రంథత్రయ ప్రస్థానం) అనే ఒక దార్శనిక స్థానం ఆవిర్భవించినది దానికి "క్ ఉంగ్ త్సుంగ్", అనగా "శూన్య వాదం" లేదా "మాధ్యమార్గ వాదం" అని కూడా పేరు. హయి -యువాన్, సెంగ్ జూ ఇ, టో షెంగ్, సెంగ్ ఛా జీ అనే వారు చైనా దేశంలోని మొదటి మాధ్యమికులు, ఆ నలుగురూ కుమారాజీవుని సమకాలికులే. మొదటి వాడు ఆతనితో పత్ర వ్యవహారం జరిపిన అనుయాయి. మిగిలిన ముగ్గురూ ఆతని శిష్యులు. టో షెంగ్ ఎన్నో నూతన సిద్ధాంతాలు ప్రవేశపెట్టాడు. అయితే మాధ్యమిక సిద్ధాంతంలో టో సిద్ధాంతాన్ని సమన్వయించి నియమబద్ధంగా ఒక దార్శనిక సిద్ధాంతాన్ని రూపొందించినవాడు సేంగ్‌చాజ్. ఈ సిద్ధాంతంలో అందరికంటె చాలా ప్రధానమైన వాడు చిత్సాంగ్ (549-623). ఇతని తండ్రి పార్థియా దేశీయుడు, తల్లి చైనా దేశీయురాలు. ఇతను చైనా బౌద్ధ మతాన్ని క్రమబద్ధం చేసిన గొప్ప వ్యక్తి".[95] ఇతను సూయీ మరియు త్ అంగ్ పాలకుల మన్ననలందుకొన్న పండితుడు చిత్సాంగ్, టో మతానుయాయుల్ని ఉదాహరించినా, అతను ప్రతిపాదించిన తత్త్వశాస్త్రం "పూర్తిగా భారతీయ దృక్పథానుసారం చెప్పబడింది". షన్‌లన్ చైనాలో "ఎంతో ప్రధానమైన స్థానం ఆక్రమించింది". నాలుగవ శతాబ్దం నుంచి, చిత్సాంగ్ కాలం నుంచి ఇది ఆ దేశంలో అతి ప్రధానమైన దార్శనిక సిద్ధాంతంగా విరాజిల్లింది. తొమ్మిదవ

శతాబ్దంలో దీని ప్రభావం తగ్గిపోయింది. ఐదవ శతాబ్దం నుంచి ఏడవ శతాబ్దం వరకూ కూడా, ఈ సిద్ధాంతం తన ప్రతిస్పర్ధి సిద్ధాంతమైన వీషిహ్ (విజ్ఞాన) వాదంతో కలసి "చైనా దేశీయుల ఆలోచనా ధోరణి మీద రాజ్యం చేసింది".[96]

టియాన్-టాయ్, హువా-యెన్, చెన్‌యెన్ మొదలైన చైనాదేశంలోని ఇతర బౌద్ధ సంప్రదాయాల మీద కూడా మాధ్యమిక సిద్ధాంత ప్రభావం ప్రసరించింది. చిహీ-ఇ (538-597) టియాన్-టాయ్ సంప్రదాయాన్ని స్థాపించాడు. "చెప్పాలంటే, ఇది భారతీయ నాగార్జునుని బౌద్ధ సిద్ధాంతాల, చైనా దేశీయావిష్కరణము" (Tsukamoto, in K.W. Mogen (ed); The Path of the Buddha. p.201-2). "చ్-అన్" (ధ్యాన) సంప్రదాయం, దామోలిన్ చెప్పినట్లు, నాగార్జునునిన్ని ఆచార్యులలో పరిగణించింది. "శాక్యమునితో ప్రారంభమయిన సుదీర్ఘ సాక్షి శృంఖలలో ఇతను అత్యంత ప్రాధాన్యం గల భారతీయ సంధి, ఆతని ద్వారా, అభావ పక్షమూ (Negativism), విరోదాభాస (Paradox), సహజాంతర జ్ఞానము (Intuition), తథాత, ఇవన్నీ చ్-అన్" లో ప్రవేశించాయి.[97] సర్ ఛార్లెస్ ఇలియట్ విశదీకరించినట్లు "చ్-అన్" సంప్రదాయ స్థాపకుడు (520-526 ప్రాంతం) "బోధిధర్ముడు ప్రతిపాదించిన మూల సిద్ధాంతం, అనగా, బోధి చిత్తమనేది బుద్ధుని ప్రధాన లక్షణం. ఇది ప్రతి వ్యక్తిలోనూ నిగూఢ శక్తి రూపంలో ఉంటుంది. అందుచేత ప్రతి ఒక్కనికి బుద్ధునితో అభిన్నత్వం ఉన్నది. దీనిని అంతర్దృష్టి ద్వారా గ్రహించవచ్చును" అనేది, నాగారునుని గ్రంథానువాదమైన "పువుత్‌య్-హీన్-లీ-ష్నియాంగ్-లున్" అనే గ్రంథం నుంచి గ్రహించబడింది. జోసఫ్ ఎడ్కిన్ చాలా కాలం క్రితమే ఈ విధంగా అన్నాడు- "చైనా దేశీయ నిగూఢ తత్త్వ సంప్రదాయాలను బోధిధర్ముడు స్థాపించినాడనేది నామమాత్రమే. నిజానికి, వాస్తవంలో వాళ్ళకి ఆలోచించడానికి ప్రేరణ కలిగించిన తత్త్వ చింతకుడు నాగార్జునుడే".[99] చ్-అన్ సంప్రదాయం చైనా దేశీయుల ఆలోచన పద్ధతి మీదా, జీవిత విధానం మీదా, వాఙ్మయం మీదా, కళల మీదా, కొన్ని శతాబ్దాల పాటు అత్యద్భుతమైన ప్రభావం ప్రసరింపజేసింది.

సుదూర ప్రాచ్యదేశాల్లో ఉన్న అమితాభ సంప్రదాయం వారు నాగార్జునుడు తమ ప్రథమాచార్యుడనీ, వసుబంధువు రెండవ వాడనీ భావిస్తారు. చైనా వారికి రెండవ శతాబ్దం నుండి కూడా అమితాభ సంప్రదాయ గ్రంథాలతో పరిచయం

ఉన్నది. అయితే అమితాభారాధాన బోధించే "చింగ్–థూ"* ('సుఖవతి', పవిత్ర భూమి) సంప్రదాయాన్ని హుయి యువాన్ (333–418) స్థాపించాడు. ఈ సంప్రదాయానికి చెందిన కొందరు ప్రధాన ప్రచారకులు ప్రారంభంలో సాన్‌లన్ ఈ సంప్రదాయానుయాయులుగా ఉండి కాలాంతరంలో అమితాభ సంప్రదాయానుయాయులైనారు. అమితాభుని పై భక్తిచేత నిర్వాణం లభిస్తుందని అమితాభ సంప్రదాయం వారి సిద్ధాంతం. ఆతని అనుగ్రహం ద్వారా సుఖవతి అనే స్వర్గం చేరుకోవడమే వారి పరమ లక్ష్యం. నాగార్జునుని "సుహృల్లేఖ"లో అమితాభ సంప్రదాయం స్పష్టంగా సమర్థించబడింది.

జపాన్‌లో :

బౌద్ధ మతం జపాను దేశంలో 538లో (లేదా 552) కొరియన్ దేశీయుల చేత ప్రవేశపెట్టబడింది. నిజంగా జపాను దేశంలో బౌద్ధ మతానికి పునాదులు వేసినవాడు షోటోకు (572–621) అనే రాజకుమారుడు ముప్పై సంవత్సరాల పాటు రాజ సంరక్షకుడుగా ఉండి జపాన్ నాగరికతకు జపాన్ దేశ సమైక్యానికి పునాదులు వేసినవాడు ఇతను.[100] ఆ కాలానికి చెందిన అత్యుత్తమ పండితులలో ఒకడైన ఇతను వేలెత్తి చూపడానికి వీలులేని పవిత్ర జీవితం గడిపాడు. బహుశా ఇతను జపాను దేశ చరిత్రలో అత్యుత్తముడూ, దేశహితైక తత్పరుడూ అయిన పాలకుడు.[101] ఇతను బౌద్ధ మతాన్ని రాజ్యమతంగా చేశాడు. త్రిగ్రంథ దార్శనిక సంప్రదాయం (దీనికి జపాను భాషలో "సన్‌రన్" అని పేరు)లో నిష్ణాతుడైన ఇతను "జపాను దేశంలో తాత్త్విక చింతనకు మార్గదర్శకుడయ్యాడు.[102] "జపాను దేశీయ బౌద్ధమతం నాగార్జున, వసుబంధు, శాంతిదేవుల మత సంతతికి చెందినదని నిశ్చితమైంది" అని సర్ చార్లెస్ ఇలియట్ వ్రాశాడు. చైనాలో ప్రచారంలో ఉన్న అన్ని బౌద్ధ సంప్రదాయాలూ జపానులో కూడా వ్యాపించాయి. అయితే వీటిలోనూ "చ్–అన్", (జపాను భాషలో 'జెన్') "చిన్‌గ్‌ట్ ఉ" (జపాన్ భాషలో 'జోడో') సంప్రదాయాలు అధిక ప్రచారం పొందినవని చెప్పడం సత్యదూరం కాదు. అమితాభారాధన దానికి సంబంధించిన గ్రంథాలు జపాన్ దేశంలో కనీసం క్రీ.శ. 640 నుంచి తెలిసినవే అయినా, జోడో సంప్రదాయాన్ని ఆ దేశంలో

---

* చైనా భాషలో దీని పూర్తి పేరు 'ఆనందమయమైన పవిత్ర భూమి'

స్థాపించిన వాడు గెంకు లేదా హోవెన్ (1133-1212). జెన్ సంప్రదాయం ప్రప్రథమంగా జపానులో 1191 వ సంవత్సరంలో స్థాపించబడింది. కాలక్రమేణ ఇది ఆ దేశపు నాగరికత మీదా, ఆలోచనా పద్ధతుల మీదా, జీవన విధానం మీదా అత్యధిక ప్రభావాన్ని ప్రసరింపచేసినది.

టిబెట్‌లో :

బౌద్ధమతం క్రీ.శ. 620-649 ప్రాంతంలో టిబెట్ చేరింది. త్రి స్రాంగ్ ఇడెబ్‌స్తాన్ అనే రాజు పరిపాలనా కాలంలో (755-797) లాసాలో జరిగిన ఒక సమావేశంలో, కమలశీలుడు, నాగార్జునుని సిద్ధాంతం ఒక్కటే ప్రామాణికమూ, సంప్రదాయ సిద్ధమూ అయిన మతం అంటూ స్థాపించాడు.[104] అప్పుడా రాజు "టిబెట్ దేశీయులందరూ ఇటుపైన మహాయానాచార్యుడైన నాగార్జునుడు బోధించిన మాధ్యమిక సిద్ధాంతాన్ని అనుసరించాలి" అని శాసించాడు.[105] కాని, వాస్తవంలో, టిబెట్ దేశంలో వ్యాపించింది అత్యధిక తాంత్రిక విధానాలతో కూడిన మాధ్యమిక, విజ్ఞానవాద సమన్వయాత్మక బౌద్ధమతం. ఈ నాటికీ లామాలు అనుసరించే మతం ఇదే.

కొరియ - మంగోలియాలు :

నాలుగవ శతాబ్దంలో, బౌద్ధమతం చైనా నుంచి మంచూరియా ద్వారా కొరియా చేరుకున్నది. ఇది చైనా దేశీయ బౌద్ధమతంతో ముడిపడి ఉండిపోయింది. రెండు దేశాలలోనూ కూడా పన్నెండవ శతాబ్దం నుంచి చ్-ఆన్ ప్రధాన సంప్రదాయంగా ఉన్నది. పదమూడవ శతాబ్దంలో మంగోలియా దేశం టిబెట్ దేశీయ బౌద్ధమతం స్వీకరించి, మొన్న మొన్నటి వరకూ దానినే అనుసరించింది.

V

నాగార్జునుని ఉపదేశాలు

ఈ గ్రంథం నాగార్జునుని జీవిత చరిత్ర మాత్రమే చెప్పడానికి ఉద్దిష్టమయినది. దీని చివర ఇచ్చిన ఉద్ధరణలు అతని సిద్ధాంతాన్ని అతని మాటల్లోనే, సంక్షిప్త రూపంలో వివరిస్తున్నాయి. అందుచేత అతని సిద్ధాంతం ఏదో స్థూలంగా ప్రతిపాదించడానికే నేనిక్కడ ప్రయత్నిస్తున్నాను. టి.ఆర్.వి.మూర్తి రచించిన "బౌద్ధమతంలోని ప్రధాన తత్త్వం" (The Central Philosophy of Buddhism, London, 1955) అనే గ్రంథంలో మాధ్యమిక సిద్ధాంతాన్ని గూర్చి అతి విస్తృతంగా ప్రతిపాదింపబడింది. వెంకటరామన్ వ్రాసిన ఏక విషయక గ్రంథాన్ని గూర్చి ముచ్చటించి ఉన్నాము. ఆర్.హెచ్.రాబిన్సన్ వ్రాసిన "ప్రాచీన మాధ్యమికము" (Early Madhyamika) చెప్పుకోదగిన ఉత్తమ గ్రంథం. స్ట్రెంగ్ "శూన్యత్వము" (Emptiness) అనే గ్రంథంలో శూన్యతను గూర్చి అతి సూక్ష్మ పర్యాలోచన చేశాడు. నాగార్జునుని ఉత్తమ గ్రంథానికి, విస్తృత భూమికతో ఇతను చేసిన అనువాదం ఉత్తమ శ్రేణికి చెందిన పాండిత్య శోభితమైన ఉత్తమ గ్రంథం. అయితే యస్. రాధాకృష్ణన్ సంక్షిప్తంగానూ, మనోహరంగానూ, సుస్పష్టంగానూ చేసిన ఏతత్సిద్ధాంత ప్రతిపాదనం, నేటికి కూడా అన్నిటిలోకి అత్యుత్తమమైనదిగా పరిగణింపదగినదే. (Indian Philosophy, 1941, Vol I pp. 643-669, 697-703).

నాగార్జునుని సిద్ధాంతం "ఉన్నది" అనే నిశ్చితమైన అవధారణ జోలికికాని, "లేదు" అనే నిశ్చితమైన నిషేధం జోలికి గాని వెళ్లదు. చైతన్యం (ఆత్మ) అనేది ఒకటున్నదని సాధారణంగా చెప్పదు. అది లేదు అని నిషేధించదు. ఇది పదార్థాల్ని ఉన్నవి ఉన్నట్లుగా గ్రహించడానికీ, సూక్ష్మదృష్టితో పరిశీలించడానికి ప్రయత్నిస్తుంది. ఇది 'మధ్య మార్గం' లేదా 'మధ్య సిద్ధాంతం'. ఇది సత్యతావాదమూ కాదు,

విజ్ఞాన వాదమూ కాదు. శూన్యవాదం అసలే కాదు. దేనికీ స్వాభావికమైన సత్త అనేది లేదు. ప్రతి వస్తువు యొక్క స్థితీ కూడా ఇతర వస్తువులతో దానికున్న సంబంధం పై ఆధారపడి ఉంటుంది. స్వతంత్ర సత్త దేనికి లేదు. "భావః స్వతంత్రో్ నాస్తి" ఏదీ కూడా స్వయంపరిపూర్ణ పదార్థం కాదు. మనం వ్యవహరించే దృశ్య పదార్థాలన్నీ విభిన్నావయవ (ధర్మ) నిర్మితములు. ఈ చర్మావయవాలకు (ధర్మాలకు) కూడా సారంగాని ఆత్మకాని లేదు. స్థిరత్వం కాని, క్షణికత్వం కాని లేదు. అన్ని పదార్థాలూ ఒక దానితో ఒకటి కలిసి, ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. ఈ పరస్పర సంబంధం చేతనూ, ఈ పరస్పర సమాశ్రితత్వం చేతనూ వాటికి ఒక స్థితి (ఉనికి) లభిస్తుంది. తమ ఉత్పత్తికి ఉనికికి కూడా ప్రతి వస్తువూ ఇతర వస్తువుల పై ఆధారపడి ఉండడం వల్లనే వాటికి శూన్యత్వం ఏర్పడుతుంది. ఈ విధంగా ప్రతి పదార్థమూ, తన స్థితికి సంబంధించినంత వరకు ఇతర సంబద్ధమైన, ఇతరాశ్రితమై ఉండడమే కాదు; ఏ పదార్థానికి కూడా నిర్ణీతమూ, అసాధారణమూ, నిత్యమూ అయిన స్వరూపం అనేదీ లేదు. దేనికి స్వీయమైన సారంకాని, ఆత్మకాని లేదు. పదార్థాల 'నైస్స్వాభావ్యం' అనగా ఇదే. ఈ ప్రపంచం నిరంతరం పరిణామ రూపం. పదార్థాలు నిరంతరం పరిణామం చెందుతూనే ఉంటాయి. అవి పుట్టించబడినవి, పుట్టిస్తాయి. అవి పనిచేస్తూ ఉంటాయి, వాటి మీద పని జరుగుతూ ఉంటుంది. అవి ఆవిర్భవిస్తాయి, అంతర్ధానం చెందుతాయి. అందుచేత ప్రపంచంలో ఉన్న ఏ వస్తువుకీ, మొత్తం ప్రపంచానికీ కూడా స్వీయసత్త అనేది లేదు. స్వీయసారం లేదు. నిత్యమూ, అసాధారణమూ అయిన స్వభావం లేదు. కొన్ని పరిస్థితుల మీద ఆధారపడి, స్వీయ సత్తను పరస్పర సహాయంతో పొందుతూన్న పదార్థాలేవీ సత్యమైనవి కావు. పదార్థాల ఈ ప్రతీత్యసముత్పాదం కేవలం సంవృతి మాత్రమే, అనగా కనబడడం మాత్రమే. ప్రపంచం సంబంధాత్మకమయితే ఈ సంబంధాలు బుద్ధి గ్రాహ్యాములు కావు. సంబంధం, సంబంధి రూపమూ కాదు, తద్భిన్నమూ కాదు. దీనిని విడిచి పెట్టడం కూడా శక్యం కాదు. సంబద్ధములైన పదార్థాలు ఒకదానితో ఒకటి కలిసిఉండవు, వేరు గాను ఉండవు. మనం చెప్పే పదార్థాలూ మన వ్యవహారానికి ఉపయుక్తములయ్యే భావాలూ కూడా ఆత్మ(స్వ) విరుద్ధమైనవి. అందుచేత నిర్వచించ శక్యం కానివి. అవి ఉన్నా సత్యమైనవి కావు. అందుచేత "మరణం లేదు; పుట్టుక లేదు; భేదాలు లేవు; స్థిరత్వం లేదు; ఏకత్వం లేదు; అనేకత్వం లేదు, రావడం లేదు, వెళ్లడం లేదు".

అనుభవాలన్నింటినీ సునిశిత దృష్టితొ పరిశీలించి అవయవాలైన పదార్థాల వాస్తవ స్వరూప ప్రత్యవేక్షయే ప్రజ్ఞ. ఈ ప్రత్యవేక్ష వల్ల తెలియవచ్చేదేమిటనగా, పదార్థాలు శాశ్వతములూ కావు, అశాశ్వతములు కావు. ఒక స్వరూపం ఉన్నవీ కావు, లేనివీ కావు. అందుచేత ఇది "ఉండడం–లేకపోవడం, స్థితి–నిష్పత్తి, ఆత్మ–నైరాత్మ్యము" అనే ద్వైతభావాలేవీ లేని అంతర్దృష్టి రూపమైన అద్వయతత్త్వం.

అయితే ఒక తత్త్వం ఉన్నది. అది బుద్ధి గోచరం కానిది. అనవచ్ఛిన్నము. ప్రశాంతము, అనిర్దేశ్యము, అప్రపంచితము. ఉత్పత్తి వినాశరహితమైన ధర్మతా సత్యము. ఇది స్థితి అని కాని, నిష్పత్తి అని కాని, చైతన్యమని కాని, అచేతనమని కాని, ఏకమని కాని, అనేకమని కాని, ఉహించశక్యం కానిది. ఇది సమస్త ధర్మాల (పదార్థాల) నిస్స్వభావతారూపమైన పరమార్థ సత్యం– "పరమార్థః సర్వ ధర్మాణాం నిస్స్వభావతా". ఇంద్రియాల ద్వారా, విజ్ఞాన శాస్త్రం ద్వారా మనం చూచేది కాల్పనిక దృశ్య సత్యం(లోక సంవృతి). పారమార్థిక సత్యం కూడా విశేషము, సార్థక్యము, భేదము, సంబంధము, ధర్మాలు లేనిదవడం చేత శూన్యమే. ఈ విధంగా ప్రపంచం ఒక అర్థంలో శూన్యమైతే, పారమార్థిక సత్యం కూడా మరొక అర్థంలో శూన్యమే.

అందువలన పారమార్థికము–దృశ్యము, మోక్షము–బంధము, నిర్వాణము –సంసారము అనే ద్వంద్వాలు లేవు. ఏది నిర్వాణమో అదే సంసారము బుద్ధుడే పునర్జన్మలెత్తుచున్న వ్యక్తి. పరోక్షమే ప్రత్యక్షము. నిర్వాణమనగా సర్వకల్పనా క్షయము. ఇదీ శూన్యతా దృష్టితో చెప్పిన విషయం. అయితే శూన్యతా దృష్టి అనేది ఇతర దృష్టులవంటిది కాదు. ఇది అన్ని దృష్టుల నుంచీ విముక్తి కలిగించే దృష్టి. "ముక్తిస్తు శూన్యతా దృష్టే స్తదర్థాశేష భావనా" సత్యాలలో సత్యం శూన్యత్వం. ఈ శూన్యత్వ సాక్షాత్కారమే నిర్వాణం.

నాగార్జునుని సదాచారము, రాజనీతి కూడా చాలా ప్రధానమైనవి. సత్యం, కరుణలు అన్ని ప్రవృత్తులకూ మూల ప్రేరకాలుగా ఉండాలి. ఇతరులకు ఏది సర్వహితమో అదే సత్యం. హిందూ అర్థశాస్త్రంలో వలె కాక నాగార్జునుడు నైతిక ప్రవర్తనను ఆధారంగా చేసుకున్న రాజపాలనా విధానానికీ, దయను ఆధారంగా చేసుకున్న న్యాయనిర్ణయానికి ప్రాధాన్యం ఇస్తాడు. నియమోల్లంఘనం చేసిన వానినీ, అపరాధినీ, పాపాత్మునీ కూడా అన్ని విధాలా మంచి దారికి తీసికొని రావడానికి ప్రయత్నించాలి. ఉద్ధరింప శక్యం కాని వాడెవ్వడూ లేడు. దండనం

ఎన్నడూ కఠినంగానూ, మానవతా రహితంగానూ ఉండకూడదు. అపరాధిని బాగుచేయడమూ, ఆతని స్వభావంలో మంచి మార్పు తీసుకొని రావడమూ అనేవి దండన లక్ష్యాలుగా ఉండాలి. ఈ విషయాలన్నీ రాబోయే ఉద్ధరణలలో స్పష్టం అవుతాయి.

"పూర్తిగా ఆధ్యాత్మిక జీవనానికి కట్టుబడి ఉన్న భిక్షువు కూడా ఏ లోపమూ లేని నైతిక మార్గాన్ని అనుసరించజాలడు. అలాంటప్పుడు లౌకిక వ్యవహారంలో తలమునిగి ఉన్న మానవునికి ఇది సర్వథా అసాధ్యం" అని నాగార్జునుడు తన "సుహృల్లేఖ"లో (118f) అంటాడు. అత్యుత్తమ ఆదర్శంగా గ్రహించిన నైతిక పరమోన్నతిని దృష్టిలో పెట్టుకొని, తనలో ఉన్న నైతికదోషాల విషయంలో ఎవరూ ఎక్కువగా బాధపడాల్సిన పనిలేదు. ప్రతి ఒక్కరూ బుద్ధత్వం సంపాదించే దృఢ సంకల్పంతో, తనకు శక్యమైనంత వరకు నైతిక నియమాలను శ్రద్ధగా పాటిస్తూ ఇతరులలో ఉన్న సద్గుణాలనూ, మంచితనాన్నీ చూసి సంతోషిస్తూ ఉండాలి. ఏ నాటికైనా ప్రతి ఒక్కరూ నిర్వాణం పొందడం అనేది తథ్యం. "బుద్ధుడు కరుణా ప్రజ్ఞా స్వరూపుడు, సకల ప్రాణి సముద్ధరణకై దీక్ష వహించినవాడు" అనే భావానికి ఫలితంగా ఆవిర్భవించనున్న మరొక సిద్ధాంతాన్ని నాగార్జునుడు తన గ్రంథాలలోని కొన్ని ఖండికలలో సూచించాడు. తీవ్రమైన ధ్యానాధ్యాత్మిక సాధనల ద్వారా, నైతిక జీవన విధానం ద్వారా, ఒక వ్యక్తి తనను తాను ఉద్ధరించుకోవచ్చును. ఇది చాలా కష్టమైన మార్గం (జపాన్ భాషలో 'నాన్‌గ్యో') ఈ మార్గం ద్వారా బుద్ధత్వం సంపాదించే సరికి వేలకొలది సంవత్సరాలు పట్టవచ్చును. ఈ విధంగా స్వశక్తిచేత సంపాదించిన మోక్షం 'స్వయం మోక్షం' (జిరికి). ఇదికాక సులభమైన మార్గం(ఇగ్యో) మరొకటి ఉన్నది. నైతికంగా తనలో ఉన్న లోపాలనూ అజ్ఞానాన్నీ గుర్తించి, భక్త జనోద్ధరణంలో అమితాభునికి ఉన్న అనంత ప్రభావం విషయంలో పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండడమే ఈ మార్గం. అమితాభుడు చేసిన సర్వసముద్ధరణ ప్రతిజ్ఞ యందూ, అతని అద్భుతశక్తి యందూ పరిపూర్ణ విశ్వాసం కలవాడూ, ఎవడైనా, ఏ దేశంవాడైనా, ఏకాలం వాడైనా, ఏ సంస్కృతికి చెందిన వాడైనా, ఎలాంటి జ్ఞానం కలవాడైనా నైతికంగా ఏ భూమికలో ఉన్నా తప్పక ఉద్ధరించబడతాడు. తనయందు భక్తి కలవానిని అమితాభుడు తన అనంత నిరవధిక దయాసముద్రంలో ముంచెత్తుతాడు. అలాంటి వానికి, దివ్యజ్ఞానం ప్రసాదించి ముక్తి కలగచేస్తాడు. ఇది ఉద్ధారకుని

శక్తి ద్వారా భక్తునికి లభించే మోక్షం (తరికి). ఇది పాలిని కాయాలలో కూడా లభించే "బుద్ధుడు శాశ్వత విజ్ఞానమూర్తి" అనే విశ్వాసమూ, మహాయానంలోని బోధిసత్త్వ సిద్ధాంతమూ పొందిన క్రమిక వికాసమే. క్రీ.శ. 150కి పూర్వం ఉన్న అమితాభ సంప్రదాయ గ్రంథాలు ఆధారంగా చేసికొని తరువాతి కాలంలో వికసించిన సిద్ధాంతంకాదు ఇది. చైనా సుదూర ప్రాచ్యదేశాలలో ఉన్న విశ్వాసం ప్రకారం మోక్షానికి 'ఇగ్యోగా' (సులభ మార్గంగా) అమితాభ భక్తిని ఇదం ప్రథమంగా బోధించినవాడు నాగార్జునుడు.

నాగార్జునుని గ్రంథాల నుండి ఉద్ధరణలు

రత్నావళి

1

1) ధర్మాన్ని సరిగా ఆచరించినట్లయితే దాని వలన ఆనందాభ్యుదయాలు కలుగుతాయి. క్రమంగా నిఃశ్రేయసం (మోక్షం) కలుగుతుంది. కొద్ది మాటల్లో చెప్పాలంటే శ్రద్ధా, ప్రజ్ఞలే ధర్మం.

2) శ్రద్ధ ఉన్నవాడు ధర్మాన్ని పట్టుదలతో ఆచరిస్తాడు. ప్రజ్ఞ ద్వారా సత్యాన్ని తెలుసుకుంటాడు. ఈ రెంటిలో ప్రజ్ఞ ప్రధానమైంది. శ్రద్ధ దాని పూర్వాంగం.

3) రాగ-ద్వేష-భయ-భ్రాంతుల వల్ల ధర్మమార్గాన్ని అతిక్రమించనివాడే నిజమైన శ్రద్ధాళువు. అలాంటివాడు అత్యుత్తమ శ్రేయస్సుకు తగినవాడు.

4) తాను చేసే మానసిక-వాచిక-కాయిక కర్మల గూర్చి ఎల్లప్పుడూ జాగ్రత్తగా పరీక్షించుకొనే బుద్ధిమంతుడు తనకూ, ఇతరులకూ కూడా హితకరమైన కార్యాలు మాత్రమే చేస్తాడు.

5) నిజమైన ధర్మం యొక్క ఉత్తమ మార్గం సుస్పష్టమైనది. దానము, శీలము, క్షమ-ఇదే ఆ మార్గం. ఆ మార్గాన్ని విడిచి కేవలం తపస్సు మాత్రమే చేసేవాడు. సంసారం*లోకి ఇంకా లోతుగా దిగిపోతాడు. కఠోర నియమ పాలనమూ, సన్యాసమూ అనేవే కదా తపస్సు? ఇలాంటి తపస్సు చేసేవాడు ఇతరులను ద్వేషించడనీ, వారికి మంచినే చేస్తాడనీ నియమం లేదు.

6) పాప, శుభకర్మలు చేయడంవల్ల ఇహపర లోకాలలో అనేక దుఃఖాలూ కష్టాలు కలుగుతాయి. కుశల, శుభ కర్మలు చేయడం వల్ల ఆనంద సుఖాలు లభిస్తాయి.

---

* జనన, మరణాల మధ్య జీవితం, ఇంద్రియ గోచార ప్రపంచం.

7) అందుచేత పాప శుభ కర్మల నుంచి నివృత్తి, మనోవాక్కాయములతో కుశల కర్మల యందు ప్రవృత్తి అని ధర్మం రెండు విధాలు.
8) దీనివల్ల మానవుడు నరక పతనం కలుగకుండానూ, భూత ప్రేత పశు పక్ష్యాది జన్మలు రాకుండానూ తప్పించుకొని, దేవతగానో మానవుడుగానో పునర్జన్మ పొందడమే కాకుండా ఆనందైశ్వర్య రాజ్యాధికారాలు పొందుతాడు.
9) సరియైన ధ్యానాదుల ద్వారా బ్రహ్మానందం వంటి ఆనందం పొందవచ్చును. ఆనందాభ్యుదయాలకు సంబంధించిన ధర్మంయొక్క సంక్షిప్తస్వరూపమిదే.
10) నిర్వాణానికి సంబంధించిన ధర్మం అతి సూక్ష్మమూ, గంభీరమూ అయిన తత్త్వజ్ఞానం. దీనిని చూసి మూఢులు భయపడతారని లోకులు చెపుతున్నారు.
11) "నేను లేను; ఉండబోను నాది అనేది లేదు; ఏదీ నాది కాబోదు" ఇలాంటి ఉపదేశం మూఢులకు భయావహంగా ఉంటుంది. కాని ఇది బుద్ధిమంతుల భయాన్ని తొలగిస్తుంది.
12) "మానవులందరూ అహంకారం నుంచి పుట్టి, మమకారంతో తగులుకొని ఉంటారు" అని విశ్వజన క్షేమం కోసం ఉపదేశం చేసే బుద్ధుడు చెప్పాడు.
13) 'నేను' 'నాది' అనే భావన పారమార్థిక సత్యదృష్టిలో మిథ్య. ఎందువల్లననగా, ఈ రెండు కూడా వస్తువు యొక్క యథార్థజ్ఞాన (యథాభూత పరిజ్ఞానం) వల్ల కలిగినవి కాదు.
14) శరీరోపాదాన కారణాలైన స్కంధాలు అహంకారం వల్ల జనించాయి. ఆ అహంకారమే సత్యమైంది కాదు. అసత్యమైన బీజం నుండి సత్యమైనది ఎలా పుడుతుంది?
15) ఈ విధంగా స్కంధాలు అసత్యములని గ్రహించినపుడు అహంకారం నశిస్తుంది. అహంకారం నశించిన తరువాత మళ్లీ స్కంధాలు ఆవిర్భవించ డానికి అవకాశంలేదు.
16) స్కంధాల గ్రహం(పట్టు) ఉన్నంత వరకూ అహంకారముంటుంది. అహంకారం ఉన్నప్పుడు కర్మ మళ్ళీ వస్తుంది. దానివల్ల పునర్జన్మ కలుగుతుంది.
17) ఆది కాని, మధ్య కాని, అంతం కాని లేని ఈ సంసార చక్రం, పరస్పర కారణాలైన అహంకారం, కర్మ, జన్మలనే మూడింటి వరుసతో తిరుగుతూ ఉంటుంది. ఇది ఆలాత మండలం (కొరవి త్రిప్పినపుడు ఏర్పడే చక్రం) వంటిది.

18) అహంకారం తనంతటతనే పుట్టినదా, మరొక దాని వలన పుట్టినదా, తనవల్ల మరొకదాని వలన కూడా పుట్టినదా అనే విషయం నిరూపించడం అశక్యము. ఇది భూతకాలంలో పుట్టినదా, వర్తమానకాలంలో పుట్టినదా, భవిష్యత్తులో పుట్టినదా అనే విషయం కూడా నిరూపించడం కష్టం. ఈ విషయం తెలియగానే అహంకారం నశిస్తుంది. తరువాత కర్మ నశిస్తుంది. తరువాత పునర్జన్మ ఉండదు.

19) ఈ విధంగా హేతు, ఫలోత్పాదాలనీ, వాటి వినాశాన్ని పరిశీలిస్తే ప్రపంచం విషయంలో అస్తికతను* (ఉన్నదనీ) గానీ, నాస్తికతను** (లేదని) గాని ప్రతిపాదించడం అశక్యం.

20) ఈ సత్యం దుఃఖాలన్నింటినీ నశింప చేస్తుంది. దీనిలోని సత్యత్వాన్ని నిరూపించుకోలేనివాడు దీనిని గూర్చి వినినట్లయితే, అజ్ఞాని అవడంచేత ఆ అభయ స్థానం (నిర్వాణం) అనే సరికి భయపడి వణికిపోతాడు.

21) "నిర్వాణంలో ఇదేదీ ఉండదు" అని చెప్పినపుడు భయపడని పక్షంలో "ఇక్కడ ఉన్నదంతా మిథ్య" అని చెప్పినప్పుడు మాత్రం ఎందుకు భయపడతావు.

22) ఆత్మకానీ, స్కంధాలు కాని లేని మోక్షం అంటే నీకు ఇష్టమైనపుడు, ఆ ఆత్మనీ స్కంధాలనీ ఇక్కడనే తొలగించివేయడానికి ఎందుకు ఇష్టపడవు?

23) నిర్వాణం అనేది నాస్తికత్వం కానపుడు, అది ఆస్తిత్వం మాత్రం ఎందుకు అవుతుంది? భావాభావ పరామర్శ క్షయమే (ఉన్నది లేదు అనే విచారణ లేక పోవడమే) నిర్వాణం.

24) సంగ్రహంగా చెప్పాలంటే శూన్యవాదం కర్మవల్ల ఏమీ ఫలం వుండదని చెబుతుంది. ఇది పాప భూయిష్ఠమూ దుర్గతి హేతువూ అయిన దురభి ప్రాయంగా పరిగణించబడుతోంది.

25) సంగ్రహంగా చెప్పాలంటే కర్మవల్ల ఫలితం ఉంటుంది అని సత్యవాదం చెబుతుంది. ఇది పుణ్యమూ, సద్గతి హేతువూ అయిన సదభిప్రాయంగా పరిగణించబడుతోంది.

26) జ్ఞానం శూన్యత్వాన్ని, సత్యత్వాన్నీ కూడా నశింపచేస్తుంది. అపుడు గుణ

---

* సర్వం ఉన్నది అని చెప్పడం "అస్తిత్వం".

** సర్వం లేదని చెప్పడం "నాస్తికత్వం"

దోషాలకీ, పుణ్య పాపాలకీ అతీతత్వం లభిస్తుంది. ఇది దుర్గతి నుంచీ సద్గతి నుంచీ కూడా మోక్షమే.

27) ఉత్పన్నమయ్యే ప్రతి వస్తువుకూ కారణం ఉండడం చూసి శూన్యతత్వాన్ని నిరాకరిస్తాడు. ఉత్పన్నమైనది దాని కారణంతో సహా నశించడం చూసి సత్యత్వాన్ని నిరూపించజాలడు.

28) ఒక కారణం కార్యం కంటె ముందు పుట్టినా, కార్యంతో పాటు పుట్టినా నిజానికి అది కారణం కాదు. వాస్తవంలో పారమార్థిక దృష్టితో చూపినా 'ఉత్పత్తి' అనేది సంగతం కాదు.

29) ఇది ఇలా అయితే అది కూడా అలా అవుతుంది; లేదా ఇది ఉన్నా లేక జరిగినా అది కూడా ఉంటుంది, జరుగుతుంది. (ఆస్మిన్ సతి ఇదం భవతి) ఉదాహరణకు పొడవైనది (లేదా పొడవు) ఉన్నప్పుడు పొట్టిది (లేదా పొట్టి) కూడా ఉంటుంది. దీపం ఉన్నప్పుడు వెలుతురు ఉంటుంది. దీపం లేకపోతే వెలుతురు అసంభావ్యం.

30) ఈ విధంగా కార్యకారణాల ఆవిర్భావాన్ని చూచినవాడు, ముఖ్యంగా ఈ ప్రపంచం ఉన్నదున్నట్లుగా దృశ్యమని అంగీకరించేవాడు, శూన్యత్వాన్ని నిరూపించజాలడు.

31) వినాశం కూడా అట్టి స్వభావం కలదే కాబట్టి అదికూడా దృశ్యమే అని గ్రహించిన వాడు సత్యత్వాన్ని నిరూపించజాలడు. అందుచేత ఈ రెండు అభిప్రాయాలనూ కూడా నిరాకరించి అతను ముక్తుడవుతాడు.

32) దూరం నుండి చూస్తే వస్తువును దగ్గరున్న వాళ్ళు స్పష్టంగా చూస్తారు. ఎండమావులు నీరే అయితే దగ్గరగా ఉన్న వాళ్ళు దానిని నీరుగా ఎందుకు చూడటం లేదు.

33) దూరంగా ఉన్నవాళ్ళు చూచినట్లుగా దగ్గరున్న వాళ్ళు ఈ ప్రపంచాన్ని చూడటం లేదు.* అందుచేత ఎండమావులలో వలె దీనిలోనూ నిశ్చితమైన చిహ్నాలు (నిమిత్తాలు) ఏమీ ఉండవు.

34) ఎండమావులు నీళ్ళవలె కనిపిస్తాయి. అయితే అవి నీరు కాదు. వాస్తవానికి

---

* ఈ ప్రపంచం లోక వ్యవహారంలో చిక్కుకున్న వారికి కనిపించడం లోనూ వివేకవంతులై దూరంగా ఉన్న వారికి కనిపించడం లోనూ తేడా ఉన్నది.

అవి మరొకటి ఏమీ కూడా కాదు. అదే విధంగా స్కంధాలు ఆత్మవలె కనిపిస్తాయి. అయితే అవి ఆత్మకాదు. వాస్తవానికి మరేమీ కూడా కాదు.

35) దూరం నుంచి ఎండమావులు చూసి, నీరు అనుకొని దగ్గరకు వెళ్ళి నీరు కాదు అనుకొన్నవాడు మూఢుడు. ఎందుచేతననగా అతను ఎండమావులు చూసిన వెంటనే అవి ఎండమావులు అని గ్రహించలేకపోయాడు కదా?

36) ఈ ప్రపంచం ఎండమావుల వంటిది. దీనిని నాస్తిగా గ్రహించినా, అస్తిగా గ్రహించినా అది భ్రాంతియే. ఈ భ్రాంతి ఉన్నంత వరకూ మోక్షం లేదు.

37) నాస్తి అనేవాడు దుర్గతి చెందుతాడు. అస్తి అనే వాని కోసం సద్గతి ఎదురు చూస్తూ ఉంటుంది. ఈ రెండు దృష్టులకూ అతీతుడు. యథాభూత పరిజ్ఞానం ఉన్నవాడవడం చేత మోక్షం పొందుతాడు.

38) కొందరు యథాభూత పరిజ్ఞానంతో అస్తిత్వ, నాస్తిత్వాలను నిర్ధారణ చేయడానికి ఇష్టపడరు. అజ్ఞానం చేత వాళ్ళ నిర్వాణాన్ని శూన్యం అంటారు. అది సత్యమే అని వారు ఎందుకు గ్రహించరో?

39) "నిర్వాణం అస్తిత్వ రూపం కాదు" అని చెప్పడంలో అది శూన్యమనే సత్యం సూచితమవుతుంది కదా, అని ప్రశ్నించే పక్షంలో "నిర్వాణం నాస్తిత్వ రూపం కదా అని, అది సత్యమైనదనే సత్యం సూచితమవుతుంది కదా" అని సమాధానం చెప్పవచ్చు.

40) ఈ తత్త్వం జ్ఞానం (బోధి) మీద ఆధారపడి ఉంది. అందుచేత దీనిలో ఒక ప్రతిపాద్య సిద్ధాంతం కాని, నైతిక మార్గం కాని, బుద్ధి కానీ లేవు. నాస్తిత్వాన్నీ అంగీకరించిన వారిని శూన్యవాదులని ఎట్లా అనడం?

41) "నీవు అస్తితానాస్తితా వ్యతిక్రమాన్ని అతీతత్వాన్ని ప్రతిపాదిస్తావా? అని ఏ తత్త్వవేత్తనయినా, సాధారణ వ్యక్తినైనా ప్రశ్నించి చూడు (అతను ప్రతిపాదించడం లేదని తెలుసుకుంటావు)

42) అందుచేత అతి గంభీరమైన ఈ అస్తితానాస్తితా వ్యతిక్రమ సిద్ధాన్తం ధర్మం వల్ల లభించిన అపూర్వ పారితోషికమని, బుద్ధోపదేశామృతం (సారం) అనీ గ్రహించు.

---

* అనగా శూన్యత్వాన్నీ, సత్యత్వాన్నీ కూడా నిరాకరించి, దేనినీ ప్రతిపాదించక, ఏ సిద్ధాంతమును అంగీకరించని వారు.

43) ఈ ప్రపంచం నశించదు; అవిర్భవించదు; క్షణమైనా ఉండదు. అందుచేత భూత కాలంలో కానీ, వర్తమానంలోకానీ, భవిష్యత్తులో కాని లేకపోవడమే దీని స్వభావం. అలాంటప్పుడు ఇది సత్యమైన పదార్థం ఎలా అవుతుంది.

44) నిజానికి ప్రపంచమూ, నిర్వాణమూ కూడా లోకంలో లేవు. అలాంటప్పుడు వాస్తవంలో ఆ రెండింటికి బేధం ఏమున్నది?

45) స్థితి అనేది లేదు కాబట్టి ఉత్పత్తిగాని వినాశం కాని ఉండడానికి అవకాశం లేదు. అలాంటపుడు ఏ వస్తువుకైనా ఉత్పత్తి స్థితి వినాశాలు ఎట్లు ఉంటాయి?

46) నిరంతరమూ పరిణామం జరిగేటప్పుడు స్థితి క్షణికం కాకుండా ఎట్లా ఉంటుంది? నిరంతర పరిణామం లేదనుకున్నా కూడా, అపుడు అవిర్భావం సత్యం ఎలా అవుతుంది?

47) ప్రతి పదార్థమూ, పాక్షికంగా కాని, పూర్తిగా కాని వినాశం పొందుతుంది (లేదా ప్రతి పదార్థమూ కూడా పాక్షిక నాశం ద్వారా కాని, సంపూర్ణ నాశం ద్వారా కాని, మార్పు చెందుతూనే ఉన్నది). అందుచేత ప్రతి పదార్థమూ క్షణికమే. అయితే రెండు విధాలా కూడా భేదం కనబడడం లేదు. అందుచేత రెండూ తర్కవిరుద్ధాలే.

48) వస్తువులు క్షణికాలే అయితే ఏ వస్తువైనా ఇది వరకున్నదే ఎలా అవుతుంది? అవి క్షణికాలు కావు. స్థితికలవే అని చెప్పినా ఏ వస్తువైనా ఇది వరకున్నదే ఎలా అవుతుంది?

49) క్షణానికి అంతమనేది ఉంటే దానికి ఆది, మధ్యా కూడా ఉండాలి. ఈ విధంగా క్షణం ఉండడానికి అవకాశం లేదు. (అనగా ప్రతీక్షణంలోనూ అవాంతర క్షణాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా సావయవం అవడం చేత క్షణం అనేది కూడా సత్యం కాదు. అందుచేత ఏదీ కూడా క్షణికం అని చెప్పడం కుదరదు).

50) క్షణాలలో ఉన్న అవయవాలకు కూడా (ఆది, మధ్య, అంతాలు) ఇలాంటి అవయవాలు మూడు ఉంటాయని చెప్పాలి. ఈ ఆదిత్వ, మధ్యత్వ, అంతత్వాలు స్వతః సిద్ధములూ కావు ఉత్పాదితములూ కావు (అనగా క్షణాలకి గాని క్షణాంశాలకీ గాని స్థితి లేదు).

51) 'ఒకటి' అని చెప్పడానికి తగిన పదార్థం ఏదీ లేదు. ప్రతీ పదార్థానికి అనేక పక్షాలు, అంశాలు ఉంటాయి. ఏ పక్షమూ, అంశమూ లేని పదార్థం లేదు.

ఏకత్వం లేక పోతే బహుత్వం ఉండదు. సత్యత్వం లేక పోతే శూన్యత్వం ఉండదు.

52) వినాశం ద్వారాకాని, నిషేధం ద్వారా కాని సత్యత్వానికి శూన్యత్వం చెప్పాలి, స్థితియే అసంభావ్యం అయినపుడు వినాశ నిషేధాలకు తావు ఏది?

53) అందుచేత వాస్తవంలో నిర్వాణ ప్రాప్తి అనగా ప్రపంచనాశం జరుగుతుందని అర్థం కాదు. అందుచేతనే ఈ ప్రపంచానికి అంతమనేది ఉన్నదా అని ప్రశ్నించినపుడు బుద్ధుడు మౌనం వహించాడు.

54) ఈ నైశ్రేయస ధర్మం అతి గంభీరము. ఏ సిద్ధాంతాన్నీ ప్రతిపాదించదు. స్వతంత్రము (అనాలయము, అనగా దీనికి మరొకటి ఏదీ ఆధారంగా లేదు. ఇది ఆధారాన్ని కల్పించదు) అని సత్యద్రష్టలైన బుద్ధులు చాటి చెప్పారు.

55) అనాస్తితలను దాటలేక మరో ఒక ఆలంబనం మీద ఆధారపడే వారికి ఈ అనాలయ ధర్మం అంటే భయం. వారు బుద్ధివిహీనులు, వినష్టులు.

(I. 3-7, 11-12, 21-30, 35-73, 75-76)

56) అరటి చెట్టు దొప్పలు ఒకటొకటిగా వొలిచేస్తే ఇంక మిగిలేది ఏమీ ఉండదు. ఉన్న అవయవాలన్నింటిని విడదీసి చూస్తే ఒక వ్యక్తి యొక్క స్థితి కూడా ఇంతే (అనగా వాటిలో స్థిరమైన సారం ఏదీ లేదని భావం).

57) ధర్మాలన్నీ (భూతాలన్ని) అనాత్మలు* అని బుద్ధులు బోధించారు. (సారము లేనివి, నిత్యమైన వాస్తవరూపం లేనివి అని అర్థం). ఆరు ధాతువులకు కూడా** సత్యత్వం లేదు అని వారు నిరూపించారు.

58) పారమార్థిక సత్యభూమికలో ఆత్మ ఏదో, అనాత్మ ఏదో నిరూపించే ప్రసక్తి లేదు. ఆత్మానాత్మల విషయంలో ఏ అభిప్రాయాలు ఏర్పరచుకొనవద్దని మహాముని ఉపదేశించాడు.

60) అందుచేత వాస్తవంలో ఈ ప్రపంచం సత్యానృతాతీతం. ఇది ఉన్నదని కాని లేదని కాని నిరూపిచడం కష్టం.

---

* ఆత్మ అనగా జీవాత్మ, సారము అని అర్థం. ఇది ఇక్కడ నిత్యము, వస్తు, సారము అనే అర్థాలలో ప్రయోగించబడింది. ఆత్మ కానిది అనాత్మ.

** భూమి, ఆకాశం, వాయువు, అగ్ని, జలములనే పంచ మహాభూతాలు, విజ్ఞానము ఇవి ఆరు ధాతువులు.

61) అలాంటపుడు అనిర్వచనీయరూపమైన ఈ ప్రపంచకం విషయంలో ఒకదానికి అంతమున్నదని కాని, లేదని కాని, రెండూ ఉన్నవని కాని, రెండూ లేవని కాని, సర్వజ్ఞుడైన బుద్ధుడు ఎట్లాచెపుతాడు?

62) ధర్మం ఎందుచేత అతి గంభీరమైనదనగా, ప్రాపంచిక విషయ వ్యాపృతునికి ఇది అగ్యమగోచరంగా ఉంటుంది. ఈ ప్రపంచం మాయవంటిది. అనేదే బౌద్ధోపదేశామృతం. ("మాయోపమత్వం లోకస్య").

63) ఇంద్రజాల కల్పితమైన ఏనుగ పుట్టడమూ, చావడమూ, అనేవి నిజంగా జరగకపోయినా జరిగినట్లు కనబడుతున్నాయి. అదే విధంగా మాయా సదృశమైన ఈ ప్రపంచానికి కూడా ఆవిర్భావ, తిరోభావాలు ఉన్నట్లు కనబడతాయి, కానీ వాస్తవంలో లేవు.

64) ఇంద్రజాలిక గజం ఎక్కడి నుంచి వస్తూన్నదో తెలియదు, ఇక్కడికి పోతున్నదో తెలియదు. అది "చిత్తమోహన మాత్రమే". దానికి ఉనికిలేదు నిలకడా లేదు.

65) అదేవిధంగా మాయా సదృశమైన ఈ ప్రపంచం కూడా ఎక్కడి నుంచి వస్తూన్నదో, ఎక్కడికి పోతున్నదో తెలియదు. ఇది చిత్తమోహన మాత్రమే. దీనికి ఉనికి లేదు, నిలకడా లేదు.

66) వ్యవహార మాత్రమే తప్ప వాస్తవంలో, ఈ ప్రపంచానికి దేహికమైన స్థితి లేక పోయినా ఉన్నట్లు కనబడుతున్నది. స్థితి లేదు స్థిత్యభావమూ లేదు.

67) ప్రపంచానికి అంతం ఉన్నదా, లేదా, అంతం ఉండడం, లేకపోవడం రెండూ కూడా ఉన్నాయా, రెండు లేవా అనే విషయం చెప్పశక్యం కానిది. ఈ ప్రపంచం అనిర్వచనీయము. బుద్ధుడు ప్రపంచం స్వరూపాన్ని గూర్చి ఏమీ చెప్పకుండా విడిచిపెట్టి వేయడానికిదే కారణం. మరొక కారణం ఏదీలేదు.

(II. 1-6, 9-15)

2

1) ఈ ధర్మాన్ని* సరిగా అర్థం చేసుకొనక పోయినట్లయితే అహంకారం అలాగే ఉండిపోతుంది. దాని వల్ల పుణ్యకర్మ పాపకర్మలు ఏర్పడుతాయి. వాటివల్ల మంచి జన్మ చెడు జన్మ కలుగుతూ ఉంటాయి.
2) అందుచేత అహంకారాన్ని నశింపజేసే ఈ మహోత్తమ ధర్మాన్ని అవగాహన చేసుకునే దాకా ** దాన, శీల, క్షమారూపమైన ధర్మాన్ని శ్రద్ధగా పాటించు.
3) నైశ్రేయస ధర్మాన్ని సరిగా అర్థం చేసుకొనని బుద్ధిహీనులను అది నశింప జేస్తుంది. వాళ్ళు శూన్యంలోనే మునిగిపోతారు.
4) పండితమన్యులైన కొందరు మూర్ఖులు దీనిని ఏ మాత్రమూ అర్థం చేసుకోకుండా ఖండించడానికి ప్రయత్నిస్తారు. ఆ విధంగా వాళ్లు స్వవినాశ హేతులై అవీచి నరకంలో తలక్రిందుగా పడతారు.
5) అందుచేత మీ లక్ష్యాన్ని చేరాలంటే, దీనిని ఖండించడాన్ని, శూన్యవాదాన్ని కూడా వదులుకోండి. యాదార్థ జ్ఞానం కోసం ప్రయత్నించండి.
6) ప్రతి వస్తువూ నిస్స్వభావమని తెలిసిన తరువాత సుఖం కోసం ఆశకాని, దుఃఖం తొలగిపోవాలనే తపన గాని ఉండవు. అలాంటి వారికి ముక్తి లభిస్తుంది.
7) ఈ విధంగా చూసేది ఎవరు అనేది ప్రశ్న. అలా చూసేది చిత్తము అని మామూలుగా చెప్పే సమాధానము. చిత్తవృతులు ఉంటేనే కాని చిత్తం ఉండదు. అది వాటితో పాటు కలిసి ఉండదు. అలాంటి పరిస్థితులలో అది అనావశ్యకమే అవుతుంది.
8) ఈ ప్రపంచం వ్యర్థం అసత్యము. దీనిని గ్రహించినవాడు నిరాస్పదుడు (నిలవడానికి చోటు లేనివాడు) అవుతాడు. అపుడతను కట్టెలు లేని అగ్నివలే సమసిపోతాడు.

---

* నిర్వాణాన్ని పొందడం.

** అహంకారం తొలగిపోయిన తరువాత ఇంక చేయవలసింది లోక క్షేమార్థం ప్రయత్నమే.

9) బోధిసత్త్వుడైన వానికి కూడా ఈ సత్యం తెలుసును. అందుచేత అతనికి పరిపూర్ణ జ్ఞానం కలగడం తథ్యం. అయినా, కేవలం కరుణ చేత, ఆత్యంతిక నిర్వాణం కలిగే వరకూ అతను పునర్జన్మలు ఎత్తుతూ ఉంటాడు. ఇది అతను స్వేచ్ఛానుసారంగా చేసేపని.

10) మహాయానంలో, తథాగతులు బోధిసత్త్వుని సంభారాల* స్వరూపం విశదీకరించి ఉన్నారు. అయితే వైరభావం గల మూర్ఖులు దీనిని నిందిస్తారు.

11) ఆకాశానికి వలె బుద్ధునికి మనోగోచరములు కాని లక్షణాలు ఉన్నాయి. అందుచేత మహాయానంలో అతనిని ఆ విధంగా వర్ణించడం జరిగింది. మహారాజా ఈ విషయం అంగీకరించవలసి ఉంటుంది.

12) మహాయానంలో ఉత్తమగుణాలన్నీ ఉన్నాయి. పరహితాచరణం ఒకటే దీనికి అభీష్టమైనది. వైయుక్తికాభివృద్ధికి ఇది ప్రాధాన్యం ఇవ్వదు. దీనిని ద్వేషించిన వానికి పాతిత్యం తప్పదు.

13) మహాయానం అర్థం కానప్పుడు శ్రద్ధావంతుడు కూడా దీనిని ద్వేషించ వచ్చును. మరొకరు కేవలం ద్వేషంతో దీనిని ద్వేషించవచ్చును. మొదటివాడు కూడా పతితుడవుతాడని చెప్పబడింది. ఇంక కోపముతో ద్వేషించే వాని సంగతి చెప్పాలా?

14) మహాయానంలో ప్రతీ ఒక్కటీ కరుణామూలకమే. సురక్షాహేతువైన జ్ఞానం చేత పవిత్రీకృతమైనది. బుద్ధి సరిగా పనిచేస్తున్నవాడు ఎవడు దీనిని ద్వేషిస్తాడు?

15) మహాయానానుగ్రహం వలననూ స్థానం వలననూ అత్యుత్తమ జ్ఞానం లభిస్తుంది.

16) వర్తమానంలో బాధాకరంగా ఉన్నా భవిష్యత్తులో సుఖం కలిగించే దానిని ఆచరించాలి. అలాంటప్పుడు వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ కూడా తనకే కాకుండా అందరికీ కూడా ఆనందాన్ని కలిగించే దానిని ఆచరించడం అనేది ఎంత అవశ్యకమో ఊహించుకోవచ్చును. శాశ్వత ధర్మం అలాంటిది.

17) (అ) దానశీలాదుల ద్వారా పరులకు ఉపకారం జరుగుతుంది. (ఆ) క్షమావర్యాలవల్ల తనకే ఉపకారం జరుగుతుంది. (ఇ) ధ్యాన ప్రజ్ఞల వల్ల

---

* మహాత్త్వము, పుణ్యము (సంపద) లేదా జ్ఞానము.

మోక్షం లభిస్తుంది. ఇది మహాయానోపదేశ సంగ్రహం.

18) దానము, శీలము, ఓర్పు, సహనము, సత్యము, వీటి పాలనం ప్రధానంగా గృహస్థునికి విధింపబడిన ధర్మం. ఇది కరుణాగర్భమై* (కృపాగర్భమై) ఉండాలి. దీనిని దృఢ బుద్ధితో పాటించాలి.

3

1) ఓరాజా! ధర్మ ప్రేరితములై, ధర్మ స్థిరములై ధర్మ పరినిష్ఠితములైన పనులు చేసేవాడు ఇహలోకంలో కానీ పరలోకములో కాని దుఃఖించవలసిన పని ఉండదు.

2) ధర్మం వల్ల కీర్తి, ఆనందము, ఇప్పుడూ మరణ సమయంలోనూ కూడా నిర్భయత్వమూ లభిస్తాయి. పరలోకంలో సైతం గొప్ప సుగుణం లభిస్తుంది. అందుచేత సర్వదా ధర్మనిరతుడవయి ఉండుము.

3) ధర్మమొక్కటే ఉత్తమ నీతి మార్గం. ధర్మం చేత ప్రజలు అనురాగ వంతులు అవుతారు. ప్రజానురాగం వల్ల రాజు ఇహలోకంలో కాని, పరలోకంలో కాని వంచితుడు కాడు.

4) ధర్మ విరుద్ధమైన నీతి ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తుంది. ప్రజలకు అసంతృప్తి కలిగించిన రాజు ఇహలోకంలోగాని, పరలోకంలోగాని సుఖించడు.

5) కొందరు దురభిప్రాయవంతులు, వినాశహేతువు, వంచనా పూర్ణము, క్లేశ బహుళము, దుఃఖకారణము అయిన అనర్థవిద్యను (అనర్థాలు కలిగించే విద్యను) అర్థవిద్య (అర్థశాస్త్రము) అనే పేరుతో ఎందుకు పైకి తీసికొని వస్తున్నారో తెలియదు.

6) ఒక పద్ధతి ప్రకారం ఇతరులను మోసం చేయడానికి అలవాటు పడ్డవాడు, ఒక నీతి మార్గాన్ని ఎలా అనుసరించగలడు? అలాంటివాడు వేయి జన్మల వరకూ తనను తానే మోసగించుకుంటూ ఉంటాడు.

7) నువ్వు నీ శత్రువుకు మనస్తాపం కలిగించాలంటే నీ దురభ్యాసాలన్నీ పూర్తిగా పరిత్యజించి, సద్గుణాలను, పుణ్యాన్ని సంపాదించు. దానివల్ల నీకు మేలు

---

* దు:ఖంతో ఉన్నవారు, దు:ఖం వలన బాధ చెందుతున్నవారు.

కలుగుతుంది, నీ శత్రువులకు దుఃఖం కలుగుతుంది.

8) దానమూ, మృదుభాషణమూ పరహిత కరమైన ప్రవర్తన ఆచరించు. దీని వల్ల లోక సంగ్రహమూ, ధర్మ సంగ్రహము కూడా జరుగుతాయి.

9) పాలకులు సత్యపరులైతే ప్రజల విశ్వాసం చూరగొంటారు. అసత్య వాదులైతే వారి విశ్వాసం కోల్పోతారు.

10) నిజానికి, సత్యం అంటే ఉన్నదున్నట్లు చెప్పడం కాని, సదభిప్రాయంతో చెప్పడం కాని కాదు. ఇతరులకు సర్వథా హితమైనదే సత్యము. (పరైకాన్త హితం సత్యమ్). అట్లా కానిది అనగా పరులకు హితకరం కానిది అసత్యం.

11) రాజు ఔదార్యసముచితమైన ఒక్క ఉత్తమకార్యం చేసినా అది ఆతని దోషాలన్నింటినీ కప్పివేస్తుంది. లోభం సద్గుణాలన్నింటినీ నశింప చేస్తుంది.

12) ఉపశమం వల్ల (ఆత్మనిగ్రహం వల్ల) కార్యదీక్ష అలపడుతుంది. దానివల్ల అనుభావం, దానివల్ల ప్రభుశక్తి లభిస్తాయి. అందువల్ల ఆత్మ నిగ్రహం అలవరుచుకో.

13) ప్రజ్ఞా (బుద్ధి) శాలియైన రాజు దృఢవ్రతుడు, అపరాధీనుడు (స్వతంత్రుడు) స్థిరబుద్ధి అవుతాడు. అతని నెవరూ మోసం చేయలేరు. అందుచేత ప్రజ్ఞాశాలి అవడానికి ప్రయత్నించుము.

14) నాలుగు విభేదాలు గల ధర్మంవలే, సత్యము, ఔదార్యము, ఆత్మ సంయమము, ప్రజ్ఞ అనే నాలుగు సద్గుణాలు గల రాజును మానవులూ, దేవతలూ కూడా ప్రశంసిస్తారు.

15) వాక్సంయమం కలవారూ, ప్రజ్ఞా (సూక్ష్మదృష్టి) వంతులూ, దోషదూరులూ, పవిత్రులూ, కరుణావంతులూ అయిన మంత్రుల (సలహాదారుల) సమితిలో నిత్యం కూర్చుండే రాజు యొక్క ప్రజ్ఞ, ధర్మము అభివృద్ధి చెందుతాయి.

16) హితమైన ఉపదేశం ఇచ్చేవారే తక్కువ, అలాంటి ఉపదేశం వినేవారు ఇంకా తక్కువ. హితమైన దానిని ఆచరించేవారు చాలా తక్కువ.

17) ఏది హితకరమైనదో తెలిసిన తరువాత, అది నీకు ఇష్టమైనా కాకపోయినా, వెంటనే ఆచరించు. తెలివైనవాడు ఆరోగ్యం కోసం ఎంత చేదు మందైనా మ్రింగుతాడు.

18) జీవితము, ఆరోగ్యము, రాజ్యమూ కూడా అస్థిరములనే విషయం సర్వథా భావన చేస్తూ ధర్మమును మాత్రమే ఏకైక శరణంగా ఆశ్రయించు.

19) నీ పాలనము కీర్తి భోగాల కోసం కాకుండా ధర్మం కోసమే అయిన పక్షంలో అది నిజంగా సఫలము, క్షేమకరమూ అవుతుంది. అట్లా కాకపోతే నిరర్థకము.

20) రాజా, ఈ ప్రపంచంలో పదార్థాలన్నీ సాధారణంగా పరస్పర విరోధంతో ఉంటాయి. (ఒకదానిని ఒకటి మ్రింగివేస్తూ ఉంటుంది). అయినా, రాజత్వానికి, ధర్మానికి పరస్పర విరోధం లేకుండా ఎలా చూసుకోవచ్చునో వినుము.

21) పరిణత బుద్ధులు, ఉత్తమ వంశ సంభూతులూ, ధర్మశాస్త్ర నిష్ణాతులూ, పాపభీతులూ అయిన వారినే దైనందిన రాజ్య నిర్వహణలో నియమించాలి.

22) వారు అపరాధులకు కారాగార వాసము, తాడనము మొదలైన దండనం యథాశాస్త్రంగానే ఇచ్చినా, అపరాధుల విషయంలో కరుణా ప్రేరితుడవై దయ చూపు.

23) సకల లోక క్షేమార్థమై మహాపాపాత్ముల ప్రవృత్తులను అణచి వేసేటప్పుడు కూడా కరుణామయుడవుగానే ప్రవర్తించాలి.

24) హింసాపరులు, క్రూరులు, మహాపాపాత్ములు అయినవారి విషయంలో ప్రత్యేకంగా జాలి చూపాలి. ఆత్మ వినాశానికే పాల్పడిన ఈ కృపాణులు మహాపురుషుల జాలికి అర్హులు.

25) దుర్బలులైన బందీలను ప్రతిదినమూ కాని, అయిదు రోజుల కొకసారి గాని, విడిచివేయి. మిగిలిన వారిని కూడా, వారు విడుదలకు అర్హులైనప్పుడు విడిచివేయి. ఎవ్వరినీ ఆజీవితాంతం కారాగారంలో బంధించవద్దు.

26) కొందరిని విడువకూడదని నీవు అనుకొంటున్నావంటే, వారి విషయంలో నీకు దురభిప్రాయం ఉన్నదని అర్థం. అలాంటి దురభిప్రాయం ఉంటే పాపం నిరంతరమూ పెరుగుతూనే ఉంటుంది.

27) బందీలను కారాగారం నుంచి విడుదల చేసేవరకూ వారికి సరియైన ఆహారమూ, పానీయమూ, వస్త్రాలు మొదలైనవి ఇచ్చి, స్నాన, క్షౌర, చికిత్సాది సౌకర్యాలు ఏర్పాటు చేసి, వారు కారాగారంలో సుఖంగా నివసించేటట్లు చూడు.

28) చెడుమార్గంలో ఉన్న కుమారులవలెనే, వారిని కూడా మంచి మార్గానికి తీసికొని రావాలనే సదభిప్రాయంతోనే, కరుణా పూర్వకంగా దండించాలి ద్వేషబుద్ధితో కాని, బలాత్కరించి వారి నుంచి ధన, రహస్యాదులు రాబట్టాలని కానీ దండించకూడదు.

29) మహాపరాధాలూ, హత్యలూ చేసినవారి విషయంలో కూడా, సరియైన పరీక్ష జరిగిన తరువాత, వాళ్ల చర్యలను పునఃపరిశీలన చేసి, వారిని హింసించ కుండా, చంపకుండా, నీ రాజ్యం నుంచి బైటకు పంపివేయి.

30) నీ రాజ్యంలో ఏమి జరుగుతున్నదో చార దృష్టితో స్వయంగా తెలుసుకొని, సర్వదా జాగరూకుడవై, ఆలోచనా పరుడవై ఏది ధర్మ సమ్మతమో అదే చేస్తూ ఉండు.

31) అర్హత గల సద్గుణవంతులందరినీ, ఉదారంగా పారితోషికాలిచ్చి, ఆదర చిహ్నాలు సమకూర్చి, పురస్కరించి ఆదరించు. ఇతరులను కూడా వారి యోగ్యతల ననుసరించి, ఆచారం ప్రకారం దానాదులు చేస్తూ ఉండు.

32) అంధులకూ, రోగగ్రస్తులకూ, కుంటి వారికీ, దీనులకూ, అనాథలకూ, దరిద్రులకూ ఇతరులతో సమంగా, మూల్యం లేకుండా, ఆహార పానీయాలు అందేటట్లు చూడు.

33) ఔదార్య సద్గుణాలతో పాటు, రాజతేజస్సు, ప్రభు శక్తిగల రాజు ఏలకులూ, మిరియాలూ చేర్చడం చేత ఘాటుగా ఉన్న పంచదారతో చేసిన మధుర పదార్థం వలె ప్రజల అనురాగానికి పాత్రుడవుతాడు.

34) ఈ నీతి మార్గాన్ని అనుసరించినట్టయితే నీరాజ్యం న్యాయ సమ్మతంగా ఉంటుంది. మాత్స్యన్యాయం (బలవంతులు దుర్బలులను పీడించే పద్ధతి) ఉండదు. ఈ విధంగా అన్యాయం కాని, అధర్మం కాని ఉండదు. కేవలం ధర్మం మాత్రమే ఉంటుంది.

35) ప్రపంచంలో ఉన్న విరుద్ధ పరిస్థితులను బట్టి ధర్మానుసారంగా రాజ్యం చేయడం కష్టంగా ఉన్నట్లు కనిపించిన పక్షంలో, నీవు లక్ష్య సాధనకై మరొక మార్గం అనుసరించడం తప్పని సరియైనదన్నమాట. ధర్మం జయించుగాక.

మాధ్యమిక శాస్త్రం

1) లోక సంవృతి సత్యమూ (వ్యావహారిక సత్యము), పారమార్థిక సత్యమూ అనే రెండు సత్యాలను ఆశ్రయించి బుద్ధులు ధర్మం బోధించారు. (24-8)
2) ఈ రెండు సత్యాల విభాగం తెలియని వారు బుద్ధ శాసనంలోని గంభీర తత్త్వాన్నీ తెలుసుకోజాలరు. (24-9)
3) వ్యావహారిక(సంవృతి) సత్యాన్ని ఆశ్రయించకుండా పరమార్థం ఉపదేశింప బడదు. పరమార్థాన్ని తెలుసుకోకుండా నిర్వాణం పొందడం శక్యం కాదు. (24-10)
4) శూన్యత అన్ని దృష్టులకూ నిర్గమ మార్గము (నివృత్తి కలిగించేది). శూన్యత యందే దృష్టి నిలిపిన వారిని అసాధ్యులని (చికిత్స చేయశక్యం కాని వారని) జనులు నిర్వచించారు. (13-8)
5) అనుకంపతో, సర్వదృష్టి పరిహారం కోసం సద్ధర్మాన్ని ఉపదేశించిన గౌతమునికి నమస్కారము. (27-30)
6) రెండు వస్తువులు పరస్పరము అభిన్నములుగా కాని భిన్నములాగా కాని గ్రహించబడకపోతే, లేదా రెండు వస్తువులు కలిసి ఉన్నవిగా గాని, విడిగా ఉన్నవిగా గాని గ్రహించబడకపోతే వాటిలో ఒక్కటి సత్యమని ప్రతిపాదించడం* కుదరదు. (2-21;21-6)
7) కాల్చబడే సమిధయే కాల్చే అగ్ని అయినట్లయితే, కర్త, క్రియ ఒకటే కావాలి. కాని అగ్ని సమిధ కంటె వేరైతే సమిధ లేకపోయినా అగ్ని ఉండాలి. (10-1)
8) పుడుతూ, నశిస్తూ ఉండే చిత్త వృత్తులు ఆత్మ కాదు. చూడబడేదీ, చూసేదీ

---

* ఇది నాగార్జునుని వాదంలోని ఒక యుక్తి. ఈ యుక్తి యొక్క ప్రయోగం రాబోయే శ్లోకాలలో ఉన్నది.

ఒకటి ఎలా అవుతుంది? (27-6)

9) అలా కాక ఆత్మ చిత్త వృత్తుల కంటె భిన్నమైనదని కూడా నిరూపించడం కుదరదు. అది భిన్నమైనట్లయితే, అది వాటి కంటె వేరుగా కనబడాలి. ఆ విధంగా కనబడడంలేదు. (27-7)

10) ఆత్మకూ, చిత్త వృత్తులకూ ఉన్న సంబంధం అగ్ని సమిత్సంబంధ దృష్టాంతం ద్వారా నిరూపించబడింది. ఘటపటాది సకల వస్తువుల విషయంలో కూడా ఈవిధంగానే వ్యాఖ్యానించవచ్చును. (10-15)

11) అదేవిధంగా ఒక వ్యక్తి, ఆతని భావాలూ, కలసి ఉంటాయా, వేరు వేరుగా ఉంటాయా అనేది నిరూపించడం కష్టం. ఈవిధంగా ఏ పదార్థం విషయంలోనూ, కలిసి ఉంటుందా, వేరుగా ఉంటుందా అని నిరూపించ శక్యం కాదు.* (6-10)

12) అన్య పదార్థం నుండి పుట్టినది ఆ అన్య పదార్థం కాజాలదు. దాని కంటె భిన్నమూ కాజాలదు. అది నిషేధ్యమూ కాదు. శాశ్వతమూ కాదు (18-10).

13) మరొక దాని మీద ఆధారపడకుండా పుట్టినదని చెప్పదగిన పదార్థం ఉండదు. అందుచేత అశూన్య పదార్థమనేది లేదు. (24-19)

14) ప్రతీత్య (ఇతరములపై ఆధారపడి) సముత్పన్నమైనది స్వభావతః శాంతము సముత్పన్నము, సముత్పత్తీ కూడా శాంతములే. (7-16)

15) దేని శూన్యత సత్యమో అది సత్యమే. దేని శూన్యత అసత్యమో అది అసత్యమే (అనగా స్థితి కలదానికి (స్థితికి) శూన్యతకూ విరోధం లేదు). (24-14)

16) శూన్యం కాని కార్యం పుట్టదు; నశించదు. ఈవిధంగా అశూన్యమైనది అనుత్పన్నము. అనిరుద్ధము (నాశరహితము). (20-17)

---

* ద్రవ్య గుణాలూ, కర్తృక్రియలూ, లక్ష్య లక్షణాలు కార్యకారాణాలు, అవయ వాయువులు, పితృపుత్రులు, గురుశిష్యులు, బద్ధముక్తులు, ఈ విధంగా ఆయా క్రియలతో సంబంధించిన ద్వంద్వాల విషయంలో, అవి పరస్పరమూ అభిన్నములని కాని, భిన్నములని కాని చెప్పడానికి వీలులేదు. నిజానికి అభిన్న పదార్థాల మధ్య కాని భిన్న పదార్థాల మధ్య కాని సంపర్గం ఉండడానికి అవకాశం లేదు (14-8). ఈ యుక్తిని బట్టి ఏర్పడిన కొన్ని నిర్ణయాలు ఈ క్రింది శ్లోకాలలో చెప్పటం జరిగింది.

17) శూన్యం ఎలా పుట్టుతుంది, ఎలా నశిస్తుంది? అందుచేత శూన్యం కూడా అనుత్పన్నము, అనిరుద్ధము. (20-18)

18) భావాలు (పదార్థాలు) అన్యధా భావం పొందుతూ (ఇతర భావాలుగా మారుతూ) ఉంటాయి. అందుచేత అవి నిస్స్వభావాలు. స్వభావంలేని భావం ఉండదు. అందుచేత భావాలకు శూన్యత్వమే. (13-3)

19) స్వభావం లేకపోతే అన్యధాభావం పొందేది ఏది? స్వభావం ఉన్నట్లయితే కూడా అన్యధాభావం పొందేది ఏది?. (13-4)

20) అశూన్యం (శూన్యం కానిది ఏదైనా) ఉంటే శూన్యమనేది ఉండవచ్చును. అశూన్యం లేనపుడు శూన్యం ఎక్కడి నుంచి వస్తుంది? (13-7)

21) ప్రతీత్య సముత్పాదాన్నే శూన్యత అంటున్నాము. ఇది ఒక కల్పిత ప్రజ్ఞప్తి. అదియే మధ్య మార్గము. (24-18)

22) సరిగా అర్థం చేసుకోబడని శూన్యత, స్థూల బుద్ధులను, సరిగా పట్టుకోబడని సర్పం వలె, సరిగా చేయబడని మాయావిద్య వలె నశింపచేస్తుంది.(24-11)

23) ఉత్పత్తి, స్థితి, భంగాలే సిద్ధములు కానప్పుడు (కుదరనప్పుడు) సంస్కరించ బడేదేది ఉంటుంది? సంస్కృతమైన దాన్ని ప్రతిపాదించడం కుదరని పక్షంలో అసంస్కృతమైన దానిని ప్రతిపాదించడమెట్లా కుదురుతుంది? (7-33)

24) ఉత్పత్తి, స్థితి, భంగాలు, మాయా, స్వప్న, గంధర్వ నగరాల వంటివని చెప్పబడింది. (7-34)

25) తథాగతుని స్వభావం ఎట్టిదో ఈ ప్రపంచ స్వభావం కూడా అట్టిదే. తథాగతుడు నిస్స్వభావుడు. ప్రపంచం కూడా నిస్స్వభావమే.* (22-16)

26) బుద్ధుడు నిరోధానంతరం (మరణానంతరం) ఉంటాడని కాని ఉండడని కాని, ఉంటాడు, ఉండడు అని కాని, రెండూ కూడా కాదని కాని ఊహించ శక్యం కాదు. (25-17)

27) బుద్ధుడు జీవించి ఉన్నప్పుడు కూడా అతను ఉన్నాడని కాని, లేడని కాని, ఉన్నాడు లేడు అని కాని, మిగిలిన రెండు వికల్పాలు కాని ఊహించ శక్యం కాదు. (25-18)

---

* బుద్ధులకు, ఇతరులకు మధ్య భేదం లేదు. "బుద్ధానాం సత్వధాతోశ్చయే-నాభిన్నత్వ మర్హత:, చతుస్తవము.

28) కల్పనా రహితుడు (ప్రపంచాతీతుడు), వినాశ రహితుడు (అవ్యయుడు) అయిన బుద్ధుని విషయంలో కల్పనలు చేసేవారు, అలా చేయడం చేత వినాశం పొందుతారు. అలాంటి వాళ్ళు తథాగతుని చూడలేరు.

29) బుద్ధులు ఆత్మ ఉన్నదనీ చెప్పారు, లేదనీ చెప్పారు. నిజానికి వారు ఆత్మ యొక్క అస్తితను కాని, నాస్తితను కాని, మరొక విషయమేదేనా కాని బోధించలేదు. *

30) పూర్వం కూడా నేను ఉండేవాడను అని చెప్పడం కుదరదు. ఎందువలన అనగా వీడు పూర్వ జన్మలో ఎవడై ఉండేవాడో అతను కాడు. (27-3)

31) నేను పూర్వం లేను అని చెప్పడం ఉపపన్నము కాదు. ఎందువలన అనగా వాడు పూర్వ జన్మలో ఉన్న వాని కంటే భిన్నుడు కాదు. (27-9)

32) (ఇపుడున్న వ్యక్తికి సంబంధించిన) ఈ స్కంధ సంతానం (పూర్వం ఉండే వ్యక్తికి సంబంధించిన) ఆ స్కంధ సంతానం నుంచి, దీప కాంతుల సంతానం వలె అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూంది. అందుచేత ఇది సొంతమని కాని అనంతమని కాని చెప్పడం కుదరదు. (27-22)

33) ఆత్మ చిత్త వృత్తుల కంటె భిన్నమైన ఒకానొక వస్తువు కాదు. ఇది చిత్త వృత్తి సముదాయాత్మకం కూడా కాదు. చిత్త వృత్తులు లేకుండా ఆత్మ లేదు. ఆత్మ నాస్తి కూడా కాదు. ఇదే నిర్ణయం. (27-8)

34) ద్రష్ట (చూసేవాడూ), దృశ్యమూ (చూడబడేది) భిన్నములుగా గాని అభిన్నములుగా గాని ఉండజాలవు. ద్రష్టయే లేనపుడు దృక్ (చూచుట) దృశ్యాలు ఎక్కడ ఉంటాయి. (3-6)

35) దృగ్ దృశ్యాలకు స్థితి లేదు గాన చతుర్విధ విజ్ఞానానికి కూడా స్థితి లేదు. అలాంటపుడు చిత్త వృత్త్యాదులకు స్థితి ఎక్కడిది? (3-8)

36) ఇంద్రియ విషయాలన్నీ, నిజానికి అన్ని ధర్మాలు కూడా గంధర్వ నగరం వలె కనబడుతున్నాయి. మరుమరీచికా స్వప్నతుల్యములు. (23-8)

37) మాయా పురుషుల వంటివి, ప్రతిబింబాల వంటివి అయిన వీటిలో శుభం కాని, అశుభం కాని ఎట్లా వుంటుంది? (23-9)

38) రూప, శబ్ద, రస, స్పర్శ, గంధ, ధర్మ రూపాలైన షడ్విధ వస్తువులు కూడా రాగద్వేష మోహ స్థానాలుగా కల్పించబడుతున్నాయి. (23-7)

39) ప్రతీత్య సముత్పాదాన్ని తెలుసుకోగలిగినవాడు, దుఃఖాన్నీ తత్కారణాన్నీ,

తన్నిరోధాన్నీ, తన్నిరోధ మార్గాన్నీ తెలుసుకోగలుగుతాడు. (24-40)

40) దుఃఖమూ, దాని కారణమూ, దాని నిరోధమూ అసత్యములు కానప్పుడు (ఆర్యసత్య రూపమైన) మార్గం దుఃఖ నిరోధం ద్వారా ఎక్కడికి తీసికొని వెడుతుంది? (24-25)

41) సంస్కారాలకు నిర్వాణం అసంభావ్యం, సత్త్వానికి కూడా నిర్వాణం ఏ విధంగానూ కుదరదు. (16-4)

42) చిత్త వృత్తులే బంధమైతే చిత్త వృత్తి కలవానికి బంధం లేదు. అవి లేని వానికి కూడా బంధం లేదు. (16-6)

43) బద్ధుడు ముక్తుడు అవడంలేదు బద్ధుడు కాని వాడు కూడా ముక్తుడవడం లేదు. బద్ధుడు ముక్తుడగుచున్నాడు అనే పక్షంలో బంధమోక్షాలు రెండూ సమకాలికములు కావలసి వస్తుంది. (16-8)

44) నిర్వాణమనేది విడిచేది కాదు, పొందేది కాదు; నశించేది కాదు. శాశ్వతము కాదు, నిరోధించబడేది కాదు, ఉత్పన్నము కాదు. (25-3)

45) "మనస్సు నుంచీ దాని వృత్తుల నుంచీ దూరమైనప్పుడు నేను నిర్వాణం పొందుతాను" ఇలాంటి భావన కలవారు మనస్సునూ, దాని వృత్తులనూ మాత్రమే గట్టిగా పట్టుకొని ఉంటారు. (16-9)

46) నిర్వాణాన్ని సంపాదించడం అనేది, సంసారాన్ని పరిత్యజించడం అనేది లేనప్పుడు సంసార నిర్వాణాలు భావనా మాత్ర కల్పితాలని చెప్పాలి. (16-10)

47) సంసారానికి నిర్వాణానికీ మధ్య లేదా నిర్వాణానికి సంసారానికి మధ్య ఈ షత్తు కూడా భేదం లేదు. (25-19)

48) నిర్వాణానికి ఏది కోటియో అదే సంస్కారానికి కూడా కోటి. ఈ రెండింటికి కొంచెం కూడా భేదం లేదు. (25-20)

49) ఉత్పాదితమూ, వ్యవచ్ఛన్నమూ అయినది సంసారము. అదే అనుత్పన్నము అవ్యవచ్ఛిన్నము అయితే నిర్వాణము. (25-9)

50) చిత్తానికే విషయం కానిది వాక్కులకు ఎట్లా గోచరం అవుతుంది? అందుచేత ధర్మత్వము (ధర్మముల ప్రవృత్తి) నిర్వాణం వలే ఉత్పత్తి నిరోధములు లేనిది. (18-7)

నిర్దిష్ట సూచికలు - టిప్పణులు

1. "భిక్షుఃశ్రీమాన్ మహాయశాః"- "లంకావతార సూత్రము" శగతకమ్. పు. 286.
2. Vallce Poussin, in "Encyclopaedia of Religion and Ethics, Vol. viii, 235b-36a.
3. Mrs. B.L. Suzuki, "Mahayana Buddhism", London, 1959.P.88.
4. Shinsho, in C.A. Moore(ed.) The Japanese Mind Honolulu, 1967, p. 45, No. 7 (షిన్షో, టోకియో విశ్వవిద్యాలయంలో జపాన్ బౌద్ధమత ఆచార్యులు)
5. Manual of Indian Buddhism, Delhi (Reprint) 1968, p. 123.
6. Hinduism and Buddism, London, (Reprint)1962 vol. 2.
7. 'The Life of Nagarjuna from Tibetan and Chinese Sources', Asia Major, : Hirth Anniversary Volume, London, 1923, p. 421.
8. ఆనందగిరి లేదా అనంతానందగిరి: *శంకర విజయము*, చివరి అధ్యాయము.
9. లక్ష్మణాచార్య: *శ్రీవిద్యార్ణవము.*
10. మాధవుడు: *సర్వదర్శన సంగ్రహాము*
11. మాధవుడు: *శంకర దిగ్విజయము*
12. 'Buddhism in China and Japan' in K.W. Morgen(ed) The Path of the Buddha, New York, 1956, p. 196.
13. Walleser, Op.Cit.,p.431.
14. Prozyluski, La Legende de l' empereur Asokatpp.166ff.
15. The Prajnaparamita Literature, 's.Graventhage,the Hague,1960.
16. Conze, loc cit.

17. E. Conze. 'Thirty years of Buddhist Studies' Oxford, 1967. p. 168
18. M. Rama Rao (ed) *శాతవాహన సంచిక*, గుంటూరు 1950. ఈ వంశానికి చెందిన ఇద్దరు ముగ్గురు రాజులు శాతవాహన రాజులు కారు. వేరు వేరు కాలాలకి, ప్రదేశాలకి సంబంధించిన వీరు ప్రాదేశిక ప్రభువులుగా ప్రసిద్ధులు.
19. I, P 88 etc cited by K.R. Subramanian, *Buddhist Remains in Andhra*, Andhra University, Waltair, 1932, p.60.
20. K.A. Nilakantha Sastri, *A History of South India*, Madras, 1966, p. 447.
21. రాజుకు మేనత్తయైన చాంతిశ్రీ మహాచైత్యాన్ని నిర్మించినదని జె.పి. వోగెల్ అభిప్రాయం. ఈమె మహాచైత్యాన్ని పునరుద్ధరించినదని ఇతర పండితుల అభిప్రాయం. పొలోమొలోకిలి `శ్రీపర్వతమనీ నాగార్జునుడు దానిపై నివసించినాడనీ వొగెల్ అంగీకరించినాడు.
22. శాతవాహనుల ఐతిహాసిక క్రమం అనిశ్చితంగా ఉంది. నేను రామారావు ఇచ్చిన దానిని అనుసరిస్తున్నాను. (చూ.) నీలకంఠ శాస్త్రి యజ్ఞశ్రీ శాతకర్ణికి క్రీ.శ. 170-99 సంవత్సరాలు అంగీకరించినాడు.
23. Burgess, *Amaravati and Jaggayyapeta Stupas*, P.III, Ramachandran *Memoirs of the Archaelogical Survey of India*, No. 71 (Published 1953) p. 28.
24. Coedus, *Inscriptions du cambodge*, Vol.I.pp.36-46, శివసోముడు కాంభోజరాజుకు (క్రీ.శ. 802-869) మేనల్లుడు కూడ. శివసోముని కాలం తెలియడంచేత, ఈ శివసోముడు ఆది శంకరాచార్యులనే నిర్దేశిస్తున్నాడని అంగీకరించిన పక్షంలో, శంకరాచార్యుల కాలం నిర్ణయించవచ్చును. ప్రకృతంలో జయప్రభ చంద్ర ప్రభులను గూర్చి ఏమీ తెలియదు.
25. Kern, ibid, pp. 122-3; Subramanian, ibid, cites Geiger, *Mahavamsa* Ch.36.
26. R.H. Robinson, *Early Madhyamika in India and China*, Madison, 1967, p. 94.
27. E. Lamottee, *L'ensugnement de Vimalakirti*, Louvain, 1962, p. 70-77.

28. E.J. Eitee, *Handbook of Chinese Buddhism*, Tokyo, 1904, p. 193.J.Edikins, *Chinese Buddhism*, London 2nd edn., n.d.p.201. ఎడ్కిన్సు, ఈటెల్ చెప్పిన 194 వ సంవత్సరాన్ని అంగీకరించాడు. (P.415) E. Gene Smith (U.S. Congress Library) నాతో చెప్పిన దానిని బట్టి సంవత్సరం తెలియకపోతే చాంద్రమానం ప్రకారం ఇచ్చిన దినాన్ని ఆంగ్ల పంచాంగానికి అనుగుణంగా మార్చడం అసంభవమని తెలుస్తున్నది.
29. Ui, *The Vaiseshika Philosophy*, London, 1917, pp.423-433
30. H. Ryusho, సువిక్రాంత విక్రమి పరిపృచ్ఛా ప్రజ్ఞా పారమిత సూత్ర, Fukuoka, 1958, p.e III,f.n.
31. నీలకంఠ శాస్త్రి, ఆర్.సి. మజుమ్దార్ వంటి ప్రసిద్ధ ఐతిహాసికులు వ్రాసిన ప్రామాణిక గ్రంథాలలో, ఆతను క్రీ.శ.71వ సంవత్సరం తరువాత కొద్దికాలానికి రాజ్యానికి వచ్చాడని కొందరి అభిప్రాయము. చూ. J.E.Van Hohuizen-de Leeuw *The Scythian Period*, Leiden, 1949, ch.I.
32. Sylvaini Levi "Kanishka et Satavahana, deux figures symboliques" etc. in *Journal Asiatique*, Paris, 1936, pp. 61-121.
33. రాజ తరంగిణి, 1.173.
34. T. Watters, *On Yuvan Chwang's Travels in India*, London, 1905, Vol.II, p.286.
35. S. Beal, 'The Age and Writings of Nagarjuna-Bodhisathva' in *The Indian Antiquary*, Vol. XV, 1886, p. 353, 356, కనిష్కుని సభ క్రీ.శ. 70 సం.లో లేదా 75 సం.లో జరిగినదని బీల్ అభిప్రాయము.
36. Ui, loc, cit., goves A.D. 13 for Asvaghosha.(యు.ఇ.ప్రకారం అశ్వఘోషుడు క్రీ.శ.13 వ సంవత్సరం ప్రాంతంలో జన్మించినాడు) అశ్వఘోష, నాగార్జునుల మధ్య కొన్ని శతాబ్దాల వ్యవధానం ఉన్నదని కుమారాజీవాదుల అభిప్రాయం (Robbinson, ibid, p.25-6). ఒక బౌద్ధాచార్య పరంపరకు సంబంధించిన నామ పట్టికలో అశ్వఘోష నాగార్జునుల మధ్య కపిమాలుని పేరు ఉన్నది. అందుచేత అశ్వఘోష నాగార్జునులు సమకాలికులు కాకపోవచ్చును. అయితే ఈ పట్టిక అంత ప్రామాణికమైనది కాదు.

37. P.S. Sastri, Nagarjuna and Aryadeva, in *Indian History Cal Quarterly*, Vol XXXI, No. 3, Calcutta, for a more detailed argument, G.V. Krishna Rao (ed. & tr.) విగ్రహవ్యావర్తని, తెనాలి n.d.pp.8-10
38. పైదే.
39. IV.79,87,88
40. IV. 18
41. Levi, పైదే.
42. నీలకంఠ శాస్త్రి ప్రకారం ఇతని కాలం క్రీ.శ. 80–104 ప్రాంతం, రోమిలా థాపర్ క్రీ.శ. 86–114.
43. విండిష్, గోపీనాథ కవిరాజులు న్యాయ దార్శనికుడైన వాత్స్యాయనుడు క్రీ.పూ. రెండవ శతాబ్దానికి లేదా మూడవ శతాబ్దానికి చెందినవాడని చెపుతున్నారు. జాకొబి, విద్యా భూషణుడు, హెచ్.పి.శాస్త్రి, కేథ్, రాధాకృష్ణన్ వీరు ఇతను నాగార్జునునికి పరవర్తి అనీ క్రీ.శ. 400 ప్రాంతానికి చెందిన వాడనీ చెపుతున్నారు. ఇతనూ కామసూత్ర రచయిత ఒకరు కాదనే విషయంలో అందరికీ ఐకమత్యం ఉంది.
44. K.V. Ramanan, *Nagarjuna's Philosophy,* Rutland and Tokyo 1966, p. 341.n.64.
45. *Buddhist Logic*, Vol.I, Leningrad, 1932, p. 29, n.1.
46. "తనోతివిపులానర్థాన్ త్రాణంచకురుతే"– కామికాగమము.
47. 'Animadversiones, Indicae' in *Journal of the Asiatic Society of Bengal*, N.S. Vol. XXVI, 1930, p. 128.
48. 'Yoga' *Immortality and Freedom*, New York, 1958.p. 293, 201.
49. *Nikaya Sangahawa,* (Written 1395) Colombo; n,d.
50. *Indian Historical Quarterly,* 1933. p.g.
51. డెమివెల్లె దీని ప్రామాణికత్వాన్ని నిరూపించినాడని తుచ్చి చెప్పినాడు. తుచ్చి– పైదే. పు. 144
52. అసంగుడు వ్రాసినట్లుగా చెప్పే ఈ గ్రంథంలోని సాధనలు ప్రచీనుడైన అసంగుని రచనలు అవడానికి వీలు లేదని వింటర్ నిటజ్ చెప్పినది యుక్తమే. *A History of Indian Literature*, Vol. II Calcutta, 1933 P. 392.

53. తుచ్చి, పైదే. పు. 143.
54. ఈ వాక్యం చాలా పుస్తకాలలో ఉన్నది. ఉదాహరణకు *యోగరత్నమాల, వజ్రశేఖర, అద్వయ వజ్ర సంగ్రహ.*
55. B. Bhattacharya. (ed.) *Two Vajrayana works*, Baroda, 1929.p.75.
56. 'On Sunyata and Karuna', See B.Bhattacharya(ed.) *Sadhanamala* 2. Vols. Baroda, 1925 & 1928, p. III, 26, 82.
57. H.Hoffimann, *The Religions of Tibet*, London, 1961, pp.33-5.
58. P.C.Bagchi (ed.) *Dohakosha*, Calcutta, 1938; These were first published in 1928. On Saraha's date, E. Conze (ed.) *Buddhist Test Through the Ages*, New York, 1954,pp.13-4.
59. గౌరన రచించిన *"నవనాథ చరిత్ర"* (మద్రాసు విశ్వవిద్యాలయము, 1937). నాథుల జీవిత చరిత్రలను గూర్చి తెలుగులో నియమబద్ధమైన పద్ధతిలో, క్రీ.శ.1376 ప్రాంతంలో రచించబడిన ఈ గ్రంథం సిద్ధులకూ, నాథులకూ అభిన్నత్వాన్ని ప్రతిపాదిస్తూన్నది. ఇతర మౌలికాధారాలు దీనికి ఉపష్టంభకాలుగా ఉన్నాయి.
60. *"గోరక్ష శతకము", "హఠయోగ ప్రదీపిక"* (15 వ శతాబ్ది ప్రాంతము) ఇవి ప్రాచీనతమములైన హఠయోగ గ్రంథాలు. రెండింటిలో మొదటిది ప్రాచీన తరమైనది కావచ్చును.
61. టిబెట్ ఆఖ్యానాలు చాలా వాటిలో 84 గురు పేర్కొనబడ్డారు. ప్రామాణ్యం విషయంలో తక్కువది కాని "హఠయోగ ప్రదీపిక"లో మహాసిద్ధులు 35 గురు మాత్రమే చెప్పబడ్డారు.
62. రాహుల సాంకృత్యాయనుడు 84 గురు సిద్ధుల పేర్లు సంకలనం చేశాడు. *Jounral Asiatique*, Paris, CCXXV, 1934, pp.218 ff
63. ప్రకరణ. III, pp. 168173.
64. ప్రకరణ. V pp. 332-347.
65. కేవలం ఈ ఆచార్య పరంపర పట్టికను ఆధారంగా చేసుకొని 1932లో బి.భట్టాచార్య సరహుడు 633 ప్రాంతానికి చెందిన వాడనీ, సిద్ధ (తాంత్రిక) నాగార్జునుడు 645 ప్రాంతానికి చెందినవాడనీ, ఇతను తంజావూరులో అనేక తంత్ర గ్రంథాలు రచించాడనీ ఊహించినాడు. (*An Introduction to*

Buddhist Esoterism, Varanasi, (Reprint) 1964, p. 67-68) సరహుడు ఏడవ శతాబ్దంలో ఉండలేదనీ, భట్టాచార్య అంగీకరించిన పట్టికలోని సప్తమాష్టమాచార్యులైన జాలంధరి-కృష్ణులు పదవ శతాబ్ది ఉత్తరార్ధానికి చెందిన వారనేది చాలా వరకు సత్యమైన విషయం (Hoffimann, op. cit., p.57) "నాగార్జునుడు" వ్రాసినట్లు చెప్పే తంజావూరు తాంత్రిక గ్రంథాలన్నీ ఒక వ్యక్తి వ్రాసినవి కాదనే విషయం కూడా నిశ్చితమే.

66. నాలుగు పరంపరలు వరుసగా ఈ క్రింది గ్రంథాల నుంచి గ్రహించ బడ్డాయి. (1) "గ్రుబ్‌తాబ్". టిప్పణుల రూపంలోను, గ్రంథాల రూపంలోను ఉన్న టిబెట్ బౌద్ధ మత గ్రంథాల సంకలన రూపమైన తంజావూర్ 86 వ భాగంలోని మొదటి గ్రంథం. (2) మార్‌పాకు ఉత్తరాధికారీ, 16 వ శతాబ్దికి చెందినవాడూ అయిన టిబెట్ దేశీయ "ఐతిహాసికుడు" పద్-మ-ద్కర్‌పో ఇచ్చినది ఆఖ్యానం. కొన్ని మౌలికాధారాలలో, సాలములో "నాగార్జునుడు" ఒక అభీరబాలుని ఆశీర్వదించినాడనీ, తత్ఫలితంగా అతను రాజైనాడనీ, ఆ రాజు సాతవాహనుడు లేదా ఉదయనుడు అనీ చెప్పబడింది, (3) పద్మ సంభవుని శిష్యురాలైన యొషీ షోగ్యాల్ వ్రాసిన "పద్మ సంభవుని జీవితము అతని ఉపదేశములు"*(The Life and Teachings of Padmasambhava)* అనే గ్రంథం. (4) తుచ్చి ప్రకటించిన "సిద్ధామ్నాయము" అనే నేపాల దేశీయ సంస్కృత గ్రంథముపై ఇవ్వబడిన జన్మ స్థానాల పేర్లు 1,4 మౌలికాధారాలలో ఉన్నవి; బుస్టన్ మరియు తారానాథుడు చెప్పినవి, సుంపా ఖంపో వ్రాసిన "చరిత్ర"లో (క్రీ.శ. 1747) వున్నాయి. దీని ప్రకారం ఇతను ఖైదాలో జనించాడు.

67. W.Y. Evans-Wentry, *Tibetan Yoga and Secret Doctrines*, Oxford, 1967, pp. 120 n3, 345-6, 155.

68. తుచ్చి పేర్కొన్నాడు. పు. 140.

69. అభిసమయాలంకారాలోకము p.12.

70. *"కక్షపుటం"* అనేది ఒక అభిచారిక ప్రక్రియా గ్రంథం. ఇది సిద్ధ నిత్యనాథుడు రచించినదని కొందరి అభిప్రాయము. ఏడు, ఎనిమిది శతాబ్దాలలో తాంత్రికుడైన ఒక నాగార్జునుడు శ్రీపర్వతం మీద నివసించి కార్యకలాపాలు సాగించాడని చెప్పడానికి పురావస్తు శాస్త్రీయ ప్రమాణాలేవీ లేవని

జాన్-యున్-హువా అభిప్రాయపడుతున్నాడు. ఇంకా వాఙ్మయరూపమైన ఆధారం చూడబోతే చైనా యాత్రికుడైన హ్యుయిన్‌త్సాంగు, కొరియా యాత్రికుడైన హుయిఛాజ్ కూడా తాము దక్షిణ దేశంలో యాత్ర చేసే నాటికి శ్రీపర్వతం ధ్వంసం చేయబడినదని వ్రాస్తున్నారు. ఏడు, ఎనిమిది శతాబ్దాలలో తాంత్రిక నాగార్జునుడు శ్రీపర్వతాన్ని తారా ఉపాసనకు కేంద్రంగా చేసుకున్న పక్షంలో, ఆ కాలంలో అది అభివృద్ధి దశలో ఉండి ఉండాలి కదా అని జన్-యున్‌హువా వాదం. మనకు లభిస్తున్న అన్ని ఆధారాలను బట్టి కూడా నాగార్జున కొండ రెండు మూడు శతాబ్దాలలో మాత్రమే అభ్యున్నతిలో ఉండేదని తెలుస్తూంది. దీనిని బట్టి మనకు లభించే నిర్ణయం సుస్పష్టమే. చూ. అతని వ్యాసం "Nagarjuna, one or more" in *History of Religions*, Chicago, Aug. 1970, "Nagarjuna Konda" in *Journal of Indian History*, vol. XLVIII, part III No. 143, Aug. 1970.

71. Ed. K.S. Sastri, Trivandrum, 1928.
72. Leon Wieger : *Histoire des Croyances religieuces et des opinions philosophiques en chine*, Hsien-hsien, 1927, p.395 While Wieger puts Ko Hung in the 3rd, T.L. Davis assigns him to 4th century (*Journal of Chemical Education*, (Easton Pa), XI, (1934) p. 517-20).
73. J. Filliozat, *Le Doctrine classique de la medicine indicinne*, Paris, 1949. also see: Levi, loe, cit P. Ray (ed.) *History of Chemistry in Ancient India and Medieval India*, Calcutta 1956, p. 116-8.J. Filliozat, "Nagarjuna et Agastya, Medicines, Chimistes et sorciers" in *Actes Du XXc Congre's International Des Orientalistes*, Brussels, 1938, Published 1940, Louvain, pp.228-9.
74 E.C. Sachau (ed.) *Alberuni's India*, Vol. I, Delhi, 1964, p. 189
75. "Life of Nagarjuna" in *The Indian Historical Quarterly*. Vol. XXX No. 1, p.p. 93-5.
76. Das, "Life and Legend of Nagarjuna" in *Journal of the Asiatic*

Society of Bengal, Vol.LI, 1882, pp. 115. ff Wallesser : See note 7. Two other Tibetan books which refer to Nagarjuna mentioned in note 66 are not important.

77. For account of Chinese version, Tucci, loc, cit, p. 144-5. for Tibetan version, Buston's *History of Buddhism* (Tr. Obermiller), pt I.P. 129, Tucci's translation of Tibetan version differes from Ombermille's Buston doubts whether this *Sutra* refers to Nagarjuna. (ఈ సూత్రం నాగార్జునుణ్ణి నిర్దేశిస్తుందా అన్న విషయంలో బుస్టన్ సందేహం ప్రకటించినాడు)
78. Robbinson, ibid, p. 24, నాగార్జునుని కాలం విషయంలో చిట్సాంగ్ ఈ సూత్రాన్ని ఆధారంగా గ్రహించాడు. (శతశాస్త్రానికి ఉపోద్ఘాతము)
79. Buston, loc.cit. p. 130
80. Robbinson, loc. cit.,p.25cp. Wallesser, ibid, p. 443.
81. Wallesser, loc.cit.,p.443 f. and his notes.
82. Loc. cit.,p. 442.
83. Eliot, ibid., Vol. III (Reprint) 1962, p. 306-7.
84. P.S. Sastri, loc. cit. V.W. Karambelkar, "The Problems of Nagarjuna" in *Journal of Indian History*, Vol. XXX, 1952 Trivandrum 1953 p.24.
85. A Ghosh, *A Guide to Nalanda*, Delhi, 1946, p. 40f.
86. H.D.Sankalia, *The University of Nalanda*, Madras, 1934. p.p. 214, 102.
87. E.B. Gowell and F.W. Thomas, *The Harsha Charitra of Bana*, Delhi, 1968, p. 252-3.
88. *Annual Bibiography of Kern Institute for 1929*. p. 13. Subramanian, ibid.p.53.
89. K. Gopalachari, *Early History of the Andhra Country*, Madras, 1941.p.124.
90. Nayasena, *Dharmamrita*, 11th ch. (Kannada work).

91. K.A.N. Sastri *Journal of Oriental Research,* Madras, IX, 13 p. 96f.
92. loc.cit., p. 355.
93. *Epigraphica Indica,* XV
94. Edkins, ibid, p. 63.
95. Edkins, loc.cit., p.61-2.
96. Wing-tsit-chan, *A Source book in Cinese Philosophy*, Princeton, 1963, p.358.
97. Chan, loc. cit, p. 370.
98. A. Dumoulin, *A History of Zen Buddhism*, New York, 1965, p. 36.
99. Ibid, vol. II.p. 46.
100. Ibid., p. 159-60.
101. M. Anesaki, *History of Japanes Religion*, Rutland&Tokyo, 1963, p.60.
102. Sir Charles Iliot, *Japanese Buddhism*, London, (Reprint) 1964, pp 202, 204.
103. Anesaki, loc, cit.
104. *Japanese Buddhism,* p. 179
105. Hoffimann, ibid, p. 77-8.
106. Sir Charles Bell, *The Religion of Tibet,* Oxford (Reprint) 1968, p. 40.

Laser typesetting at Vijaya Press, Mangalagiri,
Printed at Pushpak Press. Pvt. Ltd., Okhla, New Delhi



నాగార్జునుడు గంభీరమైన తాత్విక చింతన, నిగూఢమైన ఆధ్యాత్మిక దృష్టి గల భారతీయ తత్వవేత్త. బుద్ధుడే నాగార్జునుడిగా మళ్లీ జన్మించాడని కొందరి విశ్వాసం. మహాయానానికి ఒక తాత్విక రూపాన్ని కల్పించిన నాగార్జునుడు 'మహాయాన పితామహుడుగా' పరిగణించబడ్డాడు. ఇతనిని తాంత్రికునిగా భారతీయ, టిబెట్ సంప్రదాయాలు పేర్కొనగా, ప్రాచీన చైనా దేశ గ్రంథాలు జ్యోతిష శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త, శారీర శాస్త్రజ్ఞుడు, ధాతువిద్యా విశారదుడు, రసాయనశాస్త్ర నిపుణుడు. లోహపరిణామ విధాత, ప్రసిద్ధ భిషగ్వరుడు అంటూ పేర్కొన్నాయి. నాగార్జునుని వ్యక్తిత్వం, సిద్ధాంతం, బోధనలు వివరించే జీవిత చరిత్ర ఇది.

ఆచార్య కె. సచ్చిదానంద మూర్తి ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరులో తత్వశాస్త్ర ఆచార్యులుగాను, యూనివర్సిటీ పోస్టు గ్రాడ్యుయేటు సెంటరు, గుంటూరులో ప్రిన్సిపాలుగాను పనిచేశారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి వైస్-చాన్సలర్‌గా, ప్రిన్స్‌టన్ యూనివర్సిటి విజిటింగ్ ప్రొఫెసరుగా వున్నారు. వేదాంత సంబంధమైన అనేక గ్రంథాలు రచించారు.

ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు వేదాంత విషయ నిపుణులు, పండితులు, గ్రంథకర్త, అనువాదకులు. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో సంస్కృత విభాగానికి అధ్యక్షులుగా పనిచేశారు.

రూ. 45.00 ISBN 978-81-237-5812-1

నేషనల్ బుక్ ట్రస్టు, ఇండియా